

ఆంధ్రపత్రిక
సచిత్ర వారపత్రిక
ANDHRA PATRIKA
ILLUSTRATED WEEKLY
4 అణాలు 18-4-'56



కొంగల జంట

—ఫొటో : డి. రామలింగేశ్వరరావు.


సంవత్సర చందా
రు. 12-0-0
విడి ప్రతిక 4 అ.

సచిత్రవారపత్రిక

Founder : K. NAGESWARA RAO

సంపుటము 49
సంచిక 33
18-4-56

దుర్ముఖ చైత్ర శుద్ధ అష్టమి బుధవారం



గోల్కొండ ఖిల్లా


—ఫోటో : పి. వీరయ్య.

(7-వ పేజీలోను, [illegible])

విషయానుక్రమణిక

ముఖచిత్రం :

నటసామ్రాజ్ఞి "భలేరాముడు" లో గిరిజ.



కాశ్మీర్ పై భారతపాకిస్థాన్ ల వివాదం

కాశ్మీర్ విషయంలో సందేహాలకు, వివాదాలకు ఆస్కారం లేకుండా ప్రధాన మంత్రి నెహ్రూ భారత వైఖరి విస్పష్టం చేశారు. కాశ్మీర్ ప్రజలు ఇక నిశ్చింతగా అభివృద్ధి కార్యక్రమాలను సాగించవచ్చును.


కాశ్మీర్ ను గూర్చి భారత, పాకిస్తాన్ల 'ఉభయమిత్రులు' బోలెడు బోలెడు చెబుతున్నారు, రాస్తున్నారు. "అగ్నేయాసియా రక్షణకూటమి నిర్ణయాలను" గూర్చి న్యూయార్క్ టైమ్సు ఇటీవల వ్రాసింది : "కాశ్మీర్ విషయం చాలా చిక్కులతో కూడివున్నది. కాశ్మీర్ లో కొంతభాగాన్ని భారతదేశం ఆక్రమించడం పాకిస్థాన్ కు ప్రత్యక్షంగా ప్రమాదకరం అని చెప్పడానికి వీలు లేదు." భారతదేశం "ఆక్రమించడం" అనేమాట ముఖ్యంగా గమనించదగినది. ఆ

శ్రీ కృష్ణ

(ఆంధ్రపత్రిక ప్రతినిధి)

ముక్క చూస్తే చాలు, న్యూయార్క్ టైమ్సు పత్రిక కాలూకు "నిష్పాక్షిక" వైఖరి తెలిసిపోతుంది.

భారత దేశం బ్రిటిష్ అధినివేశంగా ఉన్నరోజుల్లో కాశ్మీర్ భారతదేశంలో చేరినట్లు బ్రిటిష్ గవర్నరు జనరలు అంగీకరించనే అంగీకరించారు. మార్చి 19 న లండను టైమ్సు ఒక సంపాదకీయంలో ఇలా వ్రాసింది : "కాశ్మీర్ విషయమై పాకిస్థాన్ చూపిన సహనం వృథా అయింది.



లోక్ సభ సభాపతి శ్రీ మాడభూషి అనంతశయనం అయ్యంగార్ కి ఢిల్లీ ఆంధ్రసంఘంవారు మార్చి 30న సన్మానం చేశారు. ఆర్థికమంత్రి శ్రీ దేశ్ ముఖ్ అధ్యక్షత వహించారు.

★ న్యూఢిల్లీ లేఖ ★

భారతదేశం చూడవచ్చిన రష్యన్ నాయకుల మూలంగా పాకిస్థాన్ ఆగ్రహం మరీ ఎక్కువైంది. రష్యను భారతదేశపు హక్కును గుర్తించడంతో ఉభయదేశాల మధ్య వైషమ్యం పెరిగింది."

మరొక ఉభయమిత్రుడు లార్డ్ బర్డ్‌వుడ్ కాశ్మీర్‌పై ఒకగ్రంథం వ్రాస్తూ భారతదేశప్రవర్తన తలతిక్కగా ఉందని ఉటంకించాడు.

పాకిస్థాన్ ప్రధాని చౌధురి మహమ్మదలీ కాశ్మీర్ భారతదేశంలో చేరడం మోసం అనే ఆరోపణను మళ్ళీ లేవనెత్తారు. అయితే పాకిస్థాన్ స్థాపకుడు జిన్నా 1947 జూన్ 17 న ఒక ప్రకటనలో ఇలా అన్నారు:

"రాజ్యాంగరీత్యా, న్యాయ చట్టరీత్యా బ్రిటిష్ ఆధిపత్యం పోగానే భారత సంస్థానాలు సర్వస్వతంత్ర మవుతాయి. అవి తమ ఇష్టం వచ్చిన మార్గం అనుసరించవచ్చు. హిందూస్థాన్‌లోనైనా చేరవచ్చు. లేక స్వతంత్రంగా ఉండిపోవచ్చు. 1946 మే 12 వ తేదీ వెలువడిన కేబినెట్ మిషన్ నివేదిక సంస్థానాల స్వాతంత్ర్యాన్ని ఏమాత్రం పరిమితం చెయ్యలేదు."

1947 జూలై 80 న జిన్నా ముస్లింలీగ్ వైఖరిని పునరుద్ఘాటించారు.


"భారత సంస్థానాలు రెండు అధినివేశాలలో దేనిలోనైనా చేరవచ్చు. భవిష్యత్తు నిర్ణయించుకోవడానికి ప్రతి సంస్థానానికి స్వేచ్ఛ ఉందని ముస్లిం లీగ్ గుర్తిస్తోంది.

కెనేడియన్ అంతర్జాతీయ వ్యవహారాల సంస్థ, పసిఫిక్ వ్యవహారాల సంస్థ "కాశ్మీర్ ఘర్షణ" అనే గ్రంథం ఇటీవల ప్రకటించాయి. ఈ గ్రంథం యేల్ విశ్వవిద్యాలయంలో ఉపయోగించడం కోసం రచించబడిందని గ్రంథకర్త డా॥ మైకేల్ బ్రెచర్ అన్నారు. స్వయంగా, ఎవరి ప్రోద్బలమూ లేకుండా రచించిన గ్రంథం కనుక కాశ్మీర్ సమస్యను అది నిష్పాక్షికంగా వివరిస్తోంది.

కాశ్మీర్ భారత దేశంలో చేరడం గురించి డా॥ బ్రెచర్ ఇలా వ్రాశారు: "పాకిస్తాన్ వైఖరికి ఆధారం ఏదైనా, కాశ్మీర్ భారత దేశంలో చేరడం క్రమ విరుద్ధమని పాకిస్థాన్ విశ్వసిస్తోంది. షేక్ అబ్దుల్లా ప్రజాద్రోహి అనీ, కాశ్మీరీ ముస్లిముల ప్రతినిధి కాడనీ భావిస్తోంది. కాశ్మీర్ చేరిక కుట్ర ద్వారా జరిగింది కనుక, భారత దేశమే దురాక్రమణ చేసిందిగాని పాకిస్తాన్ కాదని కూడా భావిస్తోంది.

ఈ సమస్య ఇన్ని చిక్కులతో కూడి ఉన్నందువల్ల ఈ ఆరోపణలలో నిజానిజాలను, ముఖ్యంగా కుట్ర సిద్ధాంతాన్ని గూర్చి ఇదమిత్థంగా నిర్ణయించలేము. అయినప్పటికి దొరికిన నిదర్శనాలనుబట్టి, తాత్కాలికంగా కొన్ని విషయాలు నిర్ధారణ చేయవచ్చు. కాశ్మీర్ చేరిక సమయంలో షేక్ అబ్దుల్లా, మహారాజాల ప్రవర్తన, పటేల్, మౌంట్‌బాటెన్, జిన్నాల అభిప్రాయాలు, కాశ్మీర్ భారత దేశంలో ఏ పరిస్థితులలో చేరిందో ఆ పరిస్థితులను, కాశ్మీర్‌కు భారత దేశం సైన్యాలను పంపించడాన్ని జాగ్రత్తగా పరిశీలించవలసి ఉంది.

1947 సెప్టెంబరు అంతంలో కారాగారం నుండి విడుదల కాగానే షేక్ అబ్దుల్లా కాశ్మీర్‌లో బాధ్యతాయుత ప్రభుత్వం ఏర్పడాలని, ఏదో ఒక దేశంలో చేరేముందు కాశ్మీర్‌కు స్వాతంత్ర్యం ఉండాలనీ ఉద్ఘాటన చేయసాగాడు. అంటే మహారాజా బాధ్యతాయుతప్రభుత్వం నెలకొల్పితేగాని కాశ్మీర్ ప్రజలు ఏ దేశంలో చేరడమూ నిర్ణయించలేరని అతను భావించాడు. అక్టోబరు 5 న ఒక ప్రసంగంచేస్తూ, జమ్మూ కాశ్మీర్‌లలోని నలభై లక్షల మంది



ఇటీవల మద్రాసువచ్చిన రష్యన్ వ్యాయామప్రవీణులబృందం రెండురోజులు నగరంలో ప్రదర్శనలు చేశారు. పార్లల్ బార్ మీద ఒక నిపుణుని వ్యాయామ విన్యాసం ఈ చిత్రంలో చూడవచ్చు.

ప్రజలను నిర్లక్ష్యంచేసి పాకిస్థాన్‌లోనో, భారత దేశంలోనో సంస్థానం చేరడం జరిగితే "నేను విప్లవం లేవదీస్తాను," అని కూడా తీవ్ర వైఖరి ప్రదర్శించాడు.

అక్టోబరు మొదటి మూడు వారాలలోనూ, "చేరికకు ముందు స్వేచ్ఛ" అనే నినాదంమీద ఆధారపడి కాశ్మీర్ జాతీయ మహాసభ వ్యవహరించింది. కాశ్మీర్ తన చేరికను గూర్చి నిర్ణయించుకొనడానికి వ్యవధి కావాలని, షేక్ అబ్దుల్లా పలు సారులు కోరాడు. ఈ విధానాన్ని అనుసరించే అతడు పాకిస్థాన్ నాయకులతో సంప్రదింపులు ప్రారంభించాడు. కాశ్మీరులో ప్రజాపరిపాలన స్థాపనకు సాయం చేయవలసిందిగా పాకిస్థాన్ నాయకులను జాతీయ మహాసభ ప్రతినిధులు అర్థించారు. ఎవరి ఒత్తిడి లేకుండా స్వేచ్ఛగా నిర్ణయించుకోనివ్వాలని కోరారు.

కాశ్మీర్ వెంటనే పాకిస్థాన్‌లో చేరేటట్లు షేక్ అబ్దుల్లాను ఒప్పించడానికి 1947 సెప్టెంబరు మధ్యకాలంలో పాకిస్థాన్ ప్రతినిధులు శ్రీనగర్ వచ్చారు. కాని అతడు లొంగలేదు. "మా స్వాతంత్ర్య సమరంపట్ల గతంలో పాకిస్థాన్ ఏ వైఖరి ప్రదర్శించినప్పటికీ మాకు అది లెక్కలోకి రాదు. అలాగే నలభైలక్షల కాశ్మీరీలు తాము పాకిస్థాన్‌లో చేరడమే లాభకరమని భావించినట్లయితే పండిట్ నెహ్రూ, కాంగ్రెసుల స్నేహం గాని, మా స్వాతంత్ర్య సమరంపట్ల వారి సానుభూతి గాని మా నిర్ణయాన్ని మార్చలేవు," అని షేక్ అబ్దుల్లా పాకిస్థాన్ ప్రతినిధులతో నిష్కర్షగా చెప్పివేశాడు.

చేరికకుముందు స్వేచ్ఛ అనే తమ సూత్రానికి పాకిస్థాన్ అంగీకారాన్ని సంపాదించడంకోసం అక్టోబరు ప్రారంభంలో జాతీయ మహాసభ ప్రతినిధివర్గం పాకిస్థాన్ వెళ్లింది. కాని ఆ ప్రయత్నం విఫలమైంది. అక్టోబరు మూడోవారంలో మళ్లీ ఒక ప్రతినిధివర్గం వెళ్లింది. ఈ రాయబారం జరుగుతుండగానే కాశ్మీర్‌పై కొండజాతులవారు దండెత్తారు.

1947 అక్టోబరు 27 వ గాని షేక్ అబ్దుల్లా సరియైన నిర్ణయం చేయలేదు. "కాశ్మీర్ ప్రమాదంలో పడింది" అనీ, కొండజాతుల దాడిని ప్రతిఘటించాలనీ, కాశ్మీర్‌ను బలాత్కారంగా చేర్చుకోవాలనే పాకిస్థాన్ ఈ దాడి ప్రోత్సహించిందనీ అతడు ప్రకటించాడు. అక్టోబరు 31 వ, అనగా దాడి మొదలైన పదిరోజులకు షేక్ అబ్దుల్లా మరొకసారి ప్రయత్నంచేశాడు.

"మా సంస్థానంలో నూటికి 78 మంది గొప్పవ ముస్లిములున్నారు. అంతిమ నిర్ణయంచేసే అధికారం వారికే ఉంది. కనుక మా సంస్థానప్రజల స్వాతంత్ర్యాన్ని గుర్తించవలసిందిగా నేను జిన్నాను కోరుతున్నాను. దాడిమూకలు సంస్థానం విడిచి పోయేటట్లుచేయవలసిందిగా కోరుతున్నాను. ఆయన కోరినట్లయితే నేను కరాచీ రావడానికి సిద్ధంగా ఉన్నాను," అని షేక్ అబ్దుల్లా అప్పుడు ప్రకటించాడు.

అంతకుముందు జూలైలో "ఏ సంస్థానమైనా పాకిస్థాన్‌లో చేరాలని కోరినా, లేక ఒడంబడిక చేసుకోగోరినా పాకిస్థాన్ రాజ్యాంగసభ తాలూకు సంప్రదింపుల సంఘం ఏర్పడినప్పుడు దానితో గాని, పాకిస్థాన్ ప్రభుత్వ ప్రతినిధులతో గాని సంప్రదింపులు జరుపుకొని ఏ నిర్ణయమైనా చేయవచ్చు" అని ప్రకటించిన జిన్నా షేక్ అబ్దుల్లా ప్రకటనకు సమాధానం ఇవ్వనేలేదు.

మహారాజా ఎటూ తేల్చకుండా చాల రోజులు ఈ సమస్యను నాన్చారు. మౌంట్ బాటెన్‌కూడా ఈ నానుడును విమర్శించారు. 1950 డిసెంబర్ 29 వ తేదీ "స్పెక్టేటర్"లో వ్రాస్తూ సర్ ఫ్రాన్సిస్‌లో ఇలాగన్నారు: "మహారాజా ప్రభుత్వం ఏ నిర్ణయానికి రాకుండా చాల రోజులు గడిపింది. కొండజాతులదాడి సంభవించకపోయినట్లయితే అలాగే ఎన్ని నెలలైనా గడిపివేసేది."

కాంబెల్ జాన్సన్‌కూడా 1947 నవంబరు 10 వ ఇలాగే వ్రాశారు: "కొండ జాతిమూకలు శ్రీనగర్ ప్రాకార ద్వారాలను సమీపిస్తేగాని ఏ దేశంలో చేరేదీ మహారాజా నిర్ణయించదలచలేదని ఊహించడానికి ఆధారాలున్నాయి."

వీరిద్దరేగాక సర్దార్ పణిక్కర్ "ఇక గత్యంతరంలేకనే తన సంస్థానాన్ని భారత దేశంలో చేర్చుకోవలసిందని మహారాజా కోరారు," అని వ్రాశారు.

వీటన్నిటికంటె ప్రబల నిదర్శనం మహారాజా 1947 అక్టోబరు 26 వ లార్డ్ మౌంట్ బాటెన్ (అప్పటి గవర్నరు జనరల్)కు వ్రాసిన లేఖయే:

"నా సంస్థానంలో అసాధారణ పరిస్థితుల దృష్ట్యా, భారతదేశ సహాయం కోరడంతప్ప నాకు గత్యంతరంలేదు. అయితే నా సంస్థానం భారతదేశంలో చేరకపోతే భారత ప్రభుత్వం నాకు సహాయంచెయ్యదు. అందుచేత అలా చేరడానికే నేను నిశ్చయించాను. మీ ప్రభుత్వానుమతికోసం నేను 'చేరిక ఒడంబడికను' జతచేర్చి పంపుతున్నాను."

భారతదేశం కుట్రచేసి కాశ్మీర్‌ను చేర్చుకొన్నట్లు పాకిస్థాన్ చేసిన ఆరోపణలో అప్పటి భారత సంస్థానాలశాఖ కార్యదర్శి వి. పి. మీనన్ పేరుకూడా ఇరికించబడింది. ఈ ఆరోపణకు, దరిమిలా జరిగిన సంఘటనలకు సంబంధించిన ముఖ్య నిదర్శనం లార్డ్ మౌంట్ బాటెన్ పత్రికా కార్యదర్శి కాంబెల్ జాన్సన్ డైరీ ఒకటిఉన్నది.

> **ప్రగతి!**
>
> ఒకచోట ఒక సమాజ వికాసకేంద్రం నెలకొల్పితే దానితోపాటే ఒక మద్య పానకేంద్రం లేస్తున్నదట!
>
> కేంద్రప్రభుత్వ ప్రణాళికా మంత్రి శ్రీ గుల్జారీలాల్ నందా ఇటీవల పార్లమెంటులో ఈసంగతి చెబుతూ ఈ వికాస కేంద్రాలకు ఉజ్జీగా సమానాంతర రేఖమీద కల్లు దుకాణాలుకూడా ఇలా పెరుగుతున్నందుకు విచారం వెలిబుచ్చారు. చాలాచోట్ల ఇలా జరిగిందనీ, ఇకనైనా ఈధోరణి అంతం కావాలనీ ఆయన అన్నారు.

కాంబెల్ జాన్సన్ వ్రాసినదాన్ని బట్టి కొండజాతులదాడి గూర్చి వెలువడిన మొట్టమొదటి బహిరంగ ప్రకటనను 1947 అక్టోబరు 24 వ పండిట్ నెహ్రూ చేశారు. ఆ రోజునే అందిన మహారాజా కోరిక ప్రకారం వెంటనే సైన్యాలను పంపించాలని భారత రక్షణసంఘం ఆ మర్నాడు నిర్ణయించింది. కాని మౌంట్‌బాటెన్ దీనికి వ్యతిరేకించారు. కాశ్మీర్ భారతదేశంలో చేరితే గాని సైన్యాలు పంపరాదనీ, ఆ చేరిక అయినా జనవాక్య నిర్ధారణ జరిగేవరకే చెల్లుతుందనీ ఆయన భావం. అందుచేత సైన్యాల్ని పంపించటంగూర్చి ఏనిర్ణయమూ జరగడానికి వీలులేకపోయింది. అప్పుడు అసలు పరిస్థితి తెలుసుకోడానికి మీనన్‌ను శ్రీనగర్ పంపించారు. అక్టోబరు 26 వ మీనన్ తిరిగివచ్చి మహారాజా బింకం సడలిపోయిందనీ, నిస్సహాయుడుగా ఉన్నాడనీ తెలియజేశాడు. వెంటనే

(56 పేజీ చూడండి)

సమస్యాపూరణం

ప్రాచీన గాథాలహరి

పి. గణపతి శాస్త్రి

౪

లీలాదేవి అంతవరకు తన జీవితంలో ఎన్నడు అటువంటి అవమానం పొంది ఉండలేదు. ఇంతకీ మహారాజా విధంగా అవమానించడానికిగల కారణమేమో ఆమెకు తెలియలేదు. సామాన్యంగా ఆ దంపతుల మధ్యన ప్రణయకలహాలేమైనా వచ్చినప్పుడు అపరాధం ఎవరిదైనా చివరికి అనునయించేది మహారాజే. కాని మరునాడంతా వారొకరి ముఖాలొకరు చూచుకోలేదు. లీలాదేవి పైపైకి బాగా బింకంగా ఉన్నా లోలోపల అనుక్షణము మహారాజు రాకకోసం ఎదురు తెన్నులు చూచింది. కాని ఆయన రాలేదు. పరిచారికలందరు ఆ పరిస్థితిచూచి హడలెత్తిపోయారు!

లీలాదేవి విందు భోజనం సమయంలో జరిగిన సమస్యాపూరణంలో ఒక చిరునవ్వు చిందించిన మాట వాస్తవమే. దానివలన భర్తకావిధంగా ఆగ్రహం వచ్చిందని ఆమె విశ్వసించలేకపోయింది.

భోజన సమయంలో అనేకమైన పరిహాస ప్రసంగాలు దొర్లిపోయాయి. ఆ సమయంలో ఆమె ఎన్నెన్నో చిరునవ్వులు చిలకరించింది. ఆయా సందర్భాలలో రాని కోపం సమస్యా పూరణ సందర్భంలో రావలసిన అవసరం ఏమి ఉంది! ఆ సమస్యా పూరణంలో అణువంత పోటుదనం స్ఫురించిన మాట నిజమే. అయితే వెంటనే ఆమె సిగ్గుపడి తలవొంచుకొని ముఖం మరి ఒక పక్కకు తిప్పివేసుకోలేదా? అప్పటి ఆమె ప్రవర్తనలో అనౌచిత్యలేశమైనా లేదే! అందుచేత మహారాజు క్రోధానికది కారణమై ఉండదని ఆమె ఒక నిశ్చయానికి వచ్చింది. దానికి వేరొక ప్రబలమైన కారణమేదో ఉండాలని ఊహించింది. వెంటనే తనకత్యంత ఆప్తురాలయిన అంతఃపుర పరిచారిక మందారమాలికను విషయం ఆమూలాగ్రంగా గాలించి పట్టుకోవలసిందని ఆజ్ఞాపించింది.

అది జరిగి అప్పుడే రెండు రోజులయింది. మందారమాలిక పరిచారికలనందరినీ అనేక విధాలుగా గుచ్చిగుచ్చి అడిగింది. ఇంతవరకు వారి మూలంగా ఏమీ తెలియలేదు. ఇక మహారాజు ధోరణి చూదామా అంటే ఆయన అంతఃపురంలో ప్రవేశించడమే గగనమైపోయింది. ఆ ఆగ్రహం నానాటికి మించిపోయినట్టే కనిపించింది. అల్లంత దూరంలో లీలాదేవి ముఖం కనిపించేసరికే మహారాజు మండిపడిపోయేవాడు. ఆ విషమ ఘట్టంలో ఆమెకేమి చెయ్యడానికీ పాలుపోక వెంటనే మందారమాలికను పిలిపించింది.

"మందారా! ఏమైనా కొత్తసంగతి తెలిసిందా?"

"ఏమీ తెలియలేదమ్మా"

"ఏమీ తెలియలేదా?"

మందారమాలిక కొంచెం తటపటాయించింది:

"లేదుగాని ఒక్క చిన్న విడ్డూరం జరిగిందనిమాత్రం తెలిసింది."

"ఏమిటో ఆ విడ్డూరం!"

"మహారాజు రాజప్రాసాదంపై అంతసుపై శయనించి ఉన్నారట! తరంగిక ఆ సమయంలో వింజామర వీస్తున్నదట!"

"ఏ సమయంలో?"

"గడిచిన భృగువాసరం రాత్రి ఝామున్నర వేళ"

"ఓహో! అలాగా! సరిసరి! ఆపైన?"

"మహారాజుగారు గడియసేపు నెమ్మదిగా కన్నుమూశారట!"

"సరే! బాగానే ఉంది! ఆపైన?"

"తరవాత తరంగికకూడా అలిసిపోయి ఆ పక్కనే సుఖాసనంమీద మేనువాల్చినదట!"

"ఔరా! ఎంతటి సాహసం! అలా మేను వాల్చడానికి దానికెన్ని గుండెలున్నాయే?"

"అదేనమ్మా! మహా చిత్రంగా ఉంది!"

"సరే ఆ తరవాత?"

"తరవాత అది ఏమేమో కలవరించినదట!"

"ఏమని?"

"అంత స్పష్టంగా తెలియదు గాని—

'లీలాదేవీ! కాళిదాసకవి స్త్రీ వేషంతో శయ్యాగృహంలోనికి వచ్చారు. తొందర తొందరగా లోపలికి రండి!' అన్నట్టుగా కలవరించినదట!"

"ఔరా! ఎంతటి విడ్డూరం! ఇంత జరిగినా ఇంకా చిన్న విడ్డూరం జరిగిందంటావేమే! తరవాత ఏమి జరిగింది!"

"ఆమాట వింటూనే మహారాజు మేలుకొని ఆ కలవరింతకు హేతువేమని నొక్కి నొక్కి అడిగినారట!"

"దానికది ఏమని సమాధానం చెప్పింది?"

"ఏదో నిద్రబద్ధకంలో కలవరించానని అంతకంటె తనకేమీ తెలియదనీ, తన తప్పిదం మన్నించవలసినదనీ, కాళ్ళావేళ్ళా పడి ప్రతిమాలుకొన్నదట."

"ఔరా! ఎంతటి వగలాడి! ఆపైన వారేమన్నారే?"

"సరే! అని మన్నించివిడిచిపెట్టారట!"

"ఇదంతా నీకెలాగ తెలిసిందే!"

"దేవరవారికి కర్పూర తాంబూలాలందీయడానికి మెల్లిగా మేడమెట్లెక్కుతూ విన్నాను."

"తరవాత తరంగికను అదేమని అడిగావా?"

"అడిగాను."

"అది ఏమని చెప్పింది?"

"మళ్లీ తానేమీ ఎరగననీ మీతో చెప్పవద్దనీ వలవలా ఏడ్చింది!"

"దానిమాట నిజమే అనిపించిందా?"

"పాపం! అది అమాయకురాలేనమ్మా!"

"అయితే మరి అలాగ ఎందుకు కలవరించిందే?"

"ఏమోనమ్మా! ఎంత తల బద్దలు కొట్టుకొన్నా అదే తెలియడంలేదు!"

"ఓహో! అలాగా! అయితే సరేలే! తరంగిక నొకసారి ఇక్కడికి రమ్మను!"

అని లీలాదేవి మందారమాలికను పంపించివేసింది. పిమ్మట తరంగిక వచ్చింది.

ఆమె ఎన్ని విధాల ప్రశ్నించినా తానేమీ ఎరగననీ ఎందువల్లనో నిద్రమత్తులో ఆ విధంగా కలవరించాననీ, తనతప్పు మన్నించవలసిందనీ లీలాదేవి పాదాలు పట్టుకొని పరి పరి విధాలుగా ప్రతిమాలింది.

లీలాదేవి రెప్ప వాల్చకుండా చాలాసేపు తరంగిక ముఖ భంగిమ పరిశీలించింది. పిమ్మట వెంటనే తరంగికను పంపివేసి మందారమాలిక చెవిలో అతిరహస్యంగా ఏమేమో బోధించింది.

౫

మరునాడు దీపదివాల వేళ లీలాదేవి చక్కగా అలంకరించుకొని నెమ్మదిగా భోజుని సందర్శనానికి బయలుదేరింది. మహారాజు శాంతంగా కూర్చుని కొంచెం పరధ్యానభంగిమతో పరిసరోద్యానం తిలకిస్తున్నాడు. నీలి నీలి చీకట్లలో గున్నమామిడి పూలగుత్తులన్నీ లీలగా లేత లేత వెన్నెల వెలుగుల వెలిగాయి. వాటిపై ముసిరిన తుమ్మెదల ఝుంకారం వీణామంద్రధ్వనిలా సన్న సన్నగా మారుమోగింది.

లీలాదేవి కొంతదూరంనించే భర్త సౌమ్య దృష్టితో ఉన్నాడని గ్రహించి నెమ్మదిగా ఆయనతో ప్రసంగించవలసిన తీరంతా లోలోపలే ఆలోచించింది. తరంగిక కలవరింతవల్లనే అతనికొక విధమైన అపోహ కలిగిందనీ భోజనవేళలో జరిగిన సమస్యాపూరణంలో అది మరింత బలపడిందనీ ఆమె గ్రహించి వేసింది. ఆ విషయంలో లోతుపాతులు గ్రహించడానికే మహారాజా విందు ఏర్పాటుచేసి ఉండవచ్చుననీ సమస్యాపరీక్ష కూడా ఆ దృష్టితోనే జరిగి ఉండవచ్చుననీ ఆమెకొక అనుమానం బయలుదేరింది. ఒక నిమిషం ఆలోచించిన తరవాత ఆ విషయంలో ఇక అనుమానించవలసిన అవసరమేమీ లేదనీ మహారాజావిధంగా సమస్యాపరీక్ష చెయ్యడానికదే కారణమనీ నిశ్చయించివేసింది. భోజనవేళ జరిగిన సంఘటనలన్నీ తిరిగి ఒకసారి స్మరించగానే ఆమెకావిషయంలో బయలుదేరిన అనుమానం పటాపంచలైపోయింది!

అటుపిమ్మట నెమ్మదిగా భోజుని సమీపించి అతనిదరిని కూర్చుని ఆవిషయంలో తాను, కాళిదాసకవి కేవలం నిర్దోషులమనీ నిజం నిలకడమీద తేలగలదనీ అంతవరకు కొంత నిగ్రహం అవలంబించవలసిందనీ చేతులుపట్టుకొని అనేకవిధాలుగా ప్రతిమాలింది.

కాళిదాసకవి పేరెత్తగానే భోజుడు అగ్నిలో వేసిన గుగ్గిలంలా భగుమన్నాడు.

"ఆ ద్రోహి పేరు మరి నాదగ్గర తలపెట్టవద్దు! ఆ నీచ ద్రోహానికి శూలారోపణ శిక్షే విధించవలసింది! కాని బ్రాహ్మణుడని



"సీతమ్మకు చేయిస్తి
చింతాకు పతకము, రామచంద్రా!
పతకమునకు బట్టె
పదివేల వరహాలు !"

భద్రాచలంలో భక్తరామదాసు విగ్రహం.

—ఫోటో: వి. వీరయ్య.

★ సమస్యాపూరణం ★

కరుణించి నగరనిర్వాసనశిక్షతో విడిచి పెట్టాను."

ఆ మాటవిని నేసరికి లీలాదేవి హృదయంలో వాడిశూలాలతో పొడిచి నట్లయింది! ఒకనిమిషం వరకు ఆమె నోట మాటరాలేదు! తరవాత "అయ్యోయ్యో! ఎంత పని చేశారు! ఆయన ఏ పాపము ఎరగని అమాయకులు!" అన్నది. ఆమె ఎంతో సౌమ్య భావంతో అన్న ఆ మాట లతని హృదయంలో రేగిన క్రోధానికి ఆజ్యధారలా పనిచేశాయి.

"ఇంక ఈ పైన ఆద్రోహిమాట నా దగ్గర తలపెడితే మరిసహించేది లేదు!" అన్నాడు అతికర్కశస్వరంతో.

ఆతరవాత ఆమె భర్త పారుష్యం సహించలేకపోయింది. నిర్భయంగా ఆతని ముఖంవైపు చూస్తూ నెమ్మదిగా ఇలాగన్నది:

"మీరు తరంగిక కలవరింతలు నమ్మి అనవసరంగా అనుమానపడుతున్నారు! కొంచెం ఈ అంగుళీయకం చిత్తగించండి!"

అది మహేశ్వరకవి నామాంకితమైన అంగుళీయకం. ఆ ఉంగరం తరంగిక గృహంలో దొరకిందనీ దానినిబట్టి తరంగికకు మహేశ్వరకవికీ ఏదో సన్నిహిత పరిచయం ఏర్పడినట్లు దృఢపడుతున్నదనీ తరంగిక కలవరింతలకు ఆ అంగుళీయకానికి ఏదైనా సంబంధం ఉండవచ్చుననీ ఇంచుకంత శాంతం వహిస్తే మిగిలిన విషయాలు కూడా బుజువు కావచ్చుననీ ఆమె అనేక విధాలుగా నచ్చజెప్పింది. మహారాజామాటలతో కొంచెం శాంతించాడు. కొంచం సేపాలోచించి—

"అయితే మహేశ్వరకవి ఇంతటి పన్నాగం పన్నడానికి కారణం?" అని ప్రశ్నించాడు.

ఆ ప్రశ్నకు లీలాదేవి ఒక చిరునవ్వు నవ్వి—

"దీనికి వేరే కారణం కావలెనా? మీరు కాళిదాస కవీశ్వరులంటే పంచప్రాణాలు ఇస్తున్నారుగదా! మహేశ్వరకవికి లోలోపల ఏమయినా అసూయా క్రోధాలేర్పడి ఉండవచ్చును!...ఇంతకీ ఇలాంటి రాజకార్యవ్యవహారాలలో నేనా తమకు విన్నవించేది!"

అని ఆమె తిరిగీ ఇంకొక చిరునవ్వు నవ్వింది. మహారాజా ఒక్క నిమిషం ఊరుకుని మెల్లిగా ఇలాగన్నాడు:

"ఏమో! ఈ విషయం అంతా నాకు కేవలం అభూతకల్పనలాగే స్ఫురిస్తూంది!"

"ఏ విషయం!" అని ఆమె ఎంతో ఆత్రంగా ప్రశ్నించింది.

"ఈ అంగుళీయక వ్యవహారం!"

"పోనీ! అలాగే కానివ్వండి! ఇందులో మించిపోయినదేమి ఉంది? ఒకసారి మీ గూఢచారుల కాజ్ఞాపిస్తే నాలుగైదు రోజులలో అన్నీ మీకే విశదం అయిపోతాయి. అంతఃపుర పరిచారికలహోరాత్రాలు నిద్రాహారాలు మాని అతిరహస్యంగా తరంగిక ఇల్లంతా గాలించగా గాలించగా ఈ ఉంగరం సంగతిబయటపడింది...కొంచెం నామాట మన్నించండి!"

తరవాత భోజుడొక కొంతసేపు తటపటాయించి కొంచెం విసుగుగా ఒక నిట్టూర్పు విడిచి పెట్టాడు.

పిమ్మట లీలాదేవి సానునయంగా తిరిగీ ఇలాగన్నది:

"నాకేమో ముప్ఫయిసంవత్సరాలు పైబడ్డాయి. పైగా సంతానవతిని! నేనేమైనా చిన్నదాననా! చితకదాననా! ఇలాంటి శృంగారచేష్టలకు! ఎందుకు మీకింతనుమానం!"

"ఏమో ఎవరు చెప్పగలరు? స్త్రీ హృదయము అత్యంత నిగూఢం!" అన్నాడు మహారాజా.

"ఓహో అలాగా! అయితే ఈవిషయంలో అత్యంత నిగూఢంగా అన్ని రహస్యాలు దాచివేసినవారెవరో! పోనీఇంకొక్కమాట! ధారానగర సుందరీమణులు నిద్రమత్తులో తమపేరే కలవరిస్తూంటారని నగరంలో అందరు అంటూంరు. అంతటి నవమన్మథులు మీరు నన్నెంతో మక్కువగా అక్కున జేర్చుకొని ఆదరంగా చూచుకుంటూ ఉండగా వేరే నాకీ పరపురుష ప్రసంగమేల! నిజానికీ నీలాపనింద మీకే ఒకపెద్ద తలవొంపు! ఈ చిన్న విషయం కొంచెం సావధానంగా ఆలోచించండి!"

ఆ అనునయంతో మహారాజా మనస్సులో కాళిదాసకవి విషయంలో తిరిగీ కొంచెం డోలాందోళన ప్రారంభమైనది. లీలాదేవి అది గ్రహించుకొని మహారాజాను తన వామహస్తంతో గాఢంగా కౌగలించుకొని దక్షిణహస్తం మునివేళ్లతో అతని ముంగురులు మెల్లిమెల్లిగా సవరిస్తూ ఎంతో ఆప్యాయంగా ఇలాగన్నది.

"ఇంతకాలంనించీ నన్నెరిగి ఉండీన్నీ నామీద నేటి కింతటి నీలాపనింద వేశారు గదా! ఇది మీకేమైనా ధర్మంగాఉన్నదా? ఏమైనా మగమహారాజు లెంతటికైనా తగినవారే!"

అటుపిమ్మట ఆమె కనుగొలకులలో రెండు చిన్న కన్నీటి ముత్యాలు మెరిశాయి.

తరవాత ఆమె దీనంగా మహారాజా ముఖం కేసి చూచింది. కాళిదాసకవిని తిరిగీ ధారానగరానికి పిలిపించవలసిందని ప్రార్థించాలని అనుకొన్నది గాని ప్రస్తుతానికది సముచితంకాదనుకొని ఒక్క నిట్టూర్పు విడిచి అలాగే మౌనంగా మహారాజా ముఖం వైపు చూచింది.

మహారాజా మృదువుగా ఆమె గాఢాశ్లేష బంధనం విడిపించుకొని తన రహస్యమంత్రాగారంలోనికి వెళ్లిపోయాడు. వెంటనే గూఢచారులనూ, మరి కొంతమంది అంతఃపుర పరిచారికలను తరంగిక కలవరింతను గురించీ, ఆ అంగుళీయకాన్ని గురించీ తరంగికా మహేశ్వరుల అన్యోన్యతను గురించీ వెంటనే అత్యంతరహస్యవృత్తాంతాలందీయవలిసిందని ఆజ్ఞాపించాడు. వారందరు రాత్రింబగళ్లదే పనిగా ఆ పరిశీలనలో మునిగిపోయారు.

౬

ధారానగర నిర్వాసనం జరిగిపోగానే కాళిదాసకవి మరి ఒక్క క్షణమైనా అక్కడ నిలవకుండా వెంటనే ఆ నగరం విడిచి వెళ్లిపోవాలని నిశ్చయించాడు. అతడు ధారానగరాస్థానానికి వచ్చి అయిదారు నెలలే అయింది. ఆ ఆస్థానంలో ఎన్నడూ లేని గౌరవాదరాలకు లోలోపల ఉప్పొంగిపోతూ త్వరలోనే మాళవదేశంలో ఎక్కడో మారుమూల కుగ్రామం అజక్షీరంలో ఉన్న తన కుటుంబంవారినందరినీ త్వరలోనే ధారానగరానికి తీసుకు రావాలని ఉవ్విళ్లూరాడు. కాని అంతలోనే నగర బహిష్కరణవార్త హఠాత్తుగా ఒక పెద్ద అశనిపాతంలా అతని తలపై విరుచుకు పడింది! ఎంత మథనపడినా అతనికీ అకారణ నగర నిర్వాసనానికి కారణమేమో బోధపడలేదు. విందు సందర్భంలో తన సమస్యా పూరణం దీనికి కొంతవరకు కారణం కావచ్చునని అతని ఊహాంచలాలలో కొంతవరకు స్ఫురించింది. కాని అది ఒక పెద్దహేతువుగా కనబడలేదు! ఎన్నెన్ని విధాలుగా ఆలోచించినా అంత పెద్దకారణం ఏమీ కనబడక పోయేసరికి చివరికతనికి చంచలమైన ప్రభుచిత్తవృత్తులే దీనికి కారణమై ఉండవచ్చునని అనిపించింది. దానితో అతని హృదయంలో వెలిగే ఆశానూర్యోదయ జ్యోతి అంతా హఠాత్తుగా ఒకేసారిగా అస్తమించిపోయింది!

ఆసమయంలో అతనికి ధారానగరవారాంగన విలాసిని ఆప్యాయత్త ఆదరాభిమానాలు స్ఫురణకు వచ్చాయి. కడసారిగా ఆమెతో చెప్పి తన స్వగ్రామానికి తిరిగి వెళ్లిపోవాలని నిశ్చయించుకుని తొందర తొందరగా ఆమె భవనంవైపు నడిచి వెళ్ళిపోయాడు.

అప్పటికి ఝామురాత్రి గడిచింది. కాళి

దాసకవి విలాసవతీ భవనద్వారం సమీపించగానే దూరదూరంనుంచి కవిరాక గమనించిన ఆమె ఎంతో ఆప్యాయంగా అతనిని లోలోపలికి తీసుకువెళ్లిపోయింది.

కవి ఒక అరగడియ సేపామెతో ఇష్టాగోష్ఠి జరిపి నెమ్మదిగా ఆమెకు తన నగర నిర్వాసనశిక్ష తెలియజేశాడు. సూర్యోదయాత్పూర్వమే నగరం విడిచి వెళ్లిపోవాలనీ లేకపోతే ఆశిక్ష మరణశిక్షగా పరిణమించగలదనీ కడసారిగా ఆమెను సందర్శించి సెలవుతీసుకుని వెళ్లిపోవడానికే వచ్చాననీ అన్నాడు. అటుపిమ్మట సంగ్రహంగా విందు సందర్భంలో జరిగిన సమస్యాపూరణ విషయంకూడా ఆమెకు తెలియజేసి అంతకంటె తానేపాపము ఎరగనని చెప్పి ఆమెతో తన కష్టసుఖాలన్నీ వెళ్లబోసుకున్నాడు.

విలాసవతి పక్కున ఒక్కనవ్వునవ్వింది:

"ఏమో నేను మీ మాటలు నమ్మను! మీ రేమైనా సాధారణులా! లేకపోతే మహారాజంతగా ఎందు కాగ్రహిస్తారు! నిజం చెప్పండి!"

"నిజమే! విలాసవతీ! నే నేపాపమూ ఎరగను. ఎంత ఒట్టుపెడితే అంతఒట్టు!"

"లేకపోతే లీలాదేవి మనస్సేమయినా కొంచెం చలించిందేమో! మిమ్మల్ని చూచిన తర్వాత ఎలాంటి శీలవతికైనా మనస్సు నిలకరించుకోవడం కష్టమే!"

దీంతో కాళీదాస కవికి కొంచెం కోపం వచ్చింది:

"లోకంలో అంతా నీవంటివాళ్లే అనుకుంటున్నావు!" అన్నాడు.

ఈ మాట విలాసవతి హృదయంలో ఈటెలా పొడుచుకుంది.

"అవును! నిజమే! కనకనే మర్యాదస్థు లెవరూ నా గడప తొక్కనే తొక్కరు!" అని కోపంగా సమాధానం చెప్పింది.

కవి లోలోపల ఆమె సంభాషణా చాతుర్యానికి మెచ్చుకున్నాడు. అయితే ఆమె కోపం దీపమై వెలిగింది!

ప్రసంగం అవిధంగా పరిణమించ గలదని [illegible]వి కలలోనైనా ఊహించలేదు. వెంటనే ఆమె తనమాట అపార్థం చేసుకున్నదని గ్రహించి ఆమెకు తన వాస్తవ మనోభావం తెలియజేసి మన్నించవలసిందని వేడుకొన్నాడు. తరవాత వెంటనే ఇంటికి ప్రయాణమైనాడు. ఆమె దాని కంగీకరించలేదు:

"ఎందుకంత తొందర? మీ రికనుంచీ నా ఆస్థానంలో కవీశ్వరులు!"

"నీ ఆస్థానంలోనా! సరిపోయింది! ప్రాణం మీదికి వచ్చినా పరిహాసం మానవు గదా!"

"పరిహాసం కాదు! నిజమే! నాలుగు సదస్సులలో నాలుగు నృత్యాలు చేశానంటే మీకు మహారాజు కన్నా పెద్ద సత్కారమే చెయ్యగలను! ఆయనకు నేనెందులో తీసిపోయానో చెప్పండి!"

"ఎందులోను తీసిపోలేదు గాని తెల్లవారితే మాత్రం నా తల తీసేస్తారు! దీని కేమిటి సాధనం!"

"ఏమీ భయంలేదు! మీ ప్రాణాలకు నా ప్రాణాలు అడ్డు వేస్తున్నాను! సరి గదా!"

"నీవా?"

"అవును నేనే!"

"ఎలాగ?"

"చీర సింగారిస్తే మీరొక భూలోక రంభలాగుంటారు! ఆ వేషంలో మరి మిమ్మల్నెవరు పట్టుకోలేరు!"

"హరిహరీ! చివరికి నీ ఆస్థాన కవీశ్వరుని కింతటి దుర్గతి పట్టింది!"

ఈ మాటతో విలాసవతి ముక్కుమీద వేలు వేసుకొని పక్కున నవ్వి—

"ఆహా వారాంగనలంటే మీ కెంతటి అలుసు!" అని తదేకదృష్టితో అతనివైపు చూచింది!

"తిరిగీ నామాట లపార్థం చేసుకుంటున్నావు! నేనీ వారాంగనా వేషంతో ఇక్కడ ఎంతకాలమని కాలక్షేపం చెయ్యగలనో చెప్పు!"

"ఎంతో కాలం దాకా! ఒక పక్షం రోజులు చాలు!"

"ఆ తరవాత?"

"తిరిగీ మీ స్వగ్రామం వెళ్ళిపోదురు గాని!"

"అంతవరకు నీ ఎదట నిలబడి గజ్జె కట్ట వలసిందేనన్నమాట!"

"నాట్య శాస్త్రవేత్తలు గదా! మీరు స్వయంగా స్త్రీ వేషంలో అభినయిస్తే చూడాలని ఎంతో కాలంనించీ ముచ్చటగా ఉంది! మహారాజుదయవల్ల నేటి కది నెరవేరింది! అదీగాక ఇకనించీ మీరు నా ఆస్థాన కవీశ్వరులుగదా! అందుచేత ఈ క్షణంనించీ నా కనుసన్నలలో మెలగాలి!"

"సరిసరి! అయితే నీ ఆస్థానకవినో నర్తకినో నా కింతవరకు స్పష్టంగా తేలలేదే!"

"రెండూను!"

"చాల్చాలులే నీ వేళాకోళం! ఇదంతా నీకొక చిన్న ముచ్చట! నాకు మాత్రం ఒక పెద్ద ప్రాణపోకడ! నీకేమి మహారాజువు! నన్ను పోనీ! నేను వెళ్ళిపోవాలి! ఇంటి దగ్గర ఇల్లాలు, పిల్లలు ఎంతగా బెంగటిల్లిపోతున్నారో!"

ఆ సమాధానంతో విలాసిని చెక్కిళ్ళెర్రబడ్డాయి!

"ఇక్కడున్నా నా ఆలోచనలు నా ఇల్లాలో, పిల్లలో అని ఒకటే ఘోష! అంతేగాని కొంచెమైనా నా మాట కోరనివ్వరు గదా! పోనీలెండి!"

అని ఆమె మూతి బిగించింది.

"నామాట విను! విలాసవతీ! నాకు వేళమించిపోతూంది! నేను వెళ్ళిపోవాలి! కొంచెం కనికరించి సెలవు దయచేయించు!"

అన్నాడెంతో జాలిగా కాళీదాసకవి.

ఆమె అతన్ని మృదువుగా కౌగలించుకొని కనురెప్పపాటులేకుండా అతనివైపు సానునయంగా చూచి ఇలాగన్నది:

"నేను కేవలం నా ముచ్చటకోసమే మిమ్మల్నిక్కడ అట్టే పెడుతున్నానని అనుకొంటున్నారా?"

"కాకపోతే దీనివల్ల ప్రయోజనం?"

"ఇంతేనా మీ పరేంగిత జ్ఞానశక్తి!"

కాళీదాసకవి ఈ ప్రశ్నతో తెల్లబోయాడు!

ఒక్క చిన్న చిరునవ్వునవ్వి—

"విలాసవతీ! జితోస్మి!" అన్నాడు.

ఆమె అతన్ని కొంచెం గాఢంగా కౌగలించుకొని చెవిలో మెల్లిగా ఇలాగన్నది!:

"ఎందుకు మీకింత తొందరపాటు! లీలాదేవి మీరూ ఏ పాపం ఎరగరుగదా! మహారాజెవరో చెప్పిన చెప్పుడు మాటలువిని మీ మీద ఆగ్రహించి ఉంటారు. అయితే అన్నీ కనిపెట్టి చూచే దైవం అనేవాడు ఒకడు ఉన్నాడు గదా! నిజం అన్నది నిలకడమీద తేలకపోతుందా? ఒక పక్షం రోజులు వేచి ఉంటే మించిపోయేదేమిటి? ఏదో వ్యాకులచిత్తంతో ఉన్నారు గాని — లేకపోతే ఈమాత్రం ఊహ మీకుమాత్రం స్ఫురించకపోయిందా! నామాట విని ఒక పక్షం రోజులు ఓపిక పట్టండి!"

"ఏది ఏమైనా సరే! ఇక నించి నేనీ రాజాధముల ఆస్థానాలు తొక్కేది లేదు!" అన్నాడు కాళీదాసకవి ఒళ్లెరగని కోపంతో.

"తొందరపడకండి! మన మహారాజును మిగిలిన రాజులతో సరిపోల్చడం ధర్మం కాదు! ఏదో గ్రహపాటువల్ల మీకీ నీలాపనింద వచ్చింది! కొంచెం విదానిస్తే దానంతట అదే తొలిగిపోతుంది! ఒక్క పక్షంరోజులు ఓపిక పట్టండి! తరవాత మీ చిత్తం వచ్చినట్లు చేద్దురుగాని! కొంచెం నా మాట మన్నించండి" అని ఆమె మరింత గాఢంగా అతనిని కౌగిలించుకొన్నది.

విలాసవతి అనురాగానునయశృంఖలలు కాళీదాసకవి హృదయం బంధించి వేశాయి. అలిసి సొలిసిన అతని శరీరం ఆమె దృఢ పరిష్వంగంలో విశ్రమించి కన్నుమూసింది.

—సశేషం.

ఆంధ్రనాటక చరిత్రలో రాఘవయుగం

కళాప్రపూర్ణుని దశవార్షిక వర్ధంతి

మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి

1946 సం॥రం ఏప్రిల్ 16 వ తేదీన మరణించిన కీ॥ శే॥ కళాప్రపూర్ణుడు, బళ్ళారివాస్తవ్యులు తాడిపత్రి రాఘవాచార్యులు గారు ఆంధ్ర నాటక రంగంలో అగ్రశ్రేణికి చెందిన నటుడు.

అటు బళ్ళారి మొదలు ఇటు మద్రాసు వరకూ ఇటు మద్రాసు నుండి బరంపురం వరకూ మొత్తం విశాలాంధ్ర నాటకరంగంలో ఒక నూతనవిప్లవాన్ని తీసుకువచ్చిన ప్రతిభాశాలి రాఘవ. ఆంధ్రుల ప్రతిభా విశేషాలను ఆంధ్రదేశానికే కాకుండా భారత దేశపు ముఖ్యనగరాలన్నింటిలోనూ, అంతర్జాతీయ నాటకరంగంలోనూ చాటా.

రాఘవ లాయరు వృత్తిని నాటక కళ కోసం త్యజించాడు. మద్రాసు హైకోర్టుతో సంబంధం వుండడంవల్ల మద్రాసు ఆంధ్రులతోనూ, సుగుణవిలాస సభవారితోనూ పరిచయం అయింది. ఆ సభవారి ఇంగ్లీషు నాటకాల్లో వివిధ పాత్రలు ధరించి మద్రాసులో పేరు ప్రతిష్ఠలు సంపాదించాడు.

రాఘవకు తెలుగు, ఇంగ్లీషు, కన్నడం, సంస్కృతం, హిందీబాషలు బాగా వచ్చు. తమిళ మరాఠీ భాషల్లో పరిచయంవుంది. బెంగాల్ నాటకరంగ ప్రముఖుడు—శిశిర్ కుమార్ చౌధురీ, మనోరంజన్ భట్టాచార్య, మద్రాసు సుగుణవిలాస్ సభ స్థాపకుడైన సంబంధ మొదలియార్ చేత, విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ చేత, మహారాష్ట్ర నటుడు బాలగంధర్వ, కర్నాటక నటుడు గుబ్బివీరన్న మొదలైనవారిచేత ఉత్తమ నటుడుగా మెప్పుపొందాడు.

రాఘవయుగం

రాఘవ ఆంధ్ర నాటకరంగంలో ఎంతో కాలంగా పాతుకుపోయిన పాత పద్ధతులకు స్వస్తి చెప్పాడు. నూతనత్వాన్ని ప్రసాదించాడు. రచయితలకు కొత్త మార్గాలూ చూపించారు.

ఒక్కసారి రాఘవబృందం నాటకం ప్రదర్శిస్తే చాలు, చాలమంది ఆ పద్ధతినే అనుసరించేవారు. పురుషులే స్త్రీ పాత్రలు ధరించే ఆ రోజుల్లో స్త్రీలే స్త్రీ పాత్రలు ధరించాలని ఎలుగెత్తి చాటాడు. సాధ్యమైనంతవరకు ఆయన నాటకాలలో, స్త్రీ పాత్రలు స్త్రీలే వేయడానికి అఖండమైన కృషిచేశారు.



కీ॥ శే॥ బళ్లారి
రాఘవాచార్యులు

రాఘవ వివిధపాత్రలు


ఆయనహిందీ, కన్నడ, ఇంగ్లీషు నాటకాల్లోనటించారు. ఆయన హిరణ్యకశిపుడు, రాజరాజు, చాణక్య, రామదాసు, పఠాన్ ఓల్ ఆడమ్, ఒథెల్లో, షైలాక్, హామ్లెట్, కింగ్ లియర్ పాత్రల్ని అఖండంగా ప్రదర్శించారు. రాఘవకి కవిత్వధోరణి సంగీత పరిచయంకూడా కలవు. బళ్ళారిలో అందరి మన్ననలకు పాత్రమైన వంశం తాడిపత్రి వంశం. మర్యాదలకు అనాదినుంచి పేరు పడింది. తెలుగు నాటక పితామహుడు, బహు నాటక గ్రంథకర్త అయిన కీ॥ శే॥ ధర్మవరం కృష్ణమాచార్యులవారు వీరికి అతి సన్నిహిత బంధువు.

రంగస్థలంమీదా విడిగానూ, రాఘవాచార్యులవారు సుందర పురుషులు. సుందర విగ్రహమే ఆయనకు చాలవరకు కీర్తి ప్రతిష్ఠలు తెచ్చి పెట్టిందని చెప్ప వచ్చు. విశాలమైన నేత్రాలతో - బొద్దు కనుబొమలతో వెడల్పాటి నుదురుతో వంకెలు తిరిగిన వెంట్రుకలతో ఎంతో గంభీరంగా వుండేవారు. వారిని చూచీ చూడటంతో ఇట్టే ఆకర్షింపబడేవారు. రాఘవ సహజసుందరుడు. ఆ సుందరత్వానికి తగినట్లు వేషధారణలో ఏ పాత్ర ధరించినా ప్రజలహృదయాల్లో హత్తుకుపోయే టట్లుండేది.

ప్రహ్లాద నాటకం

ప్రహ్లాదనాటకంలో రాఘవ హిరణ్యకశిపుని వేషాన్ని సంపూర్ణంగా మార్చాడు. మన నాటకాల్లో హిరణ్యకశిపుని ఎంతో క్రూరుడుగా చిత్రించేవారు. అనేక గ్రంథాల్లోనూ, నాటకాల్లోనూ హిరణ్యకశిపుని క్రూరత్వాన్ని భీకరంగా చిత్రించారు. కాని రాఘవ ఆ పాత్రను రాక్షసంగా కాకుండా, లౌకికంగా, సత్వగుణ ప్రధానంగా, పుత్రునిమీద ప్రేమను ప్రక్కకు తోయలేక లోలోన కుములుతూ, విష్ణువు మీద వుండే ద్వేషాన్ని చిత్రించడంలో కేకలు, బొబ్బలు లేకుండా, కొడుకుని మొరటుపద్ధతులతో లొంగదీయకుండా, సాత్వికపద్ధతుల నవలంబిస్తూ, అనేక వుపాయాలతో, భావగాంభీర్యంతో ఆ సన్నివేశాన్ని సృష్టించాడు.

చంద్రహాసలో దుష్టబుద్ధిగా ఆయన చూపే అభినయప్రాగల్భ్యం ఎంతో భావగాంభీర్యంతో వుండేది. చాలమంది నటులు దుష్టబుద్ధి మిత్రత్వాన్ని, శత్రుత్వాన్ని భిన్నభిన్న రూపాలుగా నటించేవారు. కాని రాఘవ ఆ పాత్రను అతి రాజకీయ ధురంధర తగల దానినిగా అతి నిపుణతతో నిర్వహించేవారు.



కొత్త పెళ్లికూతురు

—చిత్రకారిణి: పి. రంగనాయకి, మద్రాసు.

★ ఆంధ్రనాటకచరిత్రలో రాఘవయుగం ★

దుర్యోధనుడు

అలాగే దుర్యోధన పాత్ర తీసుకోండి— మహాభారతంలో దుర్యోధనునిపాత్ర అద్వితీయంగా రచింపబడింది. మన నాటకాలలో దుర్యోధనులు ఏమాత్రం నిలకడలేకుండా ఓర్పు, సహనమూ విడిచి, అరవడం, కేకలు వేయడం, ఆనందంతో గంతులు వేయడం, కోపంతో చిందులు తొక్కడం చూస్తున్నాం.

రాఘవ అతి నిబ్బరంగా ఏ హంగామా లేకుండా హావభావాల్లోనూ, ఆంగిక చలనం లోను, నడకల్లోను, లేలిక తత్వాన్ని కనబడనీయకుండా, కృష్ణసారథ్యంలో నడుస్తున్న పాండవుల్ని, ఎలా లొంగదీయాలి. పాండవ పక్షపాతం చూపించే కృష్ణునిమీద కక్ష— వీటిని సహించలేని కౌరవ సోదరబృందాన్ని అదుపులో పెట్టుకుంటూ, ఎలా పాండవుల్ని సాధించాలా అనే కార్యదీక్షను, యేక కాలంలో ముఖభావాల్లో, సాత్వికాభినయంద్వారా, నేత్రాభినయం ద్వారా, ఒక ప్రత్యేకత కనబరచి దుర్యోధన పాత్రకు న్యాయం కలుగజేశారు. దుర్యోధనుడు అతి సామాన్యుడు కాక, అతడూ రాజకీయ వేత్తయే అనే భావాన్ని ప్రేక్షకుల్లో కలిగించేవారు. ఈవిధంగా రాఘవ, రచయితలు సృష్టించిన పాత్రలను, నటులు ధరించే పాత్రల స్వభావాన్ని పూర్తిగా మార్చేశారు. ప్రేక్షకుల్లో ఒక గొప్ప సంచలనాన్ని కలుగజేశారు.

రామదాసుగా రాఘవ

అలాగే రామదాసు పాత్రలో వేషం దగ్గరనుంచి అభినయం వరకు ఎంతో మార్పు కనిపించేది. నేటి మన నాటకాలలో కనిపించే రామదాసులు పూర్తిగా మూర్తీభవించిన రామదాసుల్లాగ ప్రారంభనుంచి తయారవుతారు. మీసాలు, గడ్డాలు పెంచడం, రుద్రాక్ష దండలు, కాషాయి గుడ్డలతో మొదటి రంగంనుండి ఒక బైరాగి వేషంగా రామదాసు పాత్రను కృత్రిమ వేషధారణ ద్వారా ఖూనీచేశేవారు.

కాని రాఘవ నిరాడంబరమైన భక్తి తత్వంతో ప్రథమంలో గోపన్నగా, చొక్కా తలపాగతో కనబడేవారు. క్రమేపీ శ్రీరామచంద్రునిమీద కలిగిన భక్తి భావము నాటకాంతానికి భక్తిపారవశ్యంగా మారేది. భక్తిభావంతోపాటు వేషభాషల్లో వచ్చే మార్పులతో, క్రమానుగతంగా రామదాసు పాత్రను అభివృద్ధిపొందించి ప్రేక్షకులందరిలోనూ నిజమైన రామదాసుగా మారిపోయేవారు. ఈవిధంగా అనేక పాత్రలకు ఆయన ఒక కొత్త స్వరూపం యిచ్చారు. ఆంధ్ర నటలోకమంతా ఆయన తీసుకువచ్చిన మార్పులను ఆమోదించారు. రాఘవ ప్రదర్శించే ప్రతి నాటకానికి ముఖ్యంగా నటకులు హాజరయ్యేవారు. రాఘవ వేషధారణను, ఆ గంభీరమైన పాత్రాభినయాన్ని పాత్రల మార్పుస్వభావాన్ని ఇతర నటకులంతా అవలంబించేవారు. రాఘవ నాటకాల ప్రభావం అంతటిది. రాఘవ ఆశయం కళ ప్రజలకు వుపయోగపడాలని, నాటక ప్రదర్శనాలు ధనార్జనకు కాక ప్రజాప్రబోధానికి వుపయోగించాలని, ఆనాడే నాటకకళ పునరుద్ధరించబడుతుందని చనిపోయేవరకూ చెపుతూ వుండేవారు. సాంఘిక నాటకాలను, అమెచూరు సమాజాలను ప్రోత్సహించేవారు. నటనకు సంబంధించినంతవరకూ గుడ్డిగా ఏ నటకునీ అనుసరించక ఎవరికున్న పరిజ్ఞానంతో వారిని ఆలోచించమనేవారు.

ఇంగ్లండు సందర్శనం

రాఘవ 1927 లో ఇంగ్లండు సందర్శించారు. స్ట్రాట్ ఫర్డుఆన్ఏవాన్ లో, షేక్‌స్పియర్ నాటకాలలో పాల్గొనే నిమిత్తం వెళ్ళారు. లారెన్సు ఒలీవియర్, చార్లెస్ లాటన్, ఎడిత్ ఇవాన్స్ వంటివారి మన్ననల నందుకున్నారు. అక్కడ వుండగా ఎన్నో నాటకప్రదర్శనాలనూ ప్రయోగాలనూ చూచాడాయన.

1935 లో రాఘవ సినీరంగంలో ప్రవేశించారు. దుర్యోధనుడుగా ద్రౌపది మానసంరక్షణలో నటించారు. చండికలోనూ, రైతుబిడ్డలో కూడా నటించారు. రాఘవ నాటకరంగాన్ని గూర్చి ఎన్నో కలలు కన్నారు. వాటి నన్నింటిని పూర్తి చేయాల్సిన బాధ్యత ఆయన సమకాలికులమీదా, నేటి నటీనటులమీదా వుంది. ★



15

దుర్గ తమ్ముణ్ణి వెతకటానికి బయలు దేరింది. ఆ వీధిలో చాలా చోట్ల వెతికింది. కాని ఎక్కడా కనపడలేదు. అన్నదారాయ్‌గారింటి దగ్గిరకు వచ్చాక 'ఒకసారి లోపలకు పోయి చూసివద్దాం. పిన్నిగారినయినా చూసినట్లవుతుంది ఒకమాటు' అనుకుంది.

అన్నదారాయ్‌గారింట్లో అడుగుపెడుతూండగా, లోపల్నుంచి ఏడుపు, కేకలు గొడవ గొడవగా విన్పించాయి. సరాసరి లోపలకు వెళ్ళకుండా గుమ్మందగ్గిర నుంచుంది. వసారాలో ఒకపెడ నిలబడి, అన్నదారాయ్‌గారి చెల్లెలు—విధవావిడ—కేకలతో పైకప్పు ఎగరగొట్టేస్తోంది.

"కాస్తయినా భయమనేది ఉంటేగా! ముండవాళ్ళని ఎంతోమందిని నేనూ చూశా. అయినా ఇంత ఇది ఎక్కడా చూడలేదు బాబూ! కాళ్ళకో దణ్ణం—'మొగుడా ఒక్క యముడులాంటివాడు. కోపం వస్తే సున్నంలో ఎముకలేకుండా చితక్కొడతాడు.' అని చిలక్కి చెప్పినట్లు చెప్పా. పోనీ అదయినా గ్రహించి నడుచుకోవద్దూ? వడ్లు కాస్త ఎండబొయ్యి, ఎండబొయ్యి అని మూడురోజుల నుంచి చెపుతున్నా—నా మాట లెక్క చేస్తేనా! అసలు చెవిని పట్టించుకుంటేనా? ఎవరు చెపితే ఎవరు వింటారీరోజుల్లో! అయినా ఇంటికోడళ్లు వడ్లుదంచుకుంటారని, ఎంతంతేసి పనులైనా తామే చేసుకుంటారని ఎరుగుదుముకాని, పట్టపురాణీలా ముస్తాబయి కూర్చుంటారని మేము ఎరుగమమ్మా!" అంటూ ఆ 'పట్టపురాణి' అంటే

అనువాదం:
మద్దిపట్ల సూరి

జరిగినకథ:—

నిశ్చిందిపురం బెంగాల్‌లోని మారుమూల కుగ్రామం. ఆ ఊళ్లో చితికిపోయిన మధ్య తరగతి సంసారి హరిహరరాయ్. అతని భార్య సర్వజయ. కూతురు దుర్గ. హరిహరరాయ్ పెళ్ళయిన తరవాత కొంతకాలం దేశాలు పట్టిపోయి, శాస్త్రాలు, కావ్యాలు చదివి పండితుడై, పదేళ్ళకి తిరిగివచ్చి కాపరంపెట్టాడు. దుర్గ పుట్టిన చాలఏళ్ళకి అతనికి కొడుకు పుట్టాడు. వాడిపేరు అపూ. ఇంట్లో ఎప్పుడుచూసినా 'ఇవాళ ఎలా గడుస్తుందిరా భగవంతుడా' అనే చింతే. కాని పిల్లలకిదేం పట్టింది? దుర్గకి ఒక్కనిమిషం ఇంట్లో కాలు నిలవదు. ఎప్పుడూ ఏ తోటలోనో, ఏ చెట్టుకిందనో ఆడుకుంటూ ఉంటుంది. అపూ ఎప్పుడూ ఊహాలోకంలోనే గడుపుతాడు. వాడికి ప్రతిదీ కొత్తే. ప్రతిదీవింతే. వాడి జీవితపరిధిలోకివచ్చే ప్రతి సాధారణవిషయమూ అసాధారణమైనదిగా, అద్భుతమైనదిగా వాడికి కనిపిస్తుంది. ఒకరోజున అపూను బళ్లోవేశారు. చదువుచెప్పడంకంటె, బడిలోనే ఒకపక్కనఉన్న చిల్లర కొట్టువని చూసుకోవడం, కొట్టుకు వచ్చేపోయేవారితో కబుర్లుచెప్పడమే పంతులుగారికి అలవాటైంది. కొట్లోకివచ్చే గ్రామస్థుల కబుర్లు వింటూ అపూ ఏవో ఆలోచనల్లో తేలిపోతూ ఉండేవాడు. పంతులు ఎప్పుడైనా పాఠంచెప్పినా ఆ మాటలు వాడికి అర్థంఅయ్యేవికావు. అర్థంకాని ఆ శబ్దసముదాయం వెనక వాడికి ఏవో చిత్రచిత్రమైన రమణీయలోకాలు, దేశకాలబాధితంకాని ప్రపంచాలు కనిపించేవి. పెద్దవాడైన తరవాత దారికనుక్కుని అక్కడికివెళ్ళాలని వాడు నిశ్చయించుకున్నాడు.

★ పథేర్ పాంచాలి ★

ఎలా ఊస్తూవే కూర్చునేదీ సరిగ్గా అలా అభినయ పూర్వకంగా చూపించి—"ఇలాంటిది ఎక్కడా జన్మలో కనీ యెరుగం, వినీ యెరుగం—" అంటోంది.

లోపలనుంచి అన్నదారాయ్ కోడలు ఏడుపుగొంతుకతో - మధ్య మధ్య చీదేస్తూ— "పట్టపురాణీలా కూర్చున్నానా యేం! నిన్న పదిసేర్ల పప్పులు విసిరాను సాయం కాలందాకా కూర్చుని. మధ్యాహ్నం రెండుమెతుకులు నోట్లోవేసుకుని మొదలెట్టినదాన్ని సాయంత్రం అయిదుగంటల రైలు వచ్చేవరకూ అలాగే కూర్చున్నాను కాని మళ్ళీ లేవనయినా లేచానా? రెండు బుట్టల పప్పులూ వేయించి విసిరి, దీపాలు పెట్టాక అప్పుడు లేచాను. ఏం, మాటలేనా యేం? ఒళ్లంతా చితకకొట్టినట్లుంది. రాత్రికి ఏ జ్వరమైనా వస్తుందో ఏం ఖర్మమో! ఈ చేతులూ ఒళ్లూ నొప్పులు ఎవరికి తెలుస్తాయి? పైగా ప్రొద్దునే లేచి ఉత్త పుణ్యానికే ఈ దెబ్బలు తినటం—ఎందుకు, నేనేం ఊరికే తిని కూర్చుంటున్నానా ఏమన్నానా?" అనుకుంటూ వాపోతోంది.

సరిగ్గా అదేసమయంలో అన్నదారాయ్ కొడుకు గోకుల్ ఒక చేత్తో ఆకులుదుయ్యాని వెదురుబెత్తం, మరొకచేత్తో చురకత్తి పట్టుకుని. ఇంట్లోకి వచ్చాడు. భార్య ఏడుస్తూ అన్న చివరిమాటలు అతడి చెవినిపడ్డాయి. "ఇంకా ఊరుకోలేదూ? నీకింకా దెబ్బలు రాసిపెట్టి ఉన్నాయి, నాకు తెలుసు. నాకింకా అట్టే కోపం తెప్పించకు ప్రొద్దున్నే. వడ్లు ఎండపొయ్యమని మూడు రోజుల్నుంచి చెప్పి చెప్పి విసుగెత్తిపోయాను. అసలే మబ్బులు మబ్బులుగా ఉండె పైన. ఇహ తర్వాత అవి కాసినీ మొక్కలు మొలిచి పాడైపోతే నీయబ్బ ఎవడొచ్చి వాటిని ఇది చేస్తాడు? ఏడాది పొడుగునా పిండం ఎలా వస్తుందనుకున్నావ్?" అంటూ గర్జించాడు.

గోకుల్ పెళ్ళాం చటుక్కున ఏడుపు మాని, రోషం తెచ్చుకుని, "మీరు మాట మాటకీ మానాన్న పేరెత్తకండి చెపుతున్నా. మానాన్న మీకేం చేశాడనీ, అయినదానికీ కానిదానికీ ఆయన్ని ఆడిపోసుకోడానికి?" అన్నది ఝుమాయించి.

ఆమె మాట ఇంకా పూర్తికాకముందే గోకుల్, చేతిలో వెదురుబెత్తం క్రింద పారేసి, ఆ చురకత్తితో ఒక్క గంతులో వసారా మెట్లన్నీ దాటేసివచ్చి-"అలాగా! ఇవాళ నువ్వో నేనో తేలిపోవాలి. మీ పుట్టింటి అతిశయం అణచనిదే నేను—" అన్నాడు.

వ్యవహారం దాదాపు ఖూనీదాకా పోతుందల్లే ఉందనిచూసి మెల్లాలో ఉన్న రైతు "అదేమిటి బాబుగారూ ఏంపని? ఆగండాగండి" అంటూ వసారాలోకి వచ్చేశాడు. అతడివెనుక దుర్గకూడా పరుగెత్తుకు వచ్చేసింది. అన్నదారాయ్ గారి చెల్లెలు కూడా వసారాలోంచి లోపలకు వచ్చింది. అదంతా ఓ పెద్ద రగడైంది. లోపల గోకుల్ భార్య—భర్త ఎదుటినుంచి తప్పుకుని—దెబ్బలు తప్పించుకోటానికని చేతులు రెండూ ఎత్తి మొహాని కడ్డుపెట్టుకుని గోడకి అంటుకు పోయింది. భయం పేరుకుపోయిందామె చూపుల్లో—ఆ రైతువెళ్లి, గోకుల్ చేతిలో కత్తి ఊడలాక్కున్నాడు. తర్వాత అతణ్ణి పట్టుకుని, బయటికి లాక్కొనివస్తూ, "ఏమిటి బాబూ ఇది, ఆగండి, కొంచెం తమాయించండి" అన్నాడు.

గోకుల్ కి ముప్పైఅయిదు, ముప్పై ఆరేళ్ళకు తక్కువ ఉండవు. అయితే అతడిదంత గట్టి శరీరం కాదు. మలేరియాతో దుర్బలుడై పోయాడు. బలిష్ఠుడైన రైతు పట్టు తప్పించుకోటానికి ప్రయత్నిస్తే తన దౌర్బల్యమే బయటపడుతుందని గ్రహించి, రైతు వైన కాలవస్తూ—"చూడు, గంపెడు ధాన్యం, విత్తనాల ధాన్యం. తడిసి మొక్కలు మొలిచి పాడైపోతే ఏం చేసుకుంటాం ఇహ వాటిని? మూడురోజుల్నుంచి చెపుతున్నాను. పైగా ఆ పొగరు చూశావుగా; ఆ పొగరు అణచక పోతే—" అనటం మొదలెట్టాడు.

దుర్గ 'అమ్మయ్య' అని ఊపిరి తీసుకుంది. ఇది పిన్నిగారితో మాట్లాడటానికి సమయం కాదని గ్రహించి, అక్కడనుంచి మెదలకుండా తిరిగి వచ్చేసింది.

కొంచూ బెనర్జీగారింటి దగ్గర జామచెట్టు క్రింద ఒకడు బిందెలూ, చెంబులూ మాట్లు వేస్తూ కూచున్నాడు. ప్రక్కన కొలిమి పెట్టాడు. పాతపాత్ర సామానులన్నీ చుట్టూ గుట్టపడివున్నాయి. పొట్టిగా లావుగా ఉన్నాడతడు. ఎన్నేళ్లుంటాయో తెలియదు. ముప్పై ఉన్నా ఉండొచ్చు. యాభైవున్నా ఉండొచ్చు. మెళ్ళో తులసిపూసల దండ, నుదుట కుడివైపున తెగిన గాయపుమచ్చ ఉన్నాయి. మణికట్టుమీద నరాలన్నీ త్రాళ్ళలా ఉబ్బిఉన్నాయి. మాసిన పంచె కట్టుకున్నాడు. ఆవీధి పిల్లలు చాలామంది అతడిచుట్టూ మూగి, తమ సామానులు బాగు చేయించుకుంటూ చూస్తూ నుంచున్నారు. దుర్గకూడా వెళ్లింది. "ఏంకావాలమ్మాయ్?" అని అడిగాడతడు.

"ఏం లేదు, ఊరికే చూడటానికి వచ్చాను" అన్నది దుర్గ.

ఇంటికి వెళ్ళాక — "ఇవాళ గోకుల్ బాబాయ్ పిన్నిని ఎలా కొట్టాడనుకున్నావ్!" అంటూ తల్లితో జరిగినదంతా పూసగ్రుచ్చినట్లు చెప్పింది దుర్గ.

"అః....ఒట్టి మొరటుమనిషి మరీను— అంత ఉత్తమురాలు ఇలాంటి ఇంట్లో ఇలాంటివాడిచేతిలో పడింది పాపం! బ్రతుకంతా దెబ్బలతోనే వెళ్లమారిపోతోంది" అన్నది సర్వజయ.

"నేనంటే చాలా అపేక్ష. ఇంట్లో ఏంచేసుకున్నా పాపం నాకోసం అట్టేపెడుతుంది. పిన్ని ఏడుపు చూస్తుంటే కడుపు తరుక్కుపోయింది. ఆ రాయ్ తాతయ్యగారి చెల్లెలుకూడా అటు తిప్పి ఇటు తిప్పి చివరకు పిన్నినే తిడుతుందమ్మా!" అన్నది దుర్గ.

* * * *

దుర్గ మూడు నాలుగురోజులు వరుసగా చూడటానికి వెళ్లింది, ఆ జామచెట్టుక్రింద మాట్లువేసే అబ్బిదగ్గరకు. అబ్బి నాన్న పేరు, ఇల్లు ఎక్కడున్నదీ అన్నీ గ్రుచ్చి గ్రుచ్చి అడిగాడు. "మీ ఇంట్లో మాట్లువేయవలసిన సామానులేం లేవూ? తీసుకురా అమ్మాయ్?" అని అడిగాడు.

దుర్గ ఇంటికి వచ్చి, "చిల్లుబొచ్చెలన్నీ ఇయ్యి అమ్మా! మాట్లువేసే ఓ మంచి అబ్బి వచ్చాడు — ఆ వీధిని జామచెట్టుక్రింద కొలిమి పెట్టాడు—" అన్నది తల్లితో.

ఆ అబ్బి తనపేరు 'ప్రీతమ్' అని చెప్పాడు. కులానికి కంచరిట. కొలిమి ఊదుతూ ఊదుతూ మధ్య మధ్య నిటారుగా కూర్చుని "జయ్ రాధే! రాధే గోవింద!" అని స్మరిస్తూ ఉంటాడు. ప్రొద్దున్నే అతడి కొలిమిదగ్గరకు ఊళ్ళోవాళ్లు చాలామంది వచ్చేవాళ్లు. వచ్చినవాళ్లకల్లా వటకారుతో



రమేశ్ ఇంటికి వెళ్లుటకు భయపడ్డాడు...
నా బట్టలను మాపుకొన్నాను, రామ్. మా అమ్మ నన్నిప్పుడు తిట్టుతుంది.
రమేశ్. నేను కూడా తరచుగా బట్టలను మాపుకొంటుంటాను గాని మా అమ్మ నన్నెప్పుడూ తిట్టదు, రావోయ్.
రామ్ ఇంటివద్ద:
ఎందుకతనేడుస్తున్నాడు?
అతడింటికి వెళ్లుటకు భయపడుచున్నాడు. ఎందుకంటే అతడు తన బట్టలను మాపుకొన్నాడు.
రమేశ్ ఇంటివద్ద:
మళ్లీ మురికిగా ఇంటి కొచ్చావు! నిన్నింక యెప్పుడూ ఆటకు బైటకు వెళ్లనీయను!
ఈ బాలుని తిట్టకమ్మా - పిల్లలందరూ ఆడునప్పుడు మురికిగా నగుదురు.
ప్రతిరోజూ వాడి బట్టలను ఉతుకుటకు చెమట వోడుస్తున్నాను వాటిని బాదుతూ అందుకవి చాలాత్వరగా చిరిగి పోతున్నవి.
అది నిజమే. బాదుట బట్టల పోగులను తెంచును మరి అందువల్లనే బట్టలు త్వరగా చిరిగి పోవును.
బాదబడినబట్ట పెద్దదిగా చూపబడినది
కాని మీరు సన్‌లైట్ సబ్బుతో ఉతికినప్పుడు బట్టలను బాదనక్కర్లేదు దాని సమృద్ధయిన నురగమురికి నంతటిని సులభంగాతొలగించును, ఆవిధంగా మీ బట్టలు చాలాకాలము మన్నును కూడ.
అది నిజం! త్వరగా నురగను గలిగించు సన్‌లైట్ సబ్బు బట్టలను బాదకుండానే సరిగ్గా తెల్లగాను మరియు కాంతివంతముగాను ఉతుకును. అంటే - బట్టలు చాలాకాలము మన్నును మరియు నాకు డబ్బు మిగులును.
SUNLIGHT SOAP
సన్‌లైట్ సబ్బు
భారతదేశంలో తయారుచేయబడినది
బట్టలు చాలకాలము మన్నునట్లు చేయును

★ పథేర్ పాంచాలి ★

కట్టు వెలిగించుకోటానికి నిప్పు అందించే వాడు. అందించేటప్పుడు అతి వినయంగా తలవంచి, "చిత్తం చిత్తం, కాల్చుకోండి. అన్నిటికీ రాధేగోవింద్ ఉన్నాడు...... కొబ్బరితోట పేరు చెప్పకండి బాబూ! పోయిన సంవత్సరం అరవై మొక్కలు కొనుక్కువచ్చి నాటాను, ఏం చెప్ప మన్నారు! పందికొక్కులో యేవో వేళ్ళతో సహా కొరికిపారేశాయ్! ఎంత డబ్బు! ఏట్లో పోసినట్లయింది" అనేవాడు.

ముఖర్జీ ప్రొద్దుననగా వచ్చి జేరాడుకులా అలాగే కూర్చున్నాడు. ఎలాగో అలా అతణ్ణి మాటలతో మంచి చేసుకుని, ఊరికే బిందె కూటు వేయించుకుపోదామని సంకల్పం. చుట్టకాలుస్తూ — "అది నిరుడు జరిగిన సంగతిలే. ఈ యేడు కూడా అనుకున్నా, ఇంటివెనక ఓ ఇరవై మొక్కలైనా వేద్దామని! ఇంతలో ఈ మలేరియా ఒకటి పట్టుకుంది కదా. మీ వైపున ఈ మలేరియా ఎలా ఉంది మేస్త్రీ?" అని అడిగాడు. ప్రొద్దున వచ్చినప్పట్నుంచీ అతణ్ణి మేస్త్రీ అని పిలవటం మొదలెట్టాడు.

"ఓ! కొల్లలుగా ఉంది, బాబూ! కొల్లలుగా ఉంది. మలేరియా మాట ఎత్తకండి, నా రొముకలు కొరికేసింది—ఇదుగో తీసుకోండి మీ బిందె. అరుకొట్లు ఇప్పించండి" అన్నాడతడు.

ముఖర్జీ గారు బిందె చేత పుచ్చుకుని, అక్కడినుంచి లేచి, "ఆ దీని కూడా మజూరీ ఏమిటి లెద్దూ. బ్రాహ్మడికేదో ఓ వస్తువు బాగుచేసి ఇచ్చావు, కార్తీక మాసపు పర్వదినాల్లో. దానికి మళ్ళీ—" అన్నాడు.

ప్రీతమ్ చటుక్కున ముఖర్జీగారి చేతిలో బిందె పట్టుకుని అతి అమాయికంగా నవ్వి, "చిత్తం, మన్నించండి బాబూ! ఇలా ఊరికే బాగుచేసి ఇవ్వను. తెల్లారి ఇంత వరకు ఇంకా బోణీఅన్నా కాలేదు. చిత్తం. అలా వీల్లేదు. బిందె ఇక్కడపెట్టి వెళ్ళండి. ఇంటికెళ్లి డబ్బు యిచ్చి పంపించండి—" అన్నాడు......

"మాడు, పాత సామానులూ అవీ తీసుకుని, వాటికి మారకంగా క్రొత్త సామానులు కూడా ఇస్తూ ఉంటా రప్పుడప్పుడు అడిగి చూడు" అన్నది దుర్గ తల్లి.

ప్రీతమ్ ఒప్పుకున్నాడందుకు. దుర్గ ఇల్లంతా వెదికి చిల్లులు పడ్డ చెంబులు, గిన్నెలు, బిందెలు అన్ని తెచ్చి అతడి చుట్టూ చేర్చింది. ఓ పూటల్లా ఆ పిల్ల ఆ జామచెట్టు క్రిందే గడిపింది—ఆ కొలిమి ఊదటం, కళాయిలు పూయటం చూస్తూ.

"నీ కొక ఇత్తడి ఉంగరం చేసి ఇస్తాలే అమ్మాయ్! దానికి నువ్వేమీ ఇవ్వక్కర్లేదులే" అనికూడా అన్నాడా అబ్బి. సర్వజయ ఆ మాట విని, "ఎంత మంచివాడే ఆ అబ్బి! వచ్చే బుధవారం మన అపూ పుట్టిన రోజు, పప్పు అన్నం రెండు మెతుకులు మనింట్లోనే తిని వెడతాడు—పిలు" అన్నది.

బుధవారంనాడు ప్రొద్దున్నే దుర్గ జామచెట్టు క్రిందికి వెళ్లిచూస్తే ఆ అబ్బి లేడు. ఎవర్నో అడిగితే క్రితంరోజు సాయంత్రమే ఎప్పుడో దుకాణం ఎత్తేసుకుని వెళ్లిపోయాడన్నారు. కొలిమితాలూకుగుంట, ఇంత బూడిదపోగు తప్ప ఇంకేమీ లేవు అక్కడ. దుర్గ ఇంకా అక్కడా అక్కడా వెతికింది. వాళ్లనీ, వీళ్లనీ అడిగింది. అత డెక్కడికి వెళ్లిందీ యెవరికీ తెలియదు. భయంతో దుర్గ ముఖం వాడిపోయింది—అమ్మ ఈ సంగతి వింటే ఏమంటుంది: ఇంట్లో సగం సామానులు అతడిదగ్గిర ఉన్నాయి. 'ఝుకర్ హాట్' బజార్లో తనకొక కంచర్ల దుకాణం ఉన్నదని, అక్కడికి కబురుచేశానని, తన తమ్ముడు కొత్త సామానులు తీసుకుని ఒక్క రోజులో వస్తాడని, రాగానే పాతవాటి మారకంకింద కొత్తవి ఇస్తానని చెప్పాడా అబ్బి! ఆ అబ్బి యెక్కడ! అతడి తమ్ముడెక్కడ! అత డెక్కడికి వెళ్లిందీ ఎంత వెతికినా దుర్గకి ఆచూకీ దొరకలేదు. పోయినవి తమ సామానులు మాత్రమే. జాగ్రత్తగా ఉండేవాళ్లవి ఎవరివీ ఒక్క ఇత్తడిముక్కయినా పోలేదు.

రోజల్లా వెతికి వెతికి చివరికి సందవేళ దుర్గ ఇంటికి వచ్చి, తల్లితో ఏడుస్తూ అంతా చెప్పింది. హరిహరుడు ఊళ్లో లేడు. ఎవరు వెతుకుతారు? ఎవరు చూస్తారు! సర్వజయ నిర్విణ్ణురాలయిపోయింది. "ఒక్కసారి పోయి పెద్ద బాబుగారితోనైనా చెప్పిరావే! ఇంత ఉప్పలాయం ఎక్కడా చూడలేదే!" అన్నది. హరిహరుడు ఇంటికి వచ్చాక 'ఝుకర్ హాట్' బజారంతా వెతకటం అయింది. ప్రీతమ్ అనే అతడి కంచర దుకాణమే అక్కడలేదని, అసలలాంటి 'చమార్'గల మనిషికూడా లేడని తెలిసింది.

* * *

కొన్ని నెలలు గడిచిపోయాయి. భాద్రపదం వచ్చింది.

అపూ సాయంత్రం ఎక్కడికో వెళ్లబోతుంటే, వాళ్ల అమ్మ వెనకనుంచి— "ఎక్కడికి వెడుతున్నావ్‌రా అపూ? పెనగలు, పేలాలు వేయిస్తున్నాను, ఇప్పుడే తిందువుగాని—ఎక్కడికీ వెళ్లకు" అని కేకేసింది. అపూ వినిపించుకోలేదు. పేలాలూ, అవీ తనకి ఇష్టమనే తల్లి వేయిస్తున్నదన్న సంగతి తెలుసు వాడికి. అయితే మాత్రం యేం? నీలూవాళ్ల యింట్లో ఏమిటో ఆడుతున్నారు ఇందాకట్నుంచి. వీధిలో అడుగు పెట్టగానే మళ్లీ వెనకనుంచి—"వెళ్ళిపోయావురా అప్పుడే. అపూ! ఒరే అపూ! ఏంపిల్లవాడివిరా నువ్వు? వేడివేడివి తింటావని నీళ్ళకెళ్ళిరాగానే కూర్చుని నేను వేయిస్తూంటే—అపూ! అపూ!" అని కేకెయ్యటం విన్పించింది.

అపూ ఒక్క పరుగులో నీలూ వాళ్ళ యింటికి వెళిపోయాడు. చాలామంది పిల్లలు పోగయినా రక్కడ. అపూ వచ్చేసరికే వాళ్ల ఆటలయిపోయాయి.

"రారా అపూ! దక్షిణపువైపు మైదానానికి వెళ్ళి పిట్టల్ని వాటినీ చూద్దాం" అన్నాడు నీలూ. అపూ సరే అనగానే ఇద్దరూ అక్కడికి వెళ్లారు. పంటచేలూ అవీ దాటాక, నవాజ్ గంజ్‌కి వెళ్లే కంకరరోడ్డు తూర్పు పడమరలుగా మైదానం మధ్యగా వెడుతుంది. ఊళ్ళోంచి ఒక మైలు ఉంటుందది. అపూ ఎప్పుడూ ఇంతదూరం ఆటలకై వచ్చి యెరుగడు. తనకు పరిచితమైన హద్దులన్నీ దాటించి నీలూ తనని యెక్కడికో తీసుకు వెడుతున్నట్లు తోచింది వాడికి. కొంచెంసేప

టికే వాడు "ఇంటికి పోదాం పద నీలూ దా! మా అమ్మ తిడుతుంది. చీకటిపడుతోంది. నేను ఒక్కడ్నే ఆ లొద్దుగు చెట్టుక్రిందనుంచి వెళ్ళలేను. నువ్వు తీసుకెళ్ళు!" అన్నాడు నీలూతో.

మళ్ళీ తిరిగివస్తూ నీలూ దారి తప్పాడు. అటు యిటూ తిరగ్గా తిరగ్గా ఎవరి మామిడి తోటలోనుంచో ఓ దారి కన్పించింది. ప్రొద్దు క్రుంకటానికి ఇంకా కాస్త వ్యవధి ఉంది. పైన మళ్లీ మబ్బులు క్రమ్ముకుంటున్నాయి. ఆ స్థితిలో—నడుస్తూ నడుస్తూ ఉన్న నీలూ చటుక్కున ఆగి, అప్పూను మెల్లిగా వెనక్కిలాగి, ఎదురుగా ఏదో చూపిస్తూ "అప్పూ! అదుగో రోయ్" అన్నాడు భయంతో.

అప్పూ తన స్నేహితుని భయానికి కారణమేమిటో గ్రహించలేక—"ఏమిటి నీలూ?" అని అడిగాడు. వాళ్లు చుట్టు తిరిగి వెళుతున్న దారి ఎవరి మెల్లావరకో ఆగిపోయింది—అక్కడొక గుడిసె, గంగరేగి చెట్టు ఉన్నాయి. వాడు ఏమీ అడగక ముందే నీలూ భయపడుతూ "అదేరా ఆ పిశాచి ఇల్లు" అన్నాడు.

అప్పూముఖం పాలిపోయింది. పిశాచి ఇల్లా ఇది? సంధ్యవేళ ఎక్కడికొచ్చిపడ్డాం! ఆమెల్లాలోని గంగరేగు చెట్టుకాయలు దొంగతనంగా కోసుకున్నందుకు ఆ పిశాచి వెస్తవాళ్ళ కుర్రాణ్ణి గొంతునులిమి జమ్ముగడ్డి చుట్టి నీళ్లలో పారేసిన సంగతి అందరికీ తెలిసిందే! ఆ పిశాచి తలుచుకుంటే చూపులతోనే చిన్న పిల్లల నెత్తురు పీల్చి పారెయ్యగలదని ఎవరికి తెలియదు: ఆ నెత్తురు పీల్చేప్పుడు ఆ పిల్లలకి ఏమీ తెలియనే తెలియదట. తర్వాత ఇంటికి వెళ్లి మామూలుగా పడుకున్నవాళ్లు మళ్ళీ మర్నాడు ఇహ లేవటమంటూ ఉండదుట! చలికాలంలో రాత్రిళ్లు బొంతకప్పుకుని పడుకుంటే అక్క ఈ పిశాచికథలు చెప్పటం మొదలెడితే "రాత్రిళ్లు నాకేం అంటే కథలు చెప్పకు అక్కా, భయమేస్తుంది-రాజకుమార్తె కథ లేనైనా చెప్పు" అని తాను ఎన్నిసార్లో అడిగాడు. ఆ గుడిసెలో ఎవరైనా ఉన్నారో లేదో అని ఒకసారి లోపలికి అలా చూశాడు. చూడగానే వాడి ఒళ్లు కొయ్యబారిపోయింది. కంచెప్రక్కన రేగిచెట్టు క్రింద మరెవరో కాదు, ఆ పిశాచే కన్పించింది-అంతేకాదు. తమవైపే చూస్తూ నుంచుని ఉంది. ఇంక అప్పూకి ముందుకు కాని వెనక్కి కాని అడుగుపడలేదు.

ఆ పిశాచి కనుబొమలు చిట్లించి, వేళ్ళాడుతున్న దవడలతో, ఇంకొంస్పష్టంగా మాడాలని కాబోలు ఒక్కొక్క అడుగే ముందుకు వస్తోంది. తాను పట్టుపడిపోయాడు, ఎటుపారిపోవటానికీ దారిలేదు. ఏంచేసినయితే యేం, ఆ పిశాచి కోపమంతా తనమీదే-ఇప్పుడే తన ప్రాణంలాగేసి తనని గడ్డిలో చుట్టిపారేస్తుంది - అనుకున్నాడు అప్పూ.

నోటిముందు చిరుతిండి వదులుకుని, అమ్మ ఎన్ని పిలుస్తున్నా వినిపించుకోకుండా అడివిమనస్సుకి కష్టం కలిగించి ఇంతదూరం వచ్చినందుకు ఇది శాస్తి. వాడు నిస్సహాయంగా నాలుగుదిక్కులూ చూస్తూ-"నేనేమీ ఎరుగనుఅవ్వా. నానేమీ చెయ్యను. నన్ను విడిచిపెట్టు. నేనింక ఈ ఛాయల కెప్పుడూ రానేరాను. ఇవాల్టికి విడిచిపెట్టు అవ్వా" అన్నాడు.

నీలూ భయంతో ఏడుపు ప్రారంభించాడు. అప్పూకి కన్నీళ్లుకూడా ఇగుర్చుకుపోయేటంత భయం వేసింది.

"భయమెందుకు నాయనా!? నేనంటే ఎందుకు అంతభయం?"...అని మరీ వేళాకోళంలోకి దిగుతున్నానేమో అనుకుని-

★ పథేర్ పాంచాలి ★

"నేనెందుకు పట్టుకుపోతాను మిమ్మల్ని! రండి, గుడిసెలోకి రండి. మామిడి తాండ్ర పెడతా" అన్నది ముసలిది.

మామిడితాండ్రా!... ముసలిది ఎలాగో మాయచేసి గుడిసెలోకి లాక్కుపోదామని చూస్తోంది. వెడితే ఇంకేమన్నా ఉందా! దయ్యాలూ భూతాలూ ఇలా ఎన్నో విధాల మాయచేస్తాయని-అలాంటి కథలు తల్లి చెప్పగా చాలా విన్నాడు.

ఇప్పుడేమిటి చెయ్యటం! ఏమిటి ఉపాయం!

ముసలిది ఇంకా తనవైపుకే వస్తూ "భయమెందుకు నాయనా. నేనేమీ అనను. ఎందుకు భయం నేనంటే?" అన్నది.

ఇంకేముంది? అయిపోయింది! తల్లిమాట విననందుకు శాస్తి జరగటానికి ఇంకెంతో సేపు పట్టదు. చెయ్యిచాపి, ప్రాణాలుగుంజి ఇప్పుడే గడ్డిలో కప్పిపెడుతుంది తనని. ముసలిదాని ముఖంలో నవ్వు మాయమై, వికృతరూపం బయటపడుతుందని క్షణక్షణమూ అనుకుంటూనే ఉన్నాడు. అడవిలో అజగరం యొక్క ఇంద్రజాలిక దృష్టిలోపడిన హరిణశిశువు మరొకవైపుకు కన్నుమరిచి చూడనేలేదట! అలాగే తన చూపుకూడా ముసలిదానిముఖంమీదనే నిలిచిపోయింది.

వాడు బిగుసుకుపోయిన కంఠంతో దిక్కుతోచక "అవ్వా! అవ్వా, మా అమ్మ ఏడుస్తుందవ్వా. ఇవాల్టికి నన్నేం చెయ్యకు నేను నీచెట్టుకాయలు కోసుకునేందుకు ఎప్పుడూ రానుగా, మా అమ్మ ఏడుస్తుంది అవ్వా" అన్నాడు.

భయంతో అపూ ముఖం నల్లబడిపోయింది... ఆగుడిసె, వాకిలి, తలుపు, చెట్లు, నీలూ-నాలుగువైపులా అంతా మసకవేసినట్లుంది. ఎక్కడా ఎవరూ లేరు. తానూ, ఎదురుగా ముసలిపిశాచిమిడిగ్రుడ్లుమాత్రమే. ఎక్కడో దూరంగా తల్లి పేలాలు పెడతా రమ్మనిపిలుస్తున్న పిలుపు లీలగా విన్పిస్తోంది.

మరుక్షణంలోనే చెప్పలేనంతభయంతో పై ప్రాణాలు పైకి పోయాయి వాడికి. ఎలాగో తెగించి 'అమ్మో' అని ఓ అరుపు అరచి, ప్రాణభయంతో దిక్కుతోచక ఎదురుగా ఉన్న తుప్పలు పొదలూ దూకి, ముక్కుకు సూటిగా పరుగెత్తాడు అపూ. వాడి వెనుకే నీలూ పరుగు అందుకున్నాడు.

వీళ్ళిద్దరి భయానికి కారణమేమిటో తెలియక — "నేను వాళ్ళని పట్టుకోపోనూ లేదు. కొట్టపోనూ లేదు. పసివాళ్ళు పాపం, నన్ను చూసి ఈ సందెవేళ ఎందుకు భయపడ్డారో! ఎవరిపిల్లలో" అనుకున్నది ముసలిది.

అపూ ఇంటికి వచ్చేసరికి చీకటిపడింది. సర్వజయఅప్పుడేపొయ్యిరాజేసి, తాటిరొట్టె కాల్చేప్రయత్నంలో ఉంది. దుర్గ దగ్గరకూర్చుని, తాటిపండుగుజ్జుతీస్తోంది. అపూను చూడగానే, "ఎక్కడున్నావ్ రా ఇందాకట్నుంచి? సాయంత్రమనగా వెళ్ళావు. ఇవాళ ఏమీ తిననేలేదు, ఆకలిదప్పులు లేవా ఏం?" అని అడిగింది తల్లి.

తల్లితో చెప్పుకోవలసిన సంగతులుఎన్నో అపూ మనస్సులో పేరుకుని, అన్నీ ఒక్కసారిగా బయటికి రావాలని ప్రయత్నిస్తున్నాయి. ఒక దాన్ని ఒకటి త్రోసుకోవటంతో బయటికి వచ్చేదారి మూసుకుపోయి అపూని నోరెత్తకుండా చేశాయి. వాడు— "నేను గుడ్డలు విడవనా అమ్మా? ప్రొద్దుననగా తొడుక్కున్న గుడ్డలు నావి"—అని మాత్రం అన్నాడు.

ఆమె పేలాలు పెడదామనే ఉద్దేశ్యంలో ఉన్నట్టు కన్పించలేదు. తాటిరొట్టె పలచగా తాటాకులా వస్తోందా, మందంగా వస్తోందా అనే ధ్యాసలో పడిపోయింది. అపూ విస్తుపోయాడు. ఆమె చేతిలో పని పూర్తికాగానే దుర్గతో "ఒకటి గుండు కాల్చి చూస్తాను. లేకపోతేపోనీ తప్పాబల్లకింద గిన్నెలో బియ్యపుపిండి ఉంది. తీసుకురా కాస్త—" అని అపూవైపు తిరిగి, "ఉండరా, నీకు వేడి వేడిగా కాల్చి ఇస్తాను" అన్నది.

"ఏవీ? పేలాలూ అవీ అమ్మా?" అని అడిగాడు అపూ.

"ఏదీ నువ్వు తింటేగా. ఎన్నిసార్లు పిలిచాను విన్నా? నువ్వు వెళ్ళిపోతివాయె. చల్లారిపోతూంటే దుర్గ తినేసింది. ఇహనో ఈ రొట్టె అయిపోయిందిగా, కాల్చగానే పెడతాను—"

అపూ సాయంత్రంనుంచి మనస్సులో కట్టుకున్న పేకమేడ కాస్తా—ఎవరో ఉఫ్ మని ఊది పడగొట్టినట్లయింది ఇదేనా అమ్మకు తనమీద ఉన్న అపేక్ష! వాడు సాయంత్రం ఇంట్లోంచి బయటికి వెళ్ళినప్పట్నుంచీ అమ్మ ఎంత బెంగపెట్టుకుందో తనకోసం! 'మా అపూ ఇంకా రాలేదేం, చెరువునుంచి రాగానే, వాడికోసమని నేను ఇవన్నీ చేస్తే వాడు రానేలేడు కదా!' అని అనుకుంటూ ఉంటుందనుకున్నాడు.

అమ్మ తనకోసం బెంగపెట్టుకుని ఉంటుందని మోసపోయాడు. అమ్మ అవన్నీ శుభ్రంగా అక్కకి పెట్టేసి, నిశ్చింతగా కూర్చుంది! అనవసరంగా తానే బెంగపెట్టుకుని సతమతమయినాడింతసేపూ!...

"చప్పచప్పన కాల్చు అమ్మా! పైన మబ్బు క్రమ్ముకుని వస్తోంది, వాన వచ్చిందంటే ఇంక కాల్చుకోటానికి ఉండదు. ఇంట్లోకి నీళ్లు వచ్చేస్తాయి ఆ రోజున వచ్చినట్లు—" అన్నది దుర్గ.

చూస్తూ చూస్తూఉండగానే చుట్టూ దట్టంగా మబ్బు వేసుకురావటంతో ఆ వెదురుతోపు అంతా చీకటి కోణం అయిపోయింది. అయితే వానమాత్రం ఇంకా ప్రారంభం కాలేదు. ఇలాంటప్పుడు మనస్సులో ఒక రకమైన ఆనందమూ, కుతూహలమూ కలుగుతాయి-ఎంత పెద్ద వాన వస్తుందో! ఈ భూమినంతనీ ఎక్కడికి తేల్చుకుపోతుందో!-కాని వానలు ఎప్పుడూ కురుస్తూనే ఉంటాయి. భూమి ఎక్కడికీ తేలిపోనూ పోదు. అయినా ఆ భావన మాత్రం కలగ మానదు. దుర్గ మనస్సు ఆ తెలియని ఆనందంతో నిండిపోయింది. ఆ పిల్ల మధ్య మధ్య వసారాలోకి వచ్చి చూరుకిందనుంచి తలవంచి యెత్తి, పైన క్రమ్ముకున్న మబ్బులకేసి చూడసాగింది.

సర్వజయ కొసిని రొట్టెలు కాల్చాక, "ఇది పళ్లెంలో పెట్టు, వాడికి ఆకలేస్తోంది. పొయ్యం త్రం నుంచి ఏమీ తిన లేదు పాపం" అన్నది దుర్గతో. అపూ ఇంత సేపూ ఎలాగో ఊరుకున్నాడు. కాని తల్లి ఆపేక్ష కనపరుస్తూ ఆఖరికి అన్నమాటతో వాడి కెక్కడలేని అభిమానం పొర్లుకు వచ్చింది. వాడా రొట్టెలతో సహా పళ్లాన్ని త్రోసిపారేస్తూ "నేను తినను రొట్టెలు ఏమైనా సరే తినను, పో" అన్నాడు.

సర్వజయ కుర్రవాడి ధోరణి చూసి తెల్లబోయింది. పేదసంసారంలో ఎంతకష్టపడితే తినుబండారాలు అమరుతాయో ఆమెకి తెలుసు. కాని ఈ దౌర్భాగ్యుడు ఎంతో కష్టంమీద సమకూర్చిన తినుబండారాలు నోటి దగ్గరివి — రెండుసార్లకు రెండుసార్లూ ఇలా పాడుచేశాడు! కోపంతోనూ, లోపలి మంటతోనూ వాడికేసి చూసి, "ఏమిట్రా? నీకేమైనా పట్టిందా యేం ఇవాళ? నీ కివాళ బూడిదే రాసిపెట్టి ఉన్నట్టుంది. పో, పోయి పొయ్యిదగ్గర ఆ వేడి వేడి బూడిదే ఇంత బొక్కు" అన్నది.

ఇహ ఇప్పుడు అపూవంతు. తల్లినోటి మీదుగా ఇలాంటి మాటలు వా డెన్నడూ వినలేదు. అమ్మ కొస్త ఆపేక్షగా మాట్లాడి ఓదారుస్తుం దనుకుంటాడా, సందెవేళ ఇంత కటువుగా మాట్లాడుతుం దనుకుంటాడా వాడు! అపూ లేచి నుంచుని, "సరేలేఅమ్మా! నేను పేలాలవీ ఏమీ తిన లేదుకదా, అందుకు వాళం కోపంగా ఉండదా? నేను సాయంత్రంనించి దిగులుపడటం లేదూ? నేనింక ఎప్పటికీ ఈ గుమ్మం తొక్కను. నేను బూడిద బొక్కనా? ఏం, ఎందుకు బొక్కాలి? అక్క మాత్రం కమ్మ కమ్మని వన్నీ తింటుం దేం! నేనింక నీయింటికి రానే రాను, ఎప్పటికీ రాను" అన్నాడు.

ముసలిపిశాచి గుడిసెదగ్గర్నుంచి చీకటి, ముళ్లు, తుప్పలు - డప్పలూ లెఖ్ఖ చెయ్యకుండా పరుగెత్తుకువచ్చివల్లె - ఇప్పుడు కోపంతో ఒళ్లు మరిచిపోయి, వసారా దిగి, మెల్లాలోంచి అన్నిటికీ తెగించిన వాడిలా పరుగుతీశాడు. అభిమానంతో నిండిన తమ్ముడి ఆ చూపు, వాడు పెదిమలు విప్పి ఆ మాట్లాడినధోరణి చూసేసరికి దుర్గకి పొట్ట చెక్కలయ్యే నవ్వొచ్చింది. "హిహీ, అపూ ఒట్టి పిచ్చివాడమ్మా!" అంటూ తమ్ముడు సరిగ్గా ఏలా అన్నాడో అలా అనుకరిస్తూ 'నేను పేలాలవీ తినలేదుకదా, హిహీ!— నాకందుకు కోపంగా ఉండదా యేం?' అన్నది. ఒట్టి అమాయకుడే ఎక్కడో, ఒరే, అపూ! ఒక్కమాట, అపూ, అపూ!" అని కేకేసింది.

అపూ గోడప్రక్కదారినే వెనుక వెదురు తోపుకేసి పరుగుతీశాడు. పైన మబ్బులింకా అలాగే ఉన్నాయి. వెదురుతోపు అంతా చెట్లూ - పొగలూ. సాయంత్రం అవటం, మబ్బువెయ్యటంతో చీకటికోణంలా ఉంది. మామూలుగా అయితే ఇటువంటి సమయంలో ఇలాంటి చోటుకి ఒంటరిగా రావటం ఆలోచనలోనైనా రాదు. చుట్టూ నిర్మానుష్యం, చీకటి, వెదురుగుమ్మల్లో ఏదో జలజల చప్పుడు - దగ్గరలో ఉన్న మామిడిచెట్టుమీద దెయ్యం ఉంటుందనే ప్రవాద,-అన్నిటినీ మరిచిపోయి, "నేనింక యెప్పటికీ ఇంటికి వెళ్ళనే వెళ్ళను-జన్మలో వెళ్ళను" అనుకుంటూ అదే ఆలోచించసాగాడు అక్కడే అలాగే నుంచుని.

ఆ అభిమానపు వేడి కొస్త తగ్గగానే వాడికి భయంతో కొంచెం వణుకు పుట్టింది. దగ్గరలో ఆ దయ్యాలమర్రికేసి భయభయంగా చూశాడు. 'ఇప్ప డేదైనా భూతం వచ్చి, తనని నెత్తినెట్టుకుని ఎత్తుకుపోతే ఎంత బావుండును! అమ్మ వెతికి వెతికి ఏడుపుతో చస్తుంది. సందెవేళా పిల్లవాణ్ణి పట్టుకుని ఎందుకు బూడిద బొక్కమన్నాను! అందుకే నామీద కోపంకొద్దీ, ఎక్కడికో మబ్బుల్లోకి వెళ్ళిపోయాడు. ఇంక రాడు' అని అనుకుంటుం దనుకున్నాడు. భూతం చేతిలో తాను చచ్చిపోతే అమ్మ మనస్సు కెంత దుఃఖంగా ఉంటుందో ఊహించుకుని, ఆమెమీద పగ సాధిస్తున్నా ననుకుని ఆనందించాడు. మళ్ళీ అక్కడినుంచి గోడప్రక్క దారిలోకి వచ్చి నించున్నాడు. వాడికి భయమేస్తోంది. ప్రక్క వెదురు గుమ్మలో ఏదో చప్పుడయింది. అపూ భయమేసి, ఓసారి కళ్లెత్తి మాత్రం చూశాడు. వాళ్ల అమ్మ, అక్క రాణూవాళ్ళ ఇళ్ళకేసి వెళ్లి 'అపూ!' అని అరుస్తున్నారు. వెదురు పొదలో మళ్లీ ఏదో చప్పుడైంది! వాడి మనస్సుకు కంగారుగా ఉంది. కాని, వచ్చిన చిక్కేమిటంటే— వాళ్లు తనను వచ్చి బతిమాలండే, తా నంత కోపంలో ఉండి మళ్ళీ ఆ యింట్లో అడుగుపెట్టటం నిజంగా ఆత్మగౌరవానికి దెబ్బే! ఈసారి దుర్గ రాణూవాళ్ళ దొడ్డిగుమ్మాన వస్తున్నట్టుంది. వాడూ పరుగెత్తుకుంటూ వచ్చి, గోడప్రక్కన నక్కాడు. దుర్గ వస్తూవస్తూ ఉండగా హఠాత్తుగా గోడవైపుకి దృష్టి పడగానే "అదుగో అక్కడ నుంచున్నాడమ్మా! ఆ గోడ ప్రక్కన నుంచున్నా"డని అరిచింది. తర్వాత పరుగెత్తుకునివచ్చి తమ్ముని చెయ్యి పట్టుకుంది. "ఒరే, అల్లరిమొద్దూ! ఇక్కడ ఒక్కడవీ ఊరికే నుంచున్నావా? అమ్మ నేనూ నీకోసం ఎంత వెతుకుతున్నామో చూశావా?" అన్నది.

ఇద్దరూ కలిసి మళ్ళీ వాణ్ణి లోపలికి తీసుకెళ్ళారు.

[ఇంకా ఉంది] ★

చీకట్లో వెలుగు

స్థూలకాయుల్ని చూచి కొందరు నవ్వుతారు, గేలిచేస్తారు, అవమానపరుస్తారు, అసూయపడతారు, అపహాస్యం చేస్తారు. కాని స్థూలకాయులు సాధారణంగా తాము నవ్వుతూ అందరినీ నవ్విస్తూ ఉంటారు. తమల్ని ఇతరులు అవమానపరచినప్పటికీ అది ఆనందకారణంగానే భావించుకొంటారు. అపకారం చేసిన వాళ్ళకి ఉపకారం చేస్తూ ఉంటారు. చూడడానికి నిండుగా ఉన్నట్టే, వాళ్ళ మనస్సు కూడా నిండుగా ఉంటుంది. అయితే అందరు స్థూలకాయులూ ఆకారంలో ఆకర్షించలేనట్టే, మనస్సులో మంచివాళ్ళు కాకపోవచ్చు. కప్పళ్ళబస్తాలూ, పీపాలూ, తవాబీలు ఉన్నట్టే, మహా వృషభేంద్రులు, మహా గజాసురులూ ఉన్నారు. ముఖ్యంగా స్త్రీలలో స్థూలకాయం కొంత హాస్యహేతువైనా అందానికి అర్హతగానే కనిపిస్తుంది. వీరివల్ల వ్యయప్రయాసలు రెట్టింపు అవడం తప్ప ఏదైనా ఉపకారం ఉంటుందా యని చాలమందికి తోచవచ్చు. ముఖ్యంగా ఏ బస్సులోనో, ప్రయాణం చేసేటప్పుడు వాళ్ళు ఆక్రమించే స్థలాన్ని బట్టీ, వాళ్ళెక్కిన వాహనంలో తూగే తూనికనుబట్టీ ఒక్కొక్కసారి ఎదుటివారి విమర్శలకు గురి అవుతూ ఉంటారు. అయితేనేం, వారు ప్రత్యక్షంగానో, పరోక్షంగానో కొన్ని ఉపకారాలకి కారణభూతులవుతూ వుంటారు.

అలాంటి అవకాశం కావమ్మగారికి కలిగింది. ఆమె నిండయిన మనిషే. గంగాభాగీరథీ సమానురాలయిన ఆ కావమ్మగారు తమ్ముడింట్లోనే ఉంటూ వాడి మంచిచెడ్డలు ఒకకంట కనిపెట్టి చూచిపెడుతున్నారు. అనగా అత్తరాలా ఇల్లు పట్టిన వెధవాడపడుచు.

ఆమెకు కొంత ఆస్తి పాస్తులున్నాయి— దానికి తోడు మంచి నిండైన ఆకారం!— తమ్ముడు కామేశ్వరరావు గ్రామకరణం పని చేస్తున్నప్పటికీ ఆమె అంటే హడలే. ఆమాటకొస్తే — ఆ పల్లెటూర్లో అతనన్నమాటేమిటి, ఆమెను చూస్తే అందరికీ హడలే. ఆమె నడిస్తే ఒక చిన్న హిమాలయ పర్వతం కాళ్ళు మొలిచి నడిచివస్తున్నట్టు ఉండేది. బ్రాహ్మణవీధినుండి అడ్డత్రోవను నడిచి వచ్చి, ఆమె ఆగట్లమీదనుంచి కాలువకి వెళ్ళి తడిబట్టలతో బుజాన్ని బిందె యెత్తుకొనివస్తూఉంటే నేలంతా అదరిపోతూ ఉన్నట్టు ఉండేది. ఆమె వీధులోంచి అలాగ వెళ్ళిందంటే, పలుకరించడానికి కూడా ఆడా, మొగా అందరూ భయపడేవారు. అటువంటి కావమ్మగారు ఇలాంటి కష్టంలో చిక్కుకొంటుందని ఎవరు తలుస్తారు? ఇంతకీ ఆనాటి వేళావిశేషం అటువంటిది. ఎన్నడూ ఊరుకదలి వెళ్ళంది తాను 'గూడెం' వెళ్ళింది. అక్కడ మేనల్లుడి కూతురు బారసాల. వాళ్లు ఎంతో బ్రతిమలాడారు, ఆ రాత్రికి ఉండి ఉదయం బయలుదేరి వెళ్లమని. ఇంటిదగ్గర పాడిగేదె. తనకి తప్ప ఎవ్వరికీ పాలివ్వదు. తమ్ముడు దగ్గరికి వెళ్తేనే తన్నుతుంది. ఏమైనాసరే సాయంకాలానికి వెళ్లవలసిందే. ఇంకా గంట ప్రొద్దుఉండగానే బయలుదేరింది బస్సు. కాని త్రోవలో పెంటపాడు సంతవద్ద ఆలస్యం అయింది. మధ్య ఎన్నిచోట్లనో వాళ్లాపుచేశారు. అత్తిలిదగ్గరేమో—ఆ కారు చెడిపోయిందని గంటపైగా పట్టింది దానిని త్రోసి త్రోసి రథం కదిలించడానికి. ఈలోపున చీకటిపడిపోయింది. చివరికి, ఆ బస్సు పిల్లకాలవవంతెన చేరుకొనేటప్పటికి రాత్రి ఎనిమిది గంటలయింది. ఊరిలో రామకోవెలదగ్గర దిగి తమలోగిలికి నడిచి వెళ్లవచ్చు. కాని అడ్డత్రోవనైతే అందిపుచ్చుకొంటున్నట్టు ఉంటుందని ఆ వంతెన క్రింద కావమ్మగారు దిగిపోయారు..

వై. రామచంద్రరావు

చీకటి. కన్నూ మిన్నూ ఏకమైపోయింది. అప్పటికప్పుడే ఊరు మాటుమణిగిపోయింది. ఎక్కడా ఏ దీపములేదు. దూరదూరంగా గుడ్డిదీపాలు కునుకుపాట్లు పడుతున్నాయి. అంతా నిశ్శబ్దం. కావమ్మగారు చేలగట్లమీదనించి నడచివెళ్తూ వుంది. కొంతదూరం వెళ్ళేటప్పటికి ఆ గట్టుమీద దట్టంగా, గడ్డి పరచివుంది. అది శుభ్రంగానే ఉందని ఆమె కాలు వేసింది. ఇంకేముంది? కాస్తా కూస్తా మనిషిగనకనా, ఆ బెందడిలో కాలు కూరికొనిపోయింది. కాలు తీయబోతే రాదు. అడుసు, మట్టి. గండికొట్టి ఎందుచేతనో పూడ్చివేశారేమో, చీకటిలో కనబడలేదు. నక్షత్రాల వెలుతురు, అక్కడక్కడ మెరుస్తూ ఉన్న మిణుగురు పురుగుల కాంతీ తప్ప ఆకారు చీకటిలో ఏమీ కనిపించడంలేదు. ఆమె ఒక్క క్షణం నిశ్శబ్దంగా ఉండి అరవడం మొదలుపెట్టింది. కుయ్యో మొర్రో అని కేకలు వేస్తోంది. "ఏమర్రోయ్! ఏమర్రోయ్!" అని గొంతుకచించుకొంటోంది. ఎవరూ వినిపించుకోవడంలేదు. పైగా ఆ చుట్టుప్రక్కల ఇళ్లు అంతగాలేవు. దూరంగా రాజుగారి హవేలీ. వారెక్కడో లోపల ఉన్నారు. ఎన్ని కేకలు వేసినా వినిపించవు. చుట్టూ గుడిసెలలో ఉన్న వాళ్ళకి వినిపించవలసింది మరి. వాళ్లు నిద్రలో ఉన్నారో ఏమిటో! కావమ్మగారు అలాగ కంఠం చించుకుంటూ కేకలు వేస్తూనే ఉంది. ఒక్క మనిషీ పైకి రాలేదు. కొంతసేపటికే ఆ త్రోవను మనిషి అలికిడి వినిపించింది. గొల్ల వీరన్న ఊరులో బుఱ్ఱకథ విని వస్తున్నాడు. ఆ మనిషిని చూచి కావమ్మగారు కేక వేసింది. గొల్ల వీరన్న హడిలి గెంతువేశాడు. ఈ చీకటిలో తెల్ల చీరకట్టుకుని నిలబడిన మనిషి 'గంగానమ్మ' అనుకున్నాడు. చటుక్కున పరుగెత్తి వెళ్ళి ప్రక్కనున్న గుడిసెలో దూరాడు. అక్కడ కమ్మరి బ్రహ్మలింగం కొడవలికి కక్కులు కోస్తున్నాడు. ఒక చిన్న కుఱ్ఱవాడు కునుకుపాట్లు పడుతూ కొలిమిచక్రం తిప్పుతున్నాడు. అప్పుడే గొల్ల వీరన్న పరుగెత్తుకొనివచ్చి తను చూచిన వింత చెప్పాడు. బ్రహ్మలింగం - పదచూద్దాం అని బయలుదేరి వచ్చాడు.

"నేను దయ్యాన్నీగాను భూతాన్నీగాను కరణంగారి అక్కనిరా! నాయనా! ఈ బందలో కూరుకొని పోయాను. కొంచెం చేయి ఆసరాయిస్తే బయటపడతాను" అని కావమ్మగారు జాలిగా కోరింది. బ్రహ్మలింగం వచ్చాడు. ఏదో ఉపాయం ఆలోచించాలి. కారు కూరుకుపోతే ఇంకో కారతో లాగిస్తారు. రథం కూరుకుపోతే జనం లాగుతారు. మనిషి కూరుకుపోతే! మనుషులు లాగగలరా? బ్రహ్మలింగం చెయ్యి ఆసరాయిచ్చాడు. లాభం లేకపోయింది. కావమ్మగారు అలాగే నిలుచుండి పోయారు. కమ్మరిబ్రహ్మలింగం

ఉపాయశాలి. ఒక గడ్డపార తెచ్చాడు. అది గట్టుమీద పాతేశాడు. ఇదంతా చేస్తూ ఉంటే ఆ కొలిమి చక్రం పిల్లవాడు చిన్న దీపం పట్టుకొని వెలుతురు చూపిస్తున్నాడు. ఆ గడ్డపారకు ఒక తాడు వేసి అది కావమ్మకి పట్టుకోమనిచ్చి మరో త్రాడు వేసి, బ్రహ్మలింగమూ, గొల్లవీరన్నా లాగారు. అమ్మయ్య, కావమ్మగారు చివరికి బ్రహ్మప్రళయంమీద బయటపడ్డారు.

ఇదంతా దీపం లేని కారణం చేత వచ్చిన కష్టం. "ఈ చీకటి కోణంలో ఏ పుణ్యాత్ములయినా దీపం పెట్టిస్తే బాగుండిపోను" అని బ్రహ్మలింగం ఒక సూచన చేశాడు. అవును, యిలాంటి చోట ఒక దీపం వుండవలసిందే! ముందు ఈ చీకటిలోంచి తాను యింటికి చేరుకోవాలి. తరవాత ఆలోచించవచ్చును. బ్రహ్మలింగం తన కుఱ్ఱవాడిచేత హరికేన్ దీపం యిచ్చి తోడు పంపించాడు.

కావమ్మ తాను పడిన పరాభవానికి సిగ్గుపడి పోయింది. అతనికి ఏమనాలో తెలియలేదు. మాటాడకుండా యింటికి వెళ్లిపోయింది. ఇల్లు చేరుకొని ఆ పిల్లవాడి చేతులో అణా పెట్టింది. ఆ పిల్లవాడు వద్దు అన్నాడు. అలాగే తిరిగి వెళ్ళిపోయాడు. కరణంగారు అక్కయ్య వస్తుందని అనుకోలేదు: తొమ్మిది గంటల రాత్రికి వచ్చేటప్పటికి తలవని తలంపుగా అయిన ఆలస్యానికి ఏం అనాలో తెలియలేదు. కావమ్మగారు జరిగిన సంగతంతా చెప్పి—"ఇంత మంది పెద్దలుండి, అలాంటిచోట, నలుగురూ మసిలేచోట దీపం లేకుండా చేశారేమిట్రా? తమ్ముడూ" అని అడిగింది. నిద్రకళ్ళతో ఆ కరణం "రాత్రివేళ ఆ దీపం గొడవ యెందుకు? తెల్లవారాక చూసుకొందాంలే" అని అన్నాడు. తాను పొందిన పరాభవం తన చేత చీకట్లో దీపం పెట్టిస్తుందని ఆమె కలలో కూడా అనుకోలేదు. స్థూలకాయంవల్ల పరోక్షమయిన ఉపకారం!

అలాగ ప్రారంభమయింది ఈ దీపం సంగతి. వంతెనదగ్గర పిల్లకాలవగట్టువుంతలో దీపం వెయ్యాలనా? మానడమా? వేస్తే ఎవరు వెయ్యాలి? ఎలాంటి దీపం పెట్టాలి? ఇలాంటి అనంతకోటి ప్రశ్నల మధ్య వుంతలో దీపం వస్తుందా, రాదా అనే సమస్య అయింది. అక్కగారు బొత్తిగా పోరు పెట్టగా కరణం కామేశ్వరరావు దీపం సంగతి దర్యాప్తు చేశాడు. కరణీకం లెక్కలకే, కొలతలకే, పన్నులు వేయించడానికే, రివెన్యూ తగాదాలకే, పొలాల పొలిమేరల గొడవలకే తనకి అధికారం ఉందిగాని వీధిలో దీపం పెట్టే అధికారం కాని, తీయించివేసే అధికారం కాని తనకి లేదు. అది పంచాయితీ బోర్డుది.



"ఇంకొక్కక్షణం ఉంటే బడ్డీ ఎగిరిపోతుంది!"

ఆ గ్రామంలో వీధుల్లో దీపాలు వెలుగుతూనే ఉంటాయి. పెద్దవీధిలోను, సంతపేటలోను, రామాలయందగ్గర మూడు పెట్రోమాక్సు దీపాలుకూడా పంచాయితీ బోర్డువారు పెట్టించారు. పంచాయితీ ఆఫీసులో ఒక పెద్ద లైటు ఉండనేవుంది. వీధుల్లో కిరసనాయిలు దీపాలు వెలిగిస్తూ ఉంటారు. "అవి కిరసనాయిలు తాగినంత త్వరగా వెలుతురునిచ్చిన పాపాన పోవు," అని మెయిలరు పాపారావు అంటూ వుంటాడు. ఇవిగాక, బట్టలకొట్టులో ఒకటీ, కమిషన్ కొట్టులో ఒకటి పెట్రోమాక్సు దీపాలున్నవి. కాని అవి అన్నిరోజులూ వెలగవు. పంచాయితీ బోర్డువారు పెట్టినవి కూడా కిరసనాయిలు కరువువల్ల వెలిగించడం మానివేసి దరిమిలా మూలబడ్డాయి. అవి మీరు వెలిగించకపోతే మేమైనా వెలిగిస్తామని, ప్రెసిడెంటుగారొకటి, గ్రామమునసబుగారొకటి తీసుకొన్నారు. కాంగ్రెసు నాయకులు వచ్చినప్పుడూ, కలెక్టరుగారు వచ్చినప్పుడూ యీ దీపాలు వెలుగుతూ ఉంటాయి. ఒకొక్కప్పుడు ఎవళ్లింట్లో అయినా కథలకీ కార్యాలకీకూడా ఈ దీపారాధన జరుగుతూ ఉంటుంది. ఏదియేమైనా పంచాయితీ బోర్డు దీపాలలోంచి

★ చీకట్లో వెలుగు ★

వెలుతురు తీయగల్గడం అనేది గొప్ప సమస్యే.

పుంతలో దీపం — పంచాయితీబోర్డు ద్వారా వెలిగించడంఅనేది మరితీవ్ర సమస్య. ఆ దీపాలు అసలు వెలిగించే ప్రయత్నమే జరగదు. ఒకవేళ వెలిగించే ప్రయత్నంచేసినా ఆ దీపాలు పంచాయితీ బోర్డు సంప్రదాయాలను అనుసరించి తఱచు సహాయనిరాకరణం చేస్తూ ఉంటాయి.

సాధారణంగా స్పిరిటు లేదనీ, వత్తిలేదనీ ఆ దీపాలు వెలిగించడం మానివేస్తారు. కాని ఎలాగోలాగ కృషిచేసి వెలిగిస్తే గప్పుమని మంటలువచ్చి కాంతికిబదులు జ్వాల బయలుదేరుతుంది. ఈ బాధంతా యెందుకూ అని అది ఆర్పివేసేఉంచుతారు. ఇంక మామూలు కిరసనాయిలు దీపాలలో పురుగులూ అవీపడి మంటని మ్రింగివేయడమో వత్తి దిగజార్చడమో, లేక చమురులేకపోవడమో జరుగుతుంది. అందుచేత అవికూడా వెలుగు ప్రసారంచేయడంలో యథాశక్తి సహాయనిరాకరణం చేసి నిరంతరాంధకారంలో ఉండాలనే పంచాయతీ ధర్మసూత్రాన్ని పరిపాలిస్తూనే ఉంటాయి. పంచాయతీ ఆఫీసర్లు, ఇనస్పెక్టర్లు వచ్చినప్పుడు మాత్రం అవి వినయవిధేయతలతో చక్కగా వెలుగుతూ ప్రతినిత్యమూ అంతశ్శుభ్రంగా ఉన్నట్టు అభినయించి శుభాభివందనాలు అందుకొంటూఉంటాయి. పుంతలో పోనీ హాగ చూరిన దీపమైనా లేదు. పంచాయతీబోర్డు ఒక దీపాన్ని పెట్టాలంటే తీర్మానంచేయించాలి. శాంక్షన్‌కావాలి. టెండర్లు తెప్పించాలి. అది ప్యాస్ చేయించాలి. ఇవన్నీ జరిగేసరికి దీపం రావడానికి కనీసం ఒక సంవత్సరమైనా కాకతప్పదు. ఈ చిక్కులన్నీ కావమ్మగారి కేం తెలుసు? శే పుపండుగలో పున దీపం పెట్టించితీరాలని పట్టుపట్టి కూచుంది మరి!

కరణంగారు తమ శక్తివంచనలేకుండా ప్రయత్నంచేస్తున్నారు. ముందు పంచాయతీ బోర్డు ఆఫీసరుగారిని చూచారు. ఆయన ప్రస్తుతం సొమ్ములేదు, అందుచేత సాధ్యం కాదని తేల్చివేశారు. లోపాయికారీగా గుమాస్తాతో సంప్రదిస్తే బోర్డులో తీర్మానం చేయిస్తే నిమిషాలమీద అవుతుంది అన్నారు. అది అంత సులభమైన కార్యమామరి? నలుగురైదుగురు సభ్యుల్ని కూడగట్టుకోవాలి. ప్రెసిడెంటుగారిని ఆకట్టుకోవాలి. చాల పెద్ద ప్రయత్నం చెయ్యాలి. ఈ బాధలన్నీ పడలేక కరణంగారు విశ్రమించుకోవాలని తలపెట్టారు. కాని కావమ్మగారు ఏ ముహూర్తాన ఆ బందలో పడిపోయిందో కాని అప్పటినించీ దీపం వేయించి తీరాలి అనే పట్టుబట్టే కూర్చుంది. "ఇదేమంతి బ్రహ్మప్రళయం? కొండని త్రవ్వి యెలుకను బట్టినట్టు? నలభై యాభై రూపాయలు పెడ్తే దీపం? రెండు బస్తాల ధాన్యం అమ్మితే వస్తుంది" అని ఆమె చెప్పింది. చెప్పడం సులువుగానే ఉంది. చేయడమో? కరణంగారు మళ్లా సంప్రతించారు. ఖర్చు తాము పెట్టినా గాని దీనికికూడా తీర్మానం అవసరం అని గుమాస్తాగారు చెప్పారు. కరణంగారు దాని పైయెత్తు వెయ్యాలి.

ప్రెసిడెంటుగారిని కలుసుకొన్నారు. అలాగే-అదేమంత ఘనకార్యం అని చెప్పి తీర్మానం అజెండాలో వేయించమని సెలవిచ్చి, మరి నలుగురు సభ్యుల్ని మద్దతుచేయమన్నారు శ్రీవారు. నలుగురూ ఎవరున్నారు; షావుకారు వెంకటరంగంతో కరణంగారు చెప్పారు. ఆయన కర్ర విరగకుండా, పాము చావకుండా ఇందులో మన యెవారమేముంది అంతా అవునంటే నేనూ 'శంకర'వుతాను అన్నాడు.

సావరం గాంధీ అంటారే ఆగావంచా శర్మగారున్నారు. ఆయన గాంధీగారిలాగమూడు మూళ్ల పంచె, అంగవస్త్రం ధరిస్తారు. ఆశ్రమం, ఖద్దరూ ఇవన్నీ ఉన్నాయి. రెండుసార్లు కాంగ్రెసు ఉద్యమంలో జెయిలుకి వెళ్ళాడు. కొడుకులు అందరూ ఉద్యోగాలలో ఉన్నారు; కూతుళ్ళందరికీ వివాహాలు చేసివేశాడు; అల్లుళ్లు కూడా మంచి అధికారాలలో ఉన్నారు. ఆయన స్వగ్రామంలో ఆశ్రమం పెట్టుకొని హరిజన సేవ చేస్తూ గవర్నమెంటువారు హరిజనహాస్టలు, ఖాదీ పరిశ్రమలకిస్తూ ఉన్న గ్రాంటులనుభవిస్తూ జీవిస్తున్నారు. ఆయన అభిప్రాయాలు ఎవరికీ నచ్చవు. అందుచేత కాంగ్రెసు కమిటీలలోకీ, వాటిలోకీ ఆయన్ని ఎవరూ చేరనివ్వరు. పంచాయతీ బోర్డు మెంబరు అయ్యాడు. వింతవాదాలు చేస్తూ ఉంటాడాయన. కరణంగారాయన్ని కలుసుకొని పుంతలో దీపంమాట చెప్పగానే ఆయన సరేనన్నాడు. కాలవ చివర కిరస్తానీ పంతులు యేసుదాసునీ, కార్మిక నాయకుడు గురవయ్యనీ కరణంగారు కలుసుకున్నారు. వాళ్ళూ అలాగే అన్నారు.

తీర్మానం, ఎలాగైతేనేంబోర్డు మీటింగులో చర్చకు వచ్చింది. ఆ చర్చలో సావరం గాంధీగావంచా శర్మగారు తీర్మానానికి వ్యతిరేకంగా మాట్లాడారు. "అంధకారం గ్రామజన్మహక్కు. అది పోగొట్టి ఈ కాలపు పెట్రోలుదీపాలు పెట్టడం పొరపాటు. విదేశీ ప్రభుత్వం, బ్రిటిష్ ప్రభుత్వం నేర్పిపెట్టిన వెఱ్ఱివేషాల్లో ఒకటి గాస్ లైటు వెలుతురు కోరడం. పరదాస్యం పోగొట్టుకొన్నా మనం పరాయిఆచారాలను, వ్యవహారాలను తలదాలుస్తున్నాం. మహాత్ముడు చెప్పిన అహింసా సిద్ధాంతానికి వ్యతిరేకంగా దీపం పెట్టడంవల్ల ఎన్ని పురుగులకు, ఎన్ని ప్రాణులకు ప్రాణనష్టం! పైగా ఆ చుట్టుప్రక్కల దీపం చూచేది ఎవరు? కుక్కలు పిల్లులూ తప్ప రాత్రివేళ జన సంచారం ఉండదు. ఇద వట్టి దండుగ. ఎవరో ఉచితంగా దానమిస్తున్నారు గదా అని యిలాంటి కొఱవినికొని తెచ్చిపెట్టుకో లేంగదా? సభ్యులారా! వినండి, ఆలోచించండి, ఈ దీపాన్ని, ఈ వెలుతుర్ని ధిక్కరించండి. తమసోమా జ్యోతిర్గమయ - అన్నారు ఉపనిషత్తులలో. మనజాతి సంస్కృతి, మన విజ్ఞానం అంధకారంలో ఉంది; తమస్సులో ఉంది. చీకటిని చుట్టూ ఆవరించనీయండి. అది యింకా దట్టం కానీయండి. మనకి కావలసిన వెలుగు భౌతికమైనది కాదు. అంతర్దృష్టి. చుట్టూ ఆవరించి ఉన్న చీకటిలోనే ఆ మానసిక తేజస్సు గోచరిస్తుంది. చీకటిలో ఉండే ఆ జ్ఞానజ్యోతిని కాంచండి" అన్నాడు. రెండుసారులు జెయిలుకివెళ్లిన గ్రామకాంగ్రెసు సింహం అలాగ మాట్లాడ్తూఉంటే బోర్డువారు కాదనలేకపోయారు. పుంతిలో దీపంసంగతి తాత్కాలికంగా వాయిదా వేశారు.

కావమ్మగారంతమాత్రం చేత నిరుత్సాహం పొందలేదు. తమ్ముడు కరణం అయివుండీ యింతపని చేయించలేకపోవడం ఎంత చిన్నతనం అని దెప్పిపొడిచింది. కరణంగారికి తలవంపులుగానే ఉంది. మళ్లీ ప్రయత్నం చెయ్యాలి అనుకొన్నారు.

పుంతలో దీపంసంగతి ఊరంతా ప్రాకిపోయింది. దీపంలేని కారణంచేత ఒకటి రెండు ప్రమాదాలు అవడంచేత దీపం పెట్టవలసిన అవసరం మరికొందరికి తేటతెల్లం అయింది. మొదటిప్రమాదం పంచాయతీ బోర్డు మెంబరు వెంకటరంగం భార్యారత్నమ్మ చీకటిలో చిన్న కాలువగట్టుకి వెళ్లి తిరిగివస్తూఉంటే ఒక గుట్టమీద కాలు వేసింది. చీకట్లో కనిపించక గుట్టకి కాలు తగిలి వేలిగోరు పెల్లగించుకొనిపోయింది. ఆ దెబ్బకు దబ్బ పడిహేనురోజులవరకు

గ్గలేదు. ఆమె కాదీపం ఉండాలనే ఆవశ్యకత ఎక్కువగా కనిపించి భర్తతో గట్టిగా చెప్పిందట! మరొకసారి ఒట్టెలకోట్లు తిమ్మయ్యగారు రాజుగారి హవేలీకి వెళ్లి తిరిగివస్తూ ఉంటే చీకట్లో చూచుకోక ఒక కుప్పమీద కాలు వేశాడు. అది పేడకుప్ప. కాలుజారి పడిపోతే మళ్లా వారంరోజులవరకు లేవలేకపోయాడు.

ఇంకొకసారి రాత్రివేళ బస్సుదిగి వస్తున్న రెడ్డికొడుకులు, మునసబుగారి అల్లుడు చీకట్లో చూచుకోక అక్కడ పడుకొనివున్న గేదెమీద పడ్డారు. ఆ గేదె కొమ్ము విసిరేటప్పటికి గుండెల్లో గుచ్చుకొనిపోయి నానా అవస్థ పడ్డారు. ఈలాంటి ప్రమాదాలు అప్పుడప్పుడందరికీ అనుభవం కావడంమీద, పెద్దలందరూ ఈ పుంతలో దీపం పెట్టడం మంచిదే అని నిశ్చయించారు. తిరిగి పంచాయతీబోర్డు సభావేశంలో తీర్మానం వచ్చేటప్పటికి—ఆ బోర్డు ఆఫీసునుండు ఒక ఇరవైమంది హరిజనులు మహజరు పెట్టారు. అందులో వాళ్ళే మన్నారంటే, 'దీపం లేనంతసేపు అక్కడ ఆడవాళ్ళకి మరుగుగా ఉంది. ఈ దీపం పెట్టడం అలాంటి మరుగు లేకుండా చేస్తుంది' అని వారి విన్నపం. పంచాయతీబోర్డువారు మళ్లీ ఈ తీర్మానం వాయిదా వేశారు.

కామమ్మగారికి ఇది పెద్ద పరాజయంలాగుంది. ఇంత పలుకుబడి ఉండి, ఇంత పరపతి ఉండి పాడుఊరులో ఒక దీపం పెట్టించలేకపోయానే అని ఆమెకు చింతగా ఉంది. ములుకర్రతో పొడిచినట్లు తమ్ముణ్ణి మళ్ళీ పొడిచింది.

హవేలీలోకి వెళ్ళి పెద్దరాజుగారితో మాటలాడితేగాని పని జరగదని కరణంగారక్కడకు వెళ్ళారు. రాజుగారు దర్శనం యివ్వడమే అపురూపం అయింది. దీపం సంగతి వచ్చేటప్పటికి సంగతి విని మరోసారి రమ్మని సెలవిచ్చారు. రెండు మూడు వాయిదాలు వేసిన తర్వాత దీపం వేయించడం మంచిదేకాని, దానివల్ల కొన్ని చిక్కులు లేకపోలేదని తేల్చారు. ఆ చిక్కులేమిటో కరణంగారికి అర్థంకాలేదు. నిజం నిలకడమీద తెలిసింది. రాజుగారి హవేలీలో ఉద్ధారకుడు గున్నయ్య అని ఉన్నాడు. అతనికన్ని పనులూ తెలుసు. ఆ ఊరికి రౌడీలలో మొనగాడు. ఇటీవల అతడొక కుటీర పరిశ్రమ పెట్టాడు. అది కాలువక్రింద రాజుగారి మాళ్ళపాకలో. ఈ కుటీర పరిశ్రమ లాభసాటిగా దినదిన ప్రవర్ధమానంగా సాగుతూ ఉంది. అక్కడే రాత్రివేళ ఉత్పత్తి అవుతోవున్న అమృతాన్ని చవిచూడడానికి పెద్దలు, చిన్నలూ అంతా చేరుతూ ఉన్నారు. పెద్దరాజుగారికి, ఈ సంగతి తెలిసినా తెలియనట్లు నటిస్తున్నారు. వ్యవహారం సాగిపోతూ ఉంది. కావలిస్తే హవేలీలోకి కూడా సదరు అమృతపానీయం అప్పుడప్పుడు 'సప్లై' అవుతూ ఉంది.

ఇప్పుడు పుంతలో దీపం పెట్టిస్తే, ఆ మాళ్ళ పాకమీద - కాదు పానశాలమీద - ప్రకాశవంతమైన కాంతులు పడతాయి. రహస్యమంతా బట్టబయలు అవుతుంది. అందుకోసం దీపం రావడం మంచిది కాదని తేల్చారు. కరణంగారు సంగతి గ్రహించి చిన్నరాజుగారిని ఆశ్రయించారు. పెద్దరాజుగారూ చిన్నరాజుగారూ అన్నదమ్ములు. ఏవో దాయాది కలహాలున్నవి. ఇక్కడ వాలినకాకి అక్కడ వాలడానికి వీలులేదు కావేషాలూ కార్పణ్యాలున్నూ! పుంతలో దీపం సంగతి చెప్పగానే చిన్నరాజుగారు తప్పక పెట్టించాలి అన్నారు. దీపం కరణంగారి అక్కగారు తెప్పించేటట్టూ, దానికి చమురు ఖర్చులు వగైరా చిన్నరాజుగారు పెట్టేటట్టూ నిశ్చయించారు. ఎలాగైతేం కామమ్మగారి సంకల్పం నెరవేరింది. ఖర్చు వారిదే! ఒక కార్తీకదీపం సమయంలో ఈ దీపం వేయించి ఒక ఉత్సవం చేయించారు. దీపం వెలుతురు చూచి - ఆ చుట్టుప్రక్కల వచ్చేవాళ్ళూ, పోయే వాళ్ళూ ఎంతో ఆనందంగా భావించి, దీనివల్ల ఎంత ఉపకారం జరిగింది అని కామమ్మ గారిని అభినందించారు. ఎంత కాంతివంతమైన దీపానికైనా క్రీనీడ లేకుండా ఉంటుందా? అంతటితో దీపం సమస్య తేలిపోలేదు.

ముందు పంచాయతీబోర్డువారిచేత సాకరం గాంధీగారు, పెద్దరాజుగారి ప్రోద్బలం వల్ల అసమ్మతి తెలిపించారు. ఇది జరగడానికి వీలులేదన్నారు. మునసబు కరణాలకి ఇష్టంగానే ఉంది. అందుచేత పోలీసువారిదాకా పోనీయలేదు. పంచాయతీవారి వ్యతిరేకత తప్పలేదు. దీపం వెలుగుతూనే ఉంది. తర్కవితర్కాలూ, సిద్ధాంత రాద్ధాంతాలూ సాగుతున్నాయి.

చీకటివేళ తమపనులు జరుపుకునేవాళ్ళకి కంటకంగా ఉంది. నిశాచరులయిన జారచోరులకి మరిన్నీ. దీపానికి ఎదురుగా పాడైపోయిన బైరాగిమఠం ఉంది. అక్కడ ఎప్పుడూ బికారులూ, బిచ్చగాళ్లు అరుగులమీద మూడంకె వేసుకొని అర్ధాకలికడుపులతో పండుకొని ఉండేవారు. లోపలమాత్రం కాశీ అన్నపూర్ణ కావిడితో అన్నం తెచ్చి అది సేవించి చిలుము గొట్టంతో కాలక్షేపం చేసే పాపాలయోగిగారుండేవారు. ఆ ప్రక్కగదిలో ఒక పాడుపడిన లింగాకారం పానవట్టం ఉండేవి. ఇప్పుడు వాళ్ళకి బదులు జూదగాళ్లు చేరారు. పేకాట రాత్రి తెల్లవారులు ఆడేవారు. వాళ్ళకి ఈ దీపంవల్ల యిబ్బంది! ఎదురుగా కాలువగట్టును మరుభూమిగా ఉపయోగించే గ్రామస్థులయిన ఆడవాళ్లకీ, మగవాళ్ళకీ దీపం

చీకట్లో వెలుగు

వెలుతురు ఆటంకంగా ఉంది. కాపుసారా కాస్తూ పానశాల నడిపిస్తూ ఉన్న గున్నయ్య బృందంమాట చెప్పనక్కరలేదు. వీళ్లందరూ కలిసి యేం చేశారోకాని ఆ దీపాన్ని రాళ్లతో పగలకొట్టి ఆ కాపలా ఉన్న అసిరిగాణ్ణి రెక్కలు విరగకట్టి స్తంభానికి కట్టిపోయారు.

ఇదిజరగటం కరణంగారికి శిరశ్ఛేదం చేసినట్టయింది. బకిరీ యిచ్చి పోలీసు వారినీ, ప్రొహిబిషన్ పోలీసువారినీ కూడా రప్పించారు. కాని ఏంలాభం? ఏమీ దొరక లేదు. ఎత్తుమీద పైయెత్తు వేసి, ఎవరిష్టం వచ్చినట్లు వాళ్లు చేస్తూ ఉన్నారు. మునసబు కరణాల పార్టీ ఒకటి. పంచాయితీ బోర్డువారి పార్టీఒకటి. వీళ్ళ కలహాలతో మళ్ళీ దీపం లేకుండా చేశారు. కామమ్మ గారికి ఇదేదో లోపంగానే ఉంది. తిరిగి ఎలాగైనా సరే దీపం తెచ్చి పెట్టాలి. ఆడది, తాను ఏంచెయ్యగలదు? గ్రామ కరణం తన తమ్ముడు చెట్టంతవాడుండి కూడా ఏమీ చెయ్యలేక పోతున్నాడు? ఈ ఊరి వాళ్లు ఎంతకుచ్ఛితులు! నలుగురికి ఉపకారం కలిగే కార్యానికి కూడా ఇంత ప్రతిఘటన కనపరుస్తున్నారు. చీకటిలోంచి వెలుగులోకి తీసుకెళ్తామంటే ఇంకా కారు చీకటిలోకి పోతామంటున్నారు. ఏమిటి వీళ్ళతో ఉపాయం?

ఇక్కడ అందరికీ వీలైనచోట దీపం పెట్టించాలి. ఆ దీపానికి కాపలా ఉండాలి. ఆ కాపలా కాస్తుండేవాడు ప్రతివాది భయం కరుడైన కాలకింకరుడుగా ఉండాలి. కామమ్మ గారు ఆలోచించారు. చివరికి కమ్మరి బ్రహ్మలింగం సరిఅయిన వాడని తోచి అతనికి కబురు చేసింది. బ్రహ్మలింగం కార్ఖానా కొంచెం దూరంగా జరిపించి అక్కడ ఒక బడ్డీ వేస్తే! బాగానే వుంటుంది. కాని అది బ్రహ్మ లింగం వల్ల అవుతుందా? ఊరిలో అందరికీ తలలో నాలుకలాగ మెసలుకోవాలి. ఏ యొక్క పార్టీవారికి గాని శత్రువు కావడానికి వీలులేదు. ఒక కొయ్యబడ్డీ వేసియిస్తాను అక్కడ దీపం పెట్టించే పూచీ మరెవ్వరి కయినా యిమ్మన్నాడు, బ్రహ్మలింగం.

పంచాయతీ సరిహద్దులో ఎలాగ బడ్డీ కట్టి స్తారో చూద్దాం అని బోర్డుపెద్దలు కనిపెట్టు కుని ఉన్నారు. రోడ్డుకి అవతలివైపు స్థలం పంచాయతీ వారిది కాదు; లోకల్ ఫండు లోకి వస్తుంది. కరణంగారేదో సర్వే రాయి జరిపి అది అసలు మినహాయింపు స్థలంలో చేరినట్టు, దానికి హైవేస్ వారికి అద్దెయిచ్చే టట్టు ఒక అద్దెచీటీ వ్రాయించారు నాలుగు రోజులయ్యేటప్పటికి ఒక బడ్డీ తయా రయింది. చుట్టలు, సిగరెట్లు, బీడీలు, సోడాలు, అందమైన సినిమా బొమ్మలు, అటూ ఇటూ కొత్త తెలుగు చిత్రాల తారల పోస్టరు దివ్యంగా ఉంది. దానికి కాగితపు పూలతో అలంకారాలుపెట్టి బ్రహ్మలింగం అదొక చిన్న స్వర్గలోకం లాగ తయారు చేశాడు. అంతా బాగానే ఉంది. ఈ కిళ్ళీ కొట్టు యజమాని యెవరు? టెయిలర్ పాపయ్య యాజమాన్యం క్రింద, తన శిష్యుణ్ణి సుభాన్ సాహెబుని పంపించాడు. సాహెబూ, అతని మామ, సిపాయి చినపీరూ కలిసి నడపాలనుకొన్నారు. ఒకరోజు మంచి ముహూర్తం చూచి ఆ కిళ్లీకొట్టుకి కరణంగారు పూనుకొని పంచాయతీ ఆఫీసరు గారిచేత ప్రారంభం చేయించారు.

ఇక ముందరి కాళ్లకు బందాలు వెయ్యడం. దానితో పంచాయతీ బోర్డు దగ్గర నుంచి ఆక్షేపణ లేకపోయింది.

కిళ్ళీకొట్టులో సాహెబులిద్దరిలో ఎవరో ఒకరు ఉంటున్నారు. బస్సులు వచ్చేవి పోయేవి అక్కడ ఆగి మరీ వెళ్తున్నాయి రాత్రివేళ పెట్రోమేక్సు దీపం అఖండంగా వెలుగుతూ ఉంది. దీపానికి తోడు యెప్పుడూ పదిమంది జనంతో సందడిగా ఉంటుంది. ఆ కాలువ గట్టుమీద న్యూసెన్సు చేయడానికి ఎవరయినా వస్తే, సుభాన్ సాహెబు వడిసెలతో రాళ్లు విసరికొట్టే టప్పటికి పరుగో పరుగు! అవంతా శుభ్రముగా తయారయింది. ఇంక పసువులశాలలో కుటీర పరిశ్రమకి అక్కడనుండి ఉద్వాసన చెప్పక తప్పనిసరి అయింది బైరాగుల మఠములో పేకాటలు నిలిచిపోయాయి. అంతా సవ్యంగా ఉంది.

ఒకరోజు అర్ధరాత్రి; వెన్నెలగా ఉన్న కారణంచేత సాయెబు కొట్టులో దీపం పెట్ట లేదు బడ్డీమీద సిపాయి చిన్నపీరు పడుకు న్నాడు. దూరంగా కమ్మర దుకాణం పని చేస్తూ ఉంది. ఉన్నట్టుండి కొట్టు వెనుక అలికిడి అయింది. చూసేటప్పటికి బడ్డీకింద మంట పెట్టడానికి దూరంగా జానకి తాడు అంటిస్తున్నాడు. ఇంకొకక్షణ ములో బడ్డీ ఎగిరి చక్కాపోతుంది. సాయెబు చేతిలో కత్తి తీసుకొని ఒక వేటు వేశాడు చటుక్కున జబ్బ తెగి అమ్మయ్యో అని పడ్డాడు.


నిజానికి తాడు అంటుకోలేదు. ఆ మందు పొట్లం తీసి దూరంగా పెట్టి తగలపెట్టాడు సాయెబు. ఆ పడిపోయినవాడు మాల రంగన్న. ఏమిరా, నీకీపోయేకాలం అంటే గున్నయ్య పెట్టమన్నాడని చెప్పాడు. ఈ సాక్ష్యం పుచ్చుకుని కరణంగారు పెద్ద కేసు పెట్టించారు. కక్షలమీద కక్షలు పెరిగిపోతు న్నాయి. ఎలాగయినా దీపం నిలబెట్టాలని కొందరు, ఆర్పివెయ్యాలని కొందరు!

చీకటిలో దీపం పెట్టడంచేత నలుగురికి ఉపకారం కావడానికి బదులు, కక్షలూ కావేషాలూ పెరిగిపోతున్నాయి. మునసబు గారికి ఒక ఉపాయం తోచింది. ఆయన కలెక్టరుగారిని రప్పించి ఊరి పరిస్థితులు విన్నవించి-పుంతలో ఎలెక్ట్రిక్ దీపస్తంభం వేయించవలసిందని కోరారు. ఆ ఊరిలో నూరుమందయినా దీపాలు కావాలీ అంటే తప్ప ఎలెక్ట్రిసిటీ యివ్వరు. ఊరులో రాజా గారి పార్టీవారు ఎలెక్ట్రిసిటీ అక్కర్లే దన్నారు. కాని మునసబుగారు కలెక్టరుగారి తోను, ఇంజనీరు గారితోనూ మాటలాడి, ఇక్కడ కనీసం దీపస్తంభమైనా వేయించ మన్నారు. మళ్ళీ అర్జీలు! వద్దని కొందరు, కావాలని కొందరు.

ఒక ప్రయాణంలో ఎలెక్ట్రిక్ ఇంజనీరు గారు ఆ దారిని వెళ్తూఉంటే వారి కారు ఒక పెద్ద చెట్టును గుద్దుకోవలసిన ప్రమాదం ఏర్పడింది. కారణం అక్కడ దీపం లేక పోవడమే! చీకటికి ఆ వంతెన క్రింద మలుపులో చెట్లగుబుర్లో ఎన్ని ప్రమాదాలయినా జరగవచ్చు. ఎలెక్ట్రిక్ ఇంజనీరు గారెలాగో తప్పించుకోవడానికి వీలుగా సమయానికి సాయెబూ దీపం వెలిగింది. ఆ సందు వలుతురులో కారు మళ్ళించుకున్నాడు. ఇదిచూచి ఆయన తప్పక దీపం వేయించా లని వ్రాసుకొన్నారు. కరణం, మునసబుల ప్రోద్బలం, అధికారుల ప్రోత్సాహం పని చేశాయి ఆ దారి నే ప్రక్కనున్న పంచదార మిల్లుకి కరెంటు సప్లయి చేయడంలో, యీ వంతెన వద్ద ఒక దీపస్తంభం పాతి వేశారు. జనవరి మాసంలో నే కొత్త కరెంటు వచ్చి దీపాలు వెలిగాయి.

ఆ సమయానికి తన సంకల్పం నెరవేరి నందుకు కామమ్మగారు అఖండ దీపా రాధన చేయించారు ఆ వేళ తాను స్వయంగా చీకట్లో-ఆ బురదలో కూరుకుని పోయింది. కనక యింత జరిగింది కాని లేక పోతే జరిగేదా? నిండైనవాళ్లె ఆకారంలాగే మనస్సుకూడా నిండైనది మరి! ఆమె పట్టిన పట్టు విడువకుండా భగీరథ ప్రయత్నంలాగా సాధించింది. ★

వ్యంగ్య రచన:



ప్రార్థన శ్లోకములు

నీలాంబరధరాం కాఫీం మసివర్ణం
చతుర్విధాం।

జలశర్కర క్షీరశ్చ డికాక్షన్ నమోనమః॥
కాఫీశ్వరీ నమస్తుభ్యం వరదే కాలరూపిణీ।
విద్యారంభే వివాహేచ ప్రసన్నా
భవ సర్వదా॥

నమోస్తు కాఫ్యై సడికాక్షనంచ।
నమోస్తు కప్పా మకిలించ నిత్యం॥
నమోస్తు టేబుల్ శతధాచ మార్బల్।
నమోస్తు సర్వర్సు నవిద్రతాంచ॥
నమోస్తు క్లీనర్సు సనల్లగుడ్డాం।
నమోస్తు ప్రొప్రయిటరు మూర్తిమంతం॥

నమోస్తు కఫ్యాలయబూజుమలాం।
నమోస్తు కాఫీగతధూమలీలాం॥

నమోస్తు కాఫ్యాలయఅగ్ని కీలాం।
నమోస్తు కాఫీబిల్లు అత్యంతగోలాం॥

కాఫీనామానియే జప్త్వా
కాఫీం ధ్యాయన పునఃపునః।
కాఫీగతప్రాణవిత్తః
పరలోకం సగచ్ఛతి॥

కలశస్యముఖే ధూమః,
కంఠే భిగ్ భిగ్ సమాశ్రితః।
మూలే తత్ర స్థితా కాఫీ మధ్యే
క్షీరంచ శర్కరః।
పశ్చాత్ డికాక్షన్ కప్పానాం కిలం
సర్వత్ర పంకిలం॥

శ్రీ కాఫీ శబ్దోచ్చారణమాత్రేణ
క్షుత్పిపాస వినాశనమ్।
తీశబ్ద పఠనాచ్చైవ
దుర్బలత్వం వినశ్యతి॥

శ్రీ కాఫీపాన ఫలితం
కోటిహత్యాఘ నాశనం।
తత్రైవ వాష్టగుణం పాపం
హోటల్ బుణవిమోచనం॥
అపుత్రాః పుత్రిణస్సంతు,
పుత్రిణస్సంతు పౌత్రిణః।

సధన నిర్ధనా స్సంతు,
కాఫీ దాసానుదాసికాః॥

కాఫీతుల్యం రసం కించిత్
న భూతం న భవిష్యతి
సర్వ రోగోపశమనమ్,
సర్వ ఫాషన్ ప్రవర్తనమ్॥

అపరాధ సహస్రాణి
క్రియంతేఽహర్నిశం మయా।
దాసోయమితి మాం మత్వా
క్షమంతాం కాఫీశేశ్వరీ॥

అయ్యర్ దేవం నమస్కృత్వా
కాఫీ పీత్వా దినేదినే।
ఖిల్లీ సిగరెట్ తథా సేవ్య
ప్రాత రగ్నిం సమాపయేత్॥

ఆద్య పశ్చిమదేశగర్భజననం
అయ్యర్ గృహే వర్ధనం।
అన్యాయార్జిత విత్తమాన
హారణం ఆలోచనసా మారణం॥

"ఘరానా"

తిరవాణీ రసనాశనం, కలియుగే
చట్నియన్న సంహారణం।
అయ్యర్ వాళ్ పరిపాలనం భజత హే
శ్రీ రమ్య కాఫ్యామృతం॥

*   *   *

కాఫీ దేవతా వాక్యం

పరిత్రాణాయ బాలానాం
వినాశాయ చ సత్కృతాం।
ధర్మ విధ్వంసనార్థాయ
సంభవామి కలౌయుగే॥ —

పూర్వజన్మ కృతం పుణ్యం
కాఫీ రూపేణ భుజ్యతే।
కాఫీపా పదక్షిణాద్దేవ
స్వర్గలోకం గమిష్యతి॥
మనుష్యాణాం సహస్రేషు
యః కాఫీ పీయతేఽనిశం।

లభతే చ నియన్యోగం చ
సందేహో నసంశయః॥

చతుర్విధ సమాయుక్తాం
కాఫీ పీత్వా విముచ్యతే।
శీతోష్ణసుఖదుఃఖేషు తథా
మానావమానయోః॥

జన్మ జన్మ కృతం కర్మం
కాఫీ పానేన వినశ్యతి।
కాఫీ పానేన తద్దాసః
సర్వకామాన వాప్నుయాత్॥

యత్ర యత్ర కాఫ్యాలయం భవతి।
తత్ర తత్ర 'గుడ్ ఫ్లేవర్' లభ్యతి॥
లోకానాం రక్షణార్థాయ
సర్వపాపా నుపపత్తయే।
కాఫీదేవి స్వరూపేణ
ఉద్ధరస్య దినే దినే॥

యః మాతాంజలి సంపుటై రహ
రహ స్సమ్య క్స్వబ త్యాదరాత్
అయ్యర్ హస్తవినీనపద్మగళితం
కాఫీ మధుం ప్రీతితః
సంహారం సవిహాయ గచ్ఛతి
పుమాన్ శ్రీ పితృదేవాంతికమ్॥

యస్మా స్మరణమాత్రేణ
జన్మ సంసారబంధనా।
ముచ్యతే సా చ కాఫీ మే
ప్రాణదానం కరిష్యతి॥

ఆయుః ప్రజ్ఞాం యశోలక్ష్మీం
శ్రద్ధాం పుత్రాస్సుశీలతాం
ఆరోగ్య దేహసౌఖ్యం
చ కాఫీశ్వరీ దదాతు మే॥

రోగార్తో ముచ్యతే రోగా
ద్బద్ధో ముచ్యేత బద్ధకం
భయా న్ముచ్యేత భీతస్తు
ముచ్యే తాప న్నాపదః।
ధర్మార్థీ ప్రాప్నుయా ద్ధర్మ
మర్థార్థీ చార్థ మాప్నుయాత్
కామానవాప్నుయా త్కామా ప్రమోక్షీ
చాప్నుయాత్ ప్రమోషన్॥
పితౄణాం పిండోదయశ్చ
తస్య పుణ్యఫలం శ్శృణు।

★ కాఫీకల్పము ★

కులమృత్యార్యశే తేన
దశపూర్వాన్ దశాపరాన్॥
కాఫీ కషాయం యే పీత్వా
శ్రద్ధాభక్తి సమన్వితః।
జన్మమృత్యు జరావ్యాధి
భయం నైవోపజాయతే॥
మాతాత్వంచ పితాత్వంచ
భ్రాతృత్వంచ ప్రభుర్మమ।

త్వమేవ శరణం ప్రాప్తం
రక్షమాం కాఫికేశ్వరీ॥
'కోర్టు' ద్వారే మహాఘోరే
భయం న వైరిసంకటం।
వాది ప్రతివాది సాక్ష్యేషు
భయంలేశో నవిద్యతే॥
కాఫీం పీత్వా దినందినం
పరధ్యానం వినశ్యతి।



వినశ్యతి స్వయంధ్యానం
పీతేచ అధికం తథా।
ఖలే కాఫ్యేవ, కాఫ్యేవ,
కాఫ్యేవ మమజీవనం।
కాఫీ నాస్త్యేవ, నాస్త్యేవ,
నాస్త్యేవ గతి రన్యథా॥

శ్రద్ధాం మేధాం యశః
ప్రజ్ఞాం బుద్ధిజ్ఞానం।
ఆయుష్యం తేజస్సారోగ్యం
దేహి మే కాఫీకేశ్వరీ॥

కాఫీదర్శనమాత్రేణ,
పలాయంతేహి పాతకాః।
బ్రహ్మలోకే వసేతోపి
పునరావృత్తి విసర్జితం॥
యం యం కామయతే కామం
తంతమాప్నోతి భార్గవా।
నరో భక్త్యాత పీతేచ
కోటిజన్మాఘ నాశనం॥

శ్రీ కాఫీకేశ్వరీ అష్టవింశత్యుత్తర శతనామావళి

1. ఓం ప్రాణనిలయాయై నమః
2. ఓం ప్రాణరక్షకాయై నమః
3. ఓం ప్రాయదాయిన్యై నమః
4. ఓం ప్రాణప్రియాయై నమః
5. ఓం ప్రాణధారాయై నమః
6. ఓం ప్రాణాంతకాయై నమః
7. ఓం ఆహ్లాదజనన్యై నమః
8. ఓం ఆనందాయిన్యై నమః
9. ఓం దేహారోగ్యాయై నమః
10. ఓం దేహదార్ఢ్యై నమః
11. ఓం మలబద్ధకాయై నమః
12. ఓం సంసారవల్లభాయై నమః
13. ఓం సంసారకల్లోలాయై నమః
14. ఓం మూలాధారాయై నమః
15. ఓం మోక్షదాయిన్యై నమః
16. ఓం పరీక్షవ్యాసుకారిణ్యై నమః
17. ఓం కాఫీదాసప్రియాయై నమః
18. ఓం రోగపీడజనతాయై నమః
19. ఓం ధాతుపుష్ట్యై నమః
20. ఓం క్షురవర్ధన్యై నమః
21. ఓం క్షీరమిళితాయై నమః
22. ఓం క్షీరసాగర్యై నమః
23. ఓం క్షీరసముద్రాయై నమః
24. ఓం నిరంతర కౌతుహల్యాయై నమః
25. ఓం నీరక్షీరశర్కరమిళితాయై నమః
26. ఓం క్షురకర్మశోభితాయై నమః
27. ఓం క్షుత్పిపాసధ్వంసిన్యై నమః
28. ఓం తరవాణి వినాశిన్యై నమః
29. ఓం దధియన్న సంహారిణ్యై నమః
30. ఓం శర్కరప్రియాయై నమః

పురపాలక సంఘం సమావేశమై తీవ్రంగా చర్చలు జరుపుతోంది.

"ఈ సంఘంలో సగం మంది వట్టి దద్దమ్మలు" అన్నాడు. ఒక సభ్యుడు ఉద్రేకంతో ఆ సభ్యుడికి ప్రతికూలుడైన మరొక సభ్యుడు ఇందుకు నిరసన ప్రకటించి, ఇలా అనడం చాలా అవమానకరమని, వెంటనే ఉపసంహరించుకోవాలనీ పట్టుపట్టాడు.

"సరే అలాగే చేస్తాలెండి. ఈ సంఘంలో సగంమంది వట్టి దద్దమ్మలు కారు" అన్నాడు మొదటి సభ్యుడు.

31 ఓం జగదాధారాయై నమః
32. ఓం కప్పువాహనాయై నమః
33. ఓం క్రోధశమన్యాయై నమః
34 ఓం ఆలోచనాదాయిన్యై నమః
35 ఓం లోకప్రియాయై నమః
36. ఓం దక్షిణదేశాయై నమః
37. ఓం తూర్పుదేశపాలిన్యై నమః
38 ఓం బహిర్దేశసాధనే నమః
39 ఓం వర్ణావర్ణభేదవివర్జితాయై నమః
40 ఓం మానాభిమానవివర్జితాయై నమః
41 ఓం కవికల్పవృద్ధాకారాయై నమః
42 ఓం కవీశ్వరప్రియాయై నమః
43 ఓం శిశుబాలకాయై నమః
44. ఓం జ్వరాంకుశాయై నమః
45 ఓం ద్రవ్యనాశిన్యై నమః
46 ఓం ధనప్రియాయై నమః
47. ఓం పితృకర్మసహకారిణ్యై నమః
48. ఓం నిర్వ్యాపారాయై నమః
49. ఓం బద్ధకొదరాక్షసభంజనాయకా
యై నమః
50. ఓం శిరోబాధాంతకాయై నమః
51. ఓం డికాక్షనాలింగాయై నమః
52. ఓం డికాక్షన్ స్వరూపాయై నమః
53. ఓం జలపూరితాయై నమః
54. ఓం జలోదరాయై నమః
55. ఓం మలినవస్త్రప్రవాహిన్యై నమః
56. ఓం శత్య్వాపత్న్యై నమః
57. ఓం కరాగ్రహాయై నమః

58. ఓం కలికాలామృతాయై నమః
59. ఓం అభీష్టవరదాయై నమః
60. ఓం మంగళప్రియాయై నమః
61. ఓం మారవిరూపాయై నమః
62. ఓం అపాత్రవ్యయాయై నమః
63 ఓం సపాత్రపానీయాయై నమః
64. ఓం సభ్యాళి లబ్ధాయై నమః
65. ఓం స్త్రీప్రియాయై నమః
66. ఓం అపక్వభుజ్యాయై నమః
67. ఓం ధర్మాధర్మవివర్జితాయై నమః
68 ఓం ధర్మశూన్యాయై నమః
69 ఓం ధగోర్మధాస్తుప్రియాయై నమః
70 ఓం ధూమశకటసహకారిణ్యై నమః
71. ఓం ప్రయాణామృతాయై నమః
72. ఓం మాధుర్యై నమః
73 ఓం మధురాకారాయై నమః
74. ఓం నవనాగరికతాదర్శాయై నమః
75. ఓం శతకోటిపానీయప్రభవాయై నమః
76. ఓం సహస్రకోటిభక్త్య
సమానాయై నమః
77. ఓం వైవాహికశోభప్రియాయై నమః
78 ఓం వివాహకల్లోలకారిణ్యై నమః
79. ఓం మితాయిదుకాణాంతకాయై నమః
80. ఓం స్వదేశాభిలాషిణ్యై నమః
81. ఓం పరదేశాచారప్రియాయై నమః
82 ఓం దుస్స్వప్నకారిణ్యై నమః
83. ఓం సుస్వప్నవాశిన్యై నమః
84 ఓం వంశవర్ధనాయై నమః
85 ఓం సర్వకార్యనిర్వాహకాయై నమః
86 ఓం కోర్టుసాక్షిసంతృప్తితాయై నమః
87 ఓం విద్యాదాయిన్యై నమః
88 ఓం విద్యార్థిప్రియాయై నమః
89 ఓం సనాతనసహకారిణ్యై నమః
90 ఓం బాలవృద్ధహితాయై నమః
91 ఓం బాలబృందాయై నమః
92 ఓం బాలామృతాయై నమః
93 ఓం బాలారిష్టాయై నమః
94 ఓం బాలభాస్కరాయై నమః
95. ఓం బాలార్కకోటిప్రభాయైనమః
96 ఓం జీర్ణకోశనాశిన్యై నమః
97 ఓం శుష్కప్రియాయై నమః
98 ఓం శూన్యహస్తాయై నమః
99 ఓం బ్రాహ్మణార్థానుకూలిన్యైనమః
100. ఓం శివాత్మికాయై నమః
101. ఓం సినీమా శృంగారిణ్యై నమః
102. ఓం నాగరికతాసూచికాయై నమః
103. ఓం జ్వరరోగచికిత్సాయై నమః
104. ఓం ఉపవాససౌఖ్యదాయిన్యై
నమః
105. ఓం సురకనిష్ఠసోదరాయై నమః
106 ఓం మధుప్రియాయై నమః
107. ఓం ఆరోగ్యమయకారిణ్యై నమః
108. ఓం అగమ్యగోదరాయై నమః

109. ఓం కలికాలపానీయాయై నమః
110. ఓం సర్వకాలాచారాయై నమః
111. ఓం సర్వకార్యసాధనాయై నమః
112 ఓం మనోబుద్ధిరంజతాయై నమః
113. ఓం పూర్వజన్మప్రారబ్ధాయైనమః
114 ఓం పరజన్మవినాశిన్యై నమః
115. ఓం జన్మజన్మపరంపరాయై నమః
116. ఓం కోటిజన్మశోభితాయై నమః
117. ఓం శర్కరశూన్యసమయగుడ
ప్రియాయై నమః
118. ఓం క్షీరశూన్యసమయజల
ప్రియాయై నమః
119 ఓం క్షీరశర్కరశూన్యసమయ
డికాక్షన్ ప్రియాయై నమః
120. ఓం కప్పుకప్పుడోలికాయై నమః
121. ఓం పింగాణికప్పు సహకారిణ్యై
నమః
122 ఓం మార్బుల్ రథారూఢాయైనమః
123. ఓం శత్రుకారిణ్యై నమః
124. ఓం మిత్రకారిణ్యై నమః
125. ఓం ధగద్ధగాయై నమః
126 ఓం భగ్గుభగ్గాయై నమః
127. ఓం భుగభుగాయై నమః
128 ఓం గుడగుడాయై నమః
129 ఓం నిత్యసంతుష్ట్యాయై నమః

ఇతి అష్టవింశత్యుత్తరశతనామావళి సంపూర్ణం ★




భద్రాచలయాత్ర.

ఫొటో: పాలంకి పార్థసారథి—నర్సాపురం.

19-4-56

వెలయుపండ్రెండవ నెలయందు చై
నర్వసుబుధ శుద్ధ నవమిన
పంచగ్రహంబులు పరగ నుచ్చస్థ
గతులుగా గురు సుధాక
కర్కటకాఖ్య లగ్నమునందు గ
హారి కర్థమగు రాము న



త్ర పు
డు
న
సలు. కూక
సల్య
మరగనిమి.



భద్రాచలంలో సీతారామలక్ష్మణుల విగ్రహాలు.

మా నిషాద ప్రతిష్ఠాం త్వమగమ
శ్శాశ్వతీస్సమాః
యత్ క్రౌంచమిథునా దేకమవధీః
కామమోహితమ్



భద్రాచల శ్రీరామాలయం.
ఫొటోలు: పి. వీరయ్య—సికింద్రాబాద్.



మెహబూబ్ ప్రొడక్షన్స్ వారి 'ఆవాజ్' లో ఉషాకిరణ్.



డి లక్స్ ఫిలింస్ వారి "మ్యాథిల్డి"లో వర్ధమాననటి జబీన్.




లక్ష్మీప్రొడక్షన్స్ వారి "ఇలవేల్పు" లో భగ్నప్రేమికుడు శేఖర్ గా నాగేశ్వరరావు,
అతని చెలికాడు మోహన్ గా చలం.



ఏ. వి. ఎం. వారి "చోరీ చోరీ" లో భగ్ వాన్, రాజసులోచన.



ఆర్. కె. ఫిలింస్ వారి "జాగ్ తే రహో" లో సుమిత్రా దేవి, మోతీలాల్.



భరణీవారి "చింతామణి"లో భానుమతి, రేలంగి.

నరసూవారి 'భలేరాముడు'

పాత చిత్రానికీ, కొత్త చిత్రానికీ తేడా ఏమిటి?

నరసూవారి కొత్త చిత్రం "భలేరాముడు" చూస్తే కేవలం ఫొటోగ్రఫీలోనే కనిపిస్తుంది. ఇదనంగా, కొన్ని అవకతవకలూ, అసంగతాలూ కూడా కనబడతాయి. బొంబాయి టాకీస్ వారు 'కిస్మత్' నిర్మించినప్పుడు, ఆనాటి సదుపాయాలు నేటికన్న తక్కువ. పద్ధతులు వేరు. అది ఆనాడు కొల్లేజానికి మంచి చిత్రం అనిపించుకుంది. బాగా డబ్బు సంపాదించి, బాక్సాఫీస్ చిత్రాలలో అగ్రగణ్యం అయింది. ఆ చిత్రం ఆధారంగా తయారైన ఈ చిత్రం చూచినప్పుడు, ఈ పది పదిహేను ఏళ్లలో చలనచిత్ర పరిశ్రమ అభివృద్ధి సాధించిందన్న సంగతి గాని, కొత్త పద్ధతులున్నాయన్న ముక్క గాని ఎవరికైనా తట్టదు. తక్కినవల్లా, సంగతి సరే. అన్నిటికన్నా పెద్ద సందేహం, నిష్కారణంగా పాత చిత్రంలో చోటెను మార్పులు యెందుకు చేశారూ! అనేదే. ఇందులో కొన్ని కొత్త సంఘటనలు కల్పించారు. పాతదాంట్లో ఉన్నవి కొన్ని తగ్గించారు. వీటివల్ల కొత్తగా చేకూరిన ప్రయోజనం ఏమీ కనబడదు. కథ చెప్పే తీరులో గాని, ఆయా సన్నివేశాలను రసవత్తరంగా చిత్రించడంలో గాని, కొత్తదనం ఏమీ లేదు. అందుకు ప్రయత్నం కూడా కనబడదు. ఇందులో అసందర్భాలూ, అసంగతాలు మాత్రం, వాటికి కారణం పాతవాటి అక్కర్లేదా, అని సందేహం కలుగుతుంది.

ఈ చిత్రం దర్శకుడు శ్రీ వేదాంతం రాఘవయ్యగారి స్క్రీన్‌ప్లే కూడా వ్రాశారు. మాటలూ పాటలూ శ్రీ సదాశివబ్రహ్మం వ్రాశారు.

ఈ తరహాలో తయారైన ఈ చిత్రం అంతటికీ, ఉత్తమ స్థాయిని అందుకున్నది నాగేశ్వరరావు నటన. నిండుగా ఒప్పినది సావిత్రి నటన. ఉన్నంతలో, "భలేరాముడి" భూమికను సాధ్యమైనంతగా న్యాయం చేశారు నాగేశ్వరరావు. ఈ రకం పాత్రలు ఒప్పించడంలో అతిగా వెకిలి వేషాలు వేసి, శక్తికిమించి [illegible] చేసే ప్రమాదం ఎక్కువ ఉంది. ఈ దృష్ట్యా, నాగేశ్వరరావు నటన అతి [illegible]గా నడిచింది. [illegible] అత్యుత్సాహం, [illegible] సాధించాయి.

భలేరాముడి "[illegible]" రేలంగి సహజ ధోరణిలోనే చిత్రానికి హాస్యం సమకూర్చారు. [illegible] ఈనాటి కూడా [illegible].

ఈ చిత్రంలో హాస్యం కోసం ప్రవేశపెట్టిన మరో పాత్ర [illegible]. [illegible] పాత్రను చక్కగా పోషించి [illegible] నటీనటులు సి. ఎస్. ఆర్. గోపీనాథశాస్త్రి, [illegible], డి. హేమలత, గిరిజ మొదలైన వాళ్ళంతా తమ తమ భూమికలను యథోచితంగా నిర్వహించారు.



శంకర్ ప్రొడక్షన్సువారి "సదారమ"లో జానకి, కౌశిక్

బొంబాయి సినిమా లేఖ

నటీనటులు అందరూ బాగా నటించినందు వల్ల, 'బాక్సాఫీసు'కు కావలసిన ఇతర హంగులున్నందువల్ల ఈ చిత్రం ఆర్థికంగా విజయవంతం అవుతుంది. సంగీత దర్శకుడు శ్రీ రాజేశ్వరరావు, అసలు చిత్రంలో పాటలు మూడు నాలుగింటికి కొద్దిమార్పులు చేసి ఇందులో ప్రవేశపెట్టారు. ఇటీవల హిందీ చిత్రాలలో 'ఫాషన్' అయిన పాశ్చాత్య సంగీతం కూడా ఒక పాటకి అమర్చిపెట్టారు. రాజేశ్వరరావుగారు స్వంతంగా పెట్టిన పాటలు కూడా శ్రావ్యంగా ఉన్నాయి.

* * *

భలేరాముడితో కలిసి, మనకి మొత్తం 'ఫోర్ రాముళ్లు' నలుగురయ్యారు. మొదటి రాముడు పాతాళభైరవిలో కనబడ్డ తోట రాముడు. ఆ తరవాత అగ్గిరాముడు అవతరించాడు. ఈ రెండూ ఎన్. టి. రామారావు నిర్వహించిన వేషాలు. తరవాత "దొంగ రాముడు" వచ్చాడు. ఆ పాత్ర నిర్వహించిన నాగేశ్వరరావు ఏప్రిల్ 6న "భలేరాముడు" అయ్యాడు.

అమెరికా చలనచిత్ర సంఘాధ్యక్షుడు ఎరిక్ జాన్‌స్టన్ మొన్న మనదేశం వచ్చి వెళ్ళినందువల్ల, భారత చలనచిత్ర పరిశ్రమ ఆశించిన ఫలితాలేవీ ఒరిగి పడలేదు. మన నిర్మాతలు ఆయనతో మాట్లాడి, భారతీయ చిత్రాలకు అమెరికాలో మార్కెట్ లభించడానికి ఏర్పాట్లు చేస్తారని ఆశించబడింది. అయితే అదేమీ కలసిరాలేదు. ఎరిక్ జాన్‌స్టన్, చలనచిత్రాల భూమిక గురించి తమ దేశపు ప్రజాస్వామ్య దృక్పథాల గురించి ఉపన్యసించారు గాని, భారతీయ చిత్రాలు ఆదేశంలో విడుదల కావడానికి గల అవకాశాల విషయం ఏ సందర్భంలోనూ ప్రస్తావించలేదు. "రష్యన్ చిత్రాలకైనా సరే మా దేశంలో ప్రదర్శనావకాశాలు ఉంటాయి" అని మాత్రం ఆయన అన్నారు. అసలు ఎలా ఉన్నా యుద్ధానంతర కాలంలో బ్రిటిష్ చిత్రాలు అమెరికాలో ప్రదర్శనావకాశాలు సంపాదించుకోవడానికి ఎన్ని ఆటంకాలు ఎదుర్కొనవలసి వచ్చిందీ తెలిసినదే. రాజకీయంగా బ్రిటన్ అమెరికాలకు సయోధ్య కుదిరినప్పటికీ, వాణిజ్య రీత్యా సంబంధాలు పెంపొంది, చలన చిత్రాలకు కూడా మార్గం దొరికింది. ఇక మన చిత్రాలు. సొహ్రాబ్ మోడీ నిర్మించిన 'ఝాన్సీ కీ రాణీ' ఉత్తమ శ్రేణి చిత్రం. దాని నిర్మాణంలో అమెరికన్ టెక్నీషియన్లు పాల్గొన్నారు. అమెరికాలో విడుదల చేస్తామని యూనివర్సల్ ఇంటర్నేషనల్, ట్వంటీయత్ సెంచరీఫాక్స్ సంస్థలవారు దాన్ని



ఈమధ్య బొంబాయిలో ఒక సినీవిందు జరిగినసందర్భంలో అభిమానులకు 'ఆటోగ్రాఫ్'లు ఇస్తున్న నిమ్మీ.

★ బొంబాయి సినిమా లేఖ ★

ఉంచుకొన్నారు. అక్కడి వారికి నచ్చేటని కొన్ని చిత్రం పొడవు తగ్గించారు. పేరు మార్చి "టైగర్ అండ్ ది ఫ్లేం" అని నామకరణం చేశారు. ఈనాటికీ ఆ చిత్రం అక్కడ తెరకెక్కి అవ్యపానికి నోచుకోలేదు. ఇటువంటిదే మరొక చిత్రం "ఝనక్ ఝనక్ పాయల్ బాజే" ఉత్తరాఫ్రికాలోనూ, యూరప్ అనేక ప్రముఖ నగరాలలోనూ విడుదల అయి బహుళ జనాదరణ పొందుతోంది. అమెరికాలో మాత్రం "కేడ్ ఇన్" ఇవ్వడానికి కూడా అవకాశం లభించలేదు.

ఈ పరిస్థితులవ్యల్లా, మన దేశంలో అమెరికన్ చిత్రాల ప్రదర్శన కాలాన్ని పరిమితం చేయవలసిందిగా భారత ప్రభుత్వాన్ని కోరాలని భారతీయ చలనచిత్ర పరిశ్రమవారు నిశ్చయించుకొన్నారు. స్వదేశి పరిశ్రమ అభివృద్ధివల్లా, ఇంతటితో ఊరుకుంటే చాలదనీ, కేవలం పరస్పర పద్ధతిపై అమెరికన్ చిత్రాలను దిగుమతి చేసి, ఎన్ని అక్కడ ప్రదర్శిస్తే అన్ని ఆ కాలంలో విడుదల చేయాలన్న షరతు పెట్టాలనీ మరికొందరు వాదిస్తున్నారు.

కాలంలోని ఎక్కువభాగంలోనూ కూడా అమెరికన్ చిత్రాల ప్రదర్శన కాలాన్ని తగ్గించివేసి, నానాటికీ స్థాయిలో ప్రశంసనీయమైన అభివృద్ధి సాధిస్తున్న భారతీయ చిత్రాలను ప్రదర్శించడానికే ఆ కాలాన్ని సద్వినియోగం చేయాలని భావిస్తున్నారు. భారత ప్రభుత్వంకూడా ఇందుకు సుముఖంగా ఉన్నట్లు తెలుస్తుంది. ముఖ్యంగా ఎగ్జిబిటర్లు ఈ వైఖరి అవలంబిస్తున్నారనడానికి నిదర్శనం బొంబాయి నగరంలోని 'ఇంగ్లీషు థియేటర్ల'లో భారతీయ చిత్రాలు ప్రదర్శించబడుతూ ఉండడం. "ఝనక్ ఝనక్ పాయల్ బాజే," 'దేవదాస్.' 'బుక్కాన్' 'సీమా' చిత్రాలు ఇక్కడి మెట్రో, రీగల్ న్యూఎంపైర్. ఈరాస్ థియేటర్లలో విడుదల అయ్యాయి. అలాగే కలకత్తాలో కూడా లైట్‌హౌస్, ఎల్ఫిన్‌స్టన్ థియేటర్లలో అప్పుడప్పుడు హిందీ, బెంగాలీ చిత్రాలు విడుదల అవుతున్నాయి.

* * *

భారత నౌకాదళోద్యోగి లెఫ్టినెంట్ దిలీప్ భండారీని వివాహం చేసుకోబోతున్నట్లు నటి యశోధరా కాట్జూ ఈ మధ్య ప్రకటించింది. దరిమిలా, భారత రక్షణ దళంలోని ఉద్యోగులను వివాహం చేసుకోబోతున్నామంటూ, మరికొందరు తారలు కూడా వెల్లడించారు.

ఇప్పుడు నటి 'నీలం' కూడా భారత సైనికదళానికి చెందిన ఒక ఉద్యోగిని వివాహం చేసుకోబోతున్నట్లు ప్రకటించింది. ఈ సందర్భంలో అప్రస్తుతమైనవాళ్లు తెలుసుకున్న ఒకటి [illegible] లేదింకా. యశోధరా కాట్జూ [illegible] ఈ వివాహం [illegible] ముహూర్తం నిశ్చయంగాలేనే ఉన్నట్లుంది. కాకే, ఆమెలాగే ఈ [illegible] కూడా, వివాహానంతరం చలనచిత్రాలలో నటించడం మానుకొన్నట్లు స్పష్టపరచింది. అందరితారలు ఎలా ఉన్నా, రక్షణ దళోద్యోగులకు ఇది కొంత చిక్కైన విషయం. రక్షణ శాఖోద్యోగుల భార్యలు సినిమాలలో నటించడానికి వారి కోరికకూడా జరగదు. ఈ కారణంవల్లనే [illegible], [illegible], [illegible], [illegible] వివాహం చేసుకొన్నారు. ఇప్పుడు యశోధరా, నీలం వివాహానంతరం నటన కొనసాగిస్తారా? అలా చేయ్యగలరా అన్నది ఇంకా తెలియని [illegible] విషయం.

* * *

బొంబాయివచ్చి ఇక్కడే స్థిరపడిపోవాలని పాకిస్థాన్‌లో ఉన్న [illegible] ఈ మధ్య నిశ్చయించుకున్నట్లు వార్త వచ్చింది. ఆమె బయలుదేరే వేళ, ఆమెకి అందిన ఒక భోగట్టా వల్ల, ప్రయాణం, ఇక్కడికి రావాలన్న ఉత్సాహంకూడా [illegible]. [illegible] బొంబాయి వస్తున్నదని తెలియగానే [illegible] తిరిగి [illegible] ఇక్కడనే [illegible] చేయవలసిందిగా [illegible] భారత ప్రభుత్వ [illegible] ఉంటుంది. ఈ వార్త ఆమెకు తెలియడంతోనే ప్రయాణం మానుకుంది. ఆమె [illegible], ఇక్కడ [illegible] ఏ పాకిస్థాని [illegible] కూడా ఈ ప్రకటన [illegible] లేదు.

* * *

రాజ్‌కపూర్‌తో [illegible] నటించవలసిన [illegible] పాత్రలు [illegible] 'యాహూదికి లడ్కీ'లో [illegible] నాయకుడు. నాయకి పాత్రను [illegible] ఇవ్వబోగా నిరాకరించింది. అయితే, మహబూబ్ ప్రొడక్షన్స్‌వారి "[illegible]"లో [illegible] కలిసి నటించడానికి ఒప్పుకుంది [illegible]. [illegible] నిరాకరించింది. ఆమె [illegible] చిత్రాలు [illegible] కూడా [illegible] రాజ్‌కపూర్ నిర్మించే చిత్రాలకే [illegible] పనిచేయాలని [illegible] నిశ్చయించుకొంది.

* * *

విజయభట్ దర్శకత్వాన ప్రకాశ్ పిక్చర్స్‌వారు ఒక చారిత్రక ప్రణయగాథ

ధారంగా నిర్మించిన 'పట్టాణీ' చిత్రం మొన్న బొంబాయిలో విడుదల అయింది. కథాకాలం 11వ శతాబ్దం. స్థలం గుజరాత్. కర్ణాటకదేశపు యువరాణి 'మృణాళ' ఒకరోజున సోమనాథ్ దేవాలయానికి వెళ్లి అక్కడ ఒక చిన్న యువరాజును చూస్తుంది. పెరిగి పెద్దది అయిన తరువాత, ఆ యువరాజు ఆమెకే తెలిసి వివాహం చేసుకోవాలన్న సంకల్పంతో అన్వేషణకు బయలు దేరుతుంది. ఆ యువరాజు కర్ణదేవ సోలంకి గుజరాత్‌లో అన్హిల్‌వారాకు పట్టపు రాజు అవుతాడు. అతను కూడా చిన్నవాడు చూచిన, "మృణాళను" కలుసుకోవాల నెంతరాటపడుతూ ఉంటాడు. తెల్లగా లేనిస్త్రీలంటే ద్వేషం [illegible]లో, తీరా "మృణాళ" తన ఎదుటకువచ్చిన వాడు, గోధుమవర్ణం వర్ణంలో ఉన్న ఆమె చేతులు, పాదాలు చూచి, ఆమెను తిరస్కరిస్తాడు. అయితే రాజమాత, మంత్రి ఆమెకు ఆశ్రయమిచ్చి ఆదరిస్తారు. ఈలోగా రాజు, నటుంజల అనే నర్తకిని వలచి ఆమెనే పట్టమహిషి చేసుకుంటా నంటాడు. ఆ కాలంలోనే పరిస్థితులు అనుకూలించి, "మృణాళ" రాజానుగ్రహం సంపాదిస్తుంది. పట్టాణి అవుతుంది. కాకి మజిలీ కథ ధోరణిలో ఉన్నా, దర్శకుడు దీన్ని అద్భుతంగా చిత్రించారు.

పెద్ద పెద్ద సెట్స్, ఇతర హంగులూ ఎన్ని ఉన్నా, అవి కథనుగాని, పాత్రలను గాని పాడుచేయకుండా విజయభట్ ఈ చిత్రాన్ని నిర్మించారు. స్క్రీన్‌ప్లే, దర్శకత్వం మరింత బాగా ఉంటే, ఈ చిత్రం రామరాజ్య, బైజూబావరాల స్థాయిని అందుకొని ఉండేది. నటులలో అందరూ ఉత్తమ స్థాయిని అందుకున్నారు. ముఖ్యంగా, పట్టాణిగా వైజయంతిమాల నటన అత్యద్భుతంగా ఉంది. ఆమె ఇంతవరకూ నిర్వహించిన అన్ని పాత్రలకన్న ఇది మిన్న అనవచ్చు. ఈ చిత్రంలో ఆమె శాస్త్రీయ నృత్యాలూ, జానపద నృత్యాలూ కూడా, చిత్రంలో మొత్తం అన్ని అంశాలకూ తగ్గ స్థాయిలో ఉన్నాయి. రాజుగా ప్రదీప్ కుమార్ అతికినట్టు, పాత్రకు ఉచితమైన రీతిలో నటించాడు. [illegible] గొన్న నర్తకిగా, పట్టమహిషి కావాలన్న కాంక్షను కలుకున్న [illegible]గా [illegible] అత్యంత ప్రశంసనీయంగా నటించింది. ★

(ఆంధ్ర వారపత్రిక బొంబాయి విలేఖరి)



అర్థర్ రాంక్ సంస్థ పేరిట విస్టావిజన్‌లో నిర్మించబడుతున్న బ్రిటిష్ చిత్రం 'బ్లాక్ టెంట్'లో ఇటాలియన్ నటి అనా మేరియా సాంద్రీ.

సినిమా వార్తలు

నవీనా ప్రొడక్షన్స్‌వారు యోగానంద్ దర్శకత్వాన నిర్మిస్తున్న 'శ్రీ గౌరీ మహాత్మ్యం' సగానికి పైగా పూర్తిఅయింది. రామారావు, శ్రీరంజని, రేలంగి, ప్రభృతులు నటిస్తున్నారు.

* * *

అనుపమ ఫిలింస్‌వారి కొత్తచిత్రం [illegible]లో ముమ్మరంగా తయారవుతోంది. శరత్ నవల 'బిందుగారి అబ్బాయి' ఆధారంగా నిర్మితమవుతున్న ఈ చిత్రానికి శ్రీ తిలక్ దర్శకుడు. జమున, సూర్యకాంతం, నాగయ్య, జగ్గయ్య, రమణారెడ్డి, వటుంబరావు నటిస్తున్నారు. మాటలూ పాటలూ శ్రీ తాపీ ధర్మారావు, ఆరుద్ర.

* * *

సేలంలోని రత్నా స్టూడియోస్ నిర్మించనున్న ఒకతమిళ చిత్రానికి యోగానంద్ దర్శకత్వం వహిస్తారు. మే నెలలో పని ప్రారంభిస్తారట. ఈయనదర్శకత్వాన తయారైన మరొక తమిళ చిత్రం 'మదురైవీరన్' ఈ నెలలోనే విడుదల అయింది.



సెసిల్ బి. డిమిల్ చిత్రం "క్రూసేడ్స్"లో ఒక దృశ్యం. దీని హిందీ తర్జుమా చిత్రం ఇటీవల బొంబాయిలో విడుదలైంది.

రాజశ్రీవారి "జయం మనదే" శ్రీ శాంతిని ప్రకాశరావు దర్శకత్వాన ముమ్మరంగా తయారవుతోంది. అంజలి, రామారావు, రేలంగి, సుబ్బయ్య నటిస్తున్నారు. పాటలు మాటలు దేవులపల్లి, సముద్రాల, ముద్దుకృష్ణ, కొసరాజు వ్రాస్తున్నారు. సంగీతం ఘంటసాల.

వినోదా పిక్చర్స్‌వారు భానుమతి, ఎన్. టి. రామారావు, రాజసులోచన ప్రధానపాత్రలలో '[illegible]' చిత్రం నిర్మిస్తున్నారు. దర్శకుడు శ్రీనివాస రాఘవన్.

* * *

నంది పిక్చర్స్ 'సౌభాగ్యవతి' వాహినీలో ముమ్మరంగా తయారవుతోంది. సావిత్రి, రామారావు, రంగారావు, రేలంగి, సూర్యకాంతం, హేమలత నటిస్తున్నారు.

* * *

నటి జమున ఇప్పుడు మొత్తం 7 చిత్రాలలో ప్రముఖ భూమికలు నిర్వహిస్తోంది. వాటిలో తెలుగు చిత్రాలు చిరంజీవులు, భాగ్యరేఖ, చింతామణి, అనుపమా వారి కొత్త చిత్రం, 'వినాయకచవితి,' కాపల్యా పరిణయం, కలవేల్పు. 'వినాయక చవితి'లో జమున సత్యభామగాను ఎన్. టి. రామారావు శ్రీకృష్ణుడుగాను నటిస్తున్నారు. కాపల్యా పరిణయంలో జమున కాపల్య భూమిక నిర్వహిస్తోంది. వాహినీ, ఎం. ఆర్. ఎస్. వారి 'సంఘిప్పు' లోను, ఆర్. ఎస్. ఆర్. మాడర్న్ వారి తొలి చిత్రం (తమిళం)లోనూ కూడా ఆమె ముఖ్యభూమికలు నిర్వహిస్తుంది. ఆర్. ఎస్. ఆర్. వారి తొలి తమిళచిత్రంలో, జమున తొలిసారిగా తమిళ నటుడు శివాజీ గణేశన్‌తో కలిసి నటిస్తుంది.

అమెరికాలో 'ఆవారా'

[illegible] ప్రొడక్షన్స్ అనే అమెరికన్ ఫిలింసంస్థ, రాజ్ కపూర్ నిర్మించిన 'ఆవారా' చిత్రాన్ని కొన్నది. దీన్ని అమెరికా, [illegible]లో విడుదల చేయడానికి [illegible] ఏర్పాట్లు చేసుకున్నదట.

[illegible] కొన్ని [illegible] బుక్ చేయబడ్డాయి.

* * *

[illegible] పనిచేసే [illegible] నిషేధించాలని ప్రభుత్వం నిశ్చయించింది.

* * *

వరకట్న నిషేధం

గుంటూరు

"పూజ్యులైన మామ గారికి,

నేను కులాసాగానే చేరినాను. నా మిత్రుడు రామం నా కొరకు మంచి గది వెతికి వుంచినాడు. మంచిరోజు చూసి అందులో ప్రవేశించాను. నిన్న సాయంత్రమే వర్జ్యం లేకుండా కనిపెట్టి కాలేజీ ఫీసు కట్టినాను. ఇప్పుడే మీల్సు బుక్ తీసుకొన్నాను. సాయంకాలం టిఫిన్ బుక్ కూడా తీసుకుంటాను. ఎందుకంటే ఎప్పుడైనా చేతిలో డబ్బులేక ఇబ్బందిగా ఉండొచ్చు. అప్పుడు కాఫీకి చిల్లరవుండదు. అదీగాక రోజుకు ఆరేడుసార్లు కాఫీ త్రాగే అలవాటు నాకున్న సంగతి మీకు తెలిసినదే. అందు మూలాన, ఈ ఇబ్బందులు ముందే గ్రహించి టిఫిన్ టిక్కెట్లుకూడా కొనేస్తే మంచిదనుకుంటున్నాను. ఇహపోతే చిల్లర ఖర్చులు అవీ వుంటాయి. అందుకుగాను నాదగ్గర ముప్ఫయి రూపాయలు వున్నవి. ఈ నెలంతా గడుపుకుంటాను.

నేను తీసుకున్న గది కూడా బాగానే వుంది. ప్రస్తుతము నేను ఒంటరిగానే ఉంటున్నాను. రామంకూడా కొద్దిరోజుల్లో నాగదిలోనే చేరుదామనుకుంటున్నాడు. మర్చిపోయాను ఇంటి వారికి ఇప్పుడే ఇరవై రూపాయలు ఇచ్చేశాను. ఇంటియజమాని చాలా పెద్దమనిషి. ఆయనకు ఏడుగురు ఆడపిల్లలని, ఏమేమో చెప్పేడు. రామం అందుకుని మావాడు గృహస్థుడయ్యాడండీ అని హాస్యంగా అన్నాడు. ఇప్పుడు ఆయన తన సంసారగోడు నాముందు చెప్పుకోవడం మానేశాడు పాపం!

గుంటూరులో అమిత ఖర్చు. 'కాస్ట్ ఆఫ్ లివింగ్' చాలా 'హై'గా వుంది. కనుక ఖర్చు అయినా జాగ్రత్తగా నేవాడుతున్నాను. దుబారా చెయ్యడం లేదు.

మీరు ఖులాసాగా వున్నారని తలుస్తాను. అత్తయ్యగారికి నా నమస్కారములు తెలిపేది. మీ అమ్మాయి కులాసా అనుకుంటాను. నమస్కారములు. ఇట్లు,

మీ అల్లుడు."

* * *

గుడివాడ

"ప్రియమైన ఆనందరావుకు

మీ మామగారు దీవిస్తూ వ్రాయునది నీవు వ్రాసినకవరు చేరినది. సంగతులు గ్రహించినాను. నేను ఇచ్చిన పైకానికి ఎక్కౌంటు చెప్పావు. సంతోషం. కానీ ఇకముందు అలా వ్రాయకు. నీవు నాకు లెక్క చూపించక్కర్లేదు. నేను ఎప్పుడూ అలా అడగను. నువ్వు చిన్నవాడివి కాదు గదా! నువ్వు దుబారా ఎందుకు చేస్తావు! పొరబాటునకూడా అలా చేయవు. నీకు కావలసిన పైకం వ్రాస్తే వెంటనే మనియార్డరు చేస్తాను. డబ్బువిషయంలో మొహమాటం పడకు. ఏక్షణంలోనైనా పంపించటానికి నేను సిద్ధముగా వున్నాను. అవసరం కలిగినప్పుడల్లా వెంటనే వ్రాయి. పైకం విషయంలో నీకు లోటు చెయ్యను. ఈ నెలలో నీదగ్గరవున్న ముప్ఫయి రూపాయలు ఏమి చాలుతుంది? బలేవాడివోయి! ఇదంతా చూస్తూంటే నువ్వు బిడియపడుతున్నట్టున్నావు. దూరానవుండి అలా ఎప్పుడూ

కొంపల్లి బ్రహ్మానందరావు

చెయ్యకు. ఇబ్బంది పడిపోతావు. అవసరమైన మొత్తానికి కొంత ఎక్కువే తెలుపు. పంపిస్తాను. ఇప్పుడు మరో ఏభయి పంపిస్తాను. వాడుకో. మనకు తెలీని ఖర్చులు బోలెడు తగుల్తూంటాయి. మార్జినులో ఎప్పుడూ వుండకు ప్రమాదం!

మీ అత్తగారూ, పిల్లలూ కులాసాగానే వున్నారు. నీ క్షేమ సమాచారాలు తెలుపుతూ వుండు. ఆరోగ్య విషయం చాలా జాగ్రత్తసుమా. అసలే గుంటూరు మలేరియాకు ప్రసిద్ధి. కనిపెట్టివుండు.

అమ్మాయి శకుంతల కులాసాగానే వుంది. నమస్కారములు తెలుపమని నన్ను వ్రాయమన్నది. ఇంతే సంగతులు. ఇట్లు,

రామయ్య పంతులు"

* * *

గుంటూరు

"పూజ్యులైన మామగారికి,

నమస్కారములు. మీరు వ్రాసినజవాబు రెండురోజుల క్రితం అందినది. కాలేజీ గొడవల్లోపడి తీరిక కానందున వెంటనే జవాబివ్వటానికి వీలు చిక్కలేదు. అందుకు మీరు మరోక విధముగా తలంచరని భావిస్తాను.

మీకు వ్రాసిన పత్రములో ఎక్కౌంటు అనుకుని చెప్పలేదు. జనరల్ గా నేను పెట్టిన ఖర్చును తెల్పాను. అయినా అక్కౌంటు మెయిన్‌టైన్ చేస్తే మంచిది కదా. నాకు పైకం కావాల్సినప్పుడు మొహమాటం లేకుండా అడగమన్నారు. థాంక్సు. ఈ పెద్దపట్టణములో ఎటుచూసినా అమితమైన ఖర్చు. ఎప్పుడైనా సినిమాకు పోదామనుకుంటే కనీసము రెండు రూపాయలవుతోంది. నీళ్ళు పోసి గది ఊడ్చే కుర్రాడు నెలకు అయిదు రూపాయలు తీసుకుంటున్నాడు. ఇహ చాకలి, మంగలి ఖర్చు చెప్పనక్కర్లేదు. ఇంతకీ నా వుద్దేశ ఏమిటంటే మనం అనుకున్నదానికన్నా కొంత ఎక్కువ ఖర్చు అవుతుంది ఈ గుంటూరులో.

మీరు పంపిన ఏభయి చేరినయ్. చాలా సంతోషం. మొన్న వ్రాసిన పత్రములో నే వ్రాద్దామనుకున్నాను. కానీ మర్చిపోయాను. కొత్తగా చేరడం కనుక, ఈ ఏడాది క్రొత్త పుస్తకాలు చాలా కొనాల్సి వుంది. ఒక్కొక్క పుస్తకము కనీసం పదిహేను, ఇరవయి వరకూ వుంది. మొన్న రామం కొనుక్కొస్తే చూశాను—ఇరవయి మూడున్నర అయింది. ఇలాంటివి చాలా వున్నయ్. అందుకుగాను వెంటనే రెండు వందలు పంపాల్సి వుంటుంది. మరేమి అనుకోక పంపిస్తారని ఆశిస్తాను. ఇచ్చిన శ్రమకు క్షమాపణ.

అత్తగారూ, బావమరదీ క్షేమం అనుకుంటాను. మీ అమ్మాయి కులాసా తెలుప కోర్తాను. నేను క్షేమంగానే వున్నాను. శకుంతల ఆరోగ్యం వెంటనే తెలిపేది. ఇంతే సంగతులు. ఇట్లు,

మీ అల్లుడు."

* * *

★ వరకట్న నిషేధం ★

గుడివాడ

"ప్రియమైన ఆనందరావును
దీవిస్తూ మీ మామగారు వ్రాయునది.

నీ క్షేమము తెలిపినందుకు చాలా సంతోషము. నీ ఇతరత్రా ఖర్చు చాలా వున్నట్టు వ్రాశావు! అవును మరి. పదిమంది వున్నచోటే ఖర్చు. వ్యాపారం కూడా బాగా జరుగుతుంది కాబట్టి ధరలు కూడ జాస్తిగా వుంటాయి. అందుకు నువ్వేమీ బాధపడకు. అడిగినంతా పంపిస్తాను.

నీవు అడిగిన రెండొందలూ ఇపుడే మనియార్డరు చేస్తున్నాను ఇక్కడ అమ్మాయీ, అందరూ క్షేమం. నీ క్షేమ సమాచారాలు తిరుగు టపాలో తెలిపేది. ఇట్లు,

రామయ్య పంతులు."

* * *

గుంటూరు

"పూజ్యులు మామగారికి.

మీరు వ్రాసిన ఇన్‌లాండ్ కవరు అందినది. వెంటనే పోస్టు జవాను మనియార్డరు కూడా ఇచ్చాడు. పోస్టాఫీసునుంచి పరాపరి బుక్‌షాప్‌కె వెళ్ళినాను కావలసిన పుస్తకాలను పర్ ఛేజ్ చేశాను. మొత్తం మూడొందలు అయింది. అందుకని వున్నంత వరకూ ఇచ్చి మిగతాది క్రెడిట్ వ్రాసుకోమన్నాను. షాపువాడు తెలిసినవాడే. అందుకని ఒప్పుకున్నాడు.

అత్తగారికి నా నమస్కారములు. శకుంతల క్షేమంగదా? నేను కులాసా. ఇంతే సంగతులు. ఆనందరావ్.

* * *

గుడివాడ

"అల్లుడు ఆనందరావును దీవిస్తూ,

నీ పోస్టుకార్డు అందినది. మూడొందలు పుస్తకాలకు అయినట్టు వ్రాశావు. మంచిదే. కానీ బేరంచేసి కొను. కొంచెం తక్కువ ధరలోనె గిట్టొచ్చు. నీకు వంద పంపుతున్నాను. షాపులో అప్పు తీర్చివేసెయ్. మంచిది. రామయ్య"

* * *

గుంటూరు

"మామగారికి అల్లుడు ఆనందరావు
నమస్కరిస్తూ,

నేను క్షేమం. మీరు పంపిన వందరూపాయలూ, కార్డూ అందినవి.

ఈ మారు మరికొంత ఖర్చు తగులుతుందని వ్రాయటానికి చింతిస్తున్నాను. మా యూనియన్ ఎన్నికలు దగ్గరకు వస్తున్నయ్. మా స్నేహితులు అందరూ నన్ను కంటెస్టు చెయ్యమని ప్రోద్బలం జేస్తున్నారు. అందుచేత బలవంతాన ఒప్పుకోవలసి వచ్చింది. ఆ సందర్భములో పబ్లిసిటీఖర్చు బోలెడు అవుతుంది. మరొక విధంగా అనుకోక, వెంటనే రెండొందలు పంప కోర్తాను. అందరూ క్షేమముగదా! నేను కులాసా. అల్లుడు."

* * *

గుడివాడ.

"అల్లుడు చూసుకునేది,

విద్యార్థి జీవితంలో ఈ రాజకీయాలూ, ఈ ఎన్నికలూ అనవసరమేమో అనుకుంటాను. మళ్ళీ ఆలోచించి పోటీ చెయ్యి. అదీగాక అనవసరపు ఖర్చుకూడా అవుతుందనుకుంటాను. అయినా వందా పంపిస్తున్నాను. ఆలోచించి కార్యంలోకి దిగు. అందరూ క్షేమము. నీ క్షేమం తెలిపేది. రామయ్య."

* * *

గుంటూరు

పూజ్యులైన మామగారికి వ్రాయునది.

మీ లేఖ అందినది. మీ సలహాను పాటించి ఎన్నికల్లో పోటీచేయడం మానుకుందామని నిశ్చయానికి రాగానే మా లెక్చరర్లు కూడ నన్ను ప్రోద్బలించి నా దృఢసంకల్పాన్ని మానిపించారు. అందుచే నానిశ్చయానికి తిలోదకాలు ఇచ్చాను.

మా కాలేజీలో ఎన్నికలతీరు ఒక విధం. జనరల్ ఎన్నికల మాదిరి జరుగుతుంది. దాదాపు మూడు వేలమంది ఓటర్లు వుంటారేమో కాలెజీఅంతా కోలాహలము గాను, కన్నులపండుగగానూ వుంటుంది. నేను జయము పొందాలంటే కనీసం నాల్గయిదువందలు పూర్తవుతుందని అంచనా వేశారు. గెలిచిన పిమ్మట నా భావిజీవితం చాలా మారుతుంది. పదిమందిలో పలుకుబడి లభిస్తుంది. పెద్దవారితో పరిచయం కాగలదు. మిగతా కాలేజీలతో సంబంధం ఏర్పడి పేరువస్తుంది. కాలేజీ యూనియన్ పనులన్నీ నా చేతి మీదుగా జరుగుతాయి. అందుకని కష్టపారిగా ఆలోచించి పోటీకి దిగాను. అందుకు అయ్యేఖర్చు భరించటానికి మీరు వెనుదీయరనుకుంటాను. వస్తాను. "పి. ఎస్. గెలిచినతర్వాత నాకు ఎక్కువ ఖర్చు వుండదు. ఎంతఖర్చయినా ఇపుడే."

మీఅల్లుడు"

* * *

గుడివాడ

"అల్లుడు చూచుకునేది,

డబ్బు కాస్త జాగ్రత్తగా వాడుతూ వుండాలి నాయనా! స్వంతసొమ్ములా గా చూచుకోవాలి. మరి పంపిస్తున్నాను గదా అని ప్రతిజాబులోను అలా అడగడం మంచిదికాదేమో! నీ క్కావలసిన అయిదొందలు పంపిస్తున్నాను.

రామయ్యపంతులు

* * *

"మామగార్కి,

మీరు పంపిన అయిదొందలు ఖర్చు చేశాను. ప్రతిఫలముగా యూనియన్ అధ్యక్షపదవికి నేనే ఎన్నికైనాను. సంతోషముకదూ!

గెలిచినతర్వాత ఖర్చుండదనుకున్నాను. కానీ డొనేషన్సుకీ, పార్టీఫండుకి, చాలా లెక్క అవుతోంది. కనుక, వెంటనే మరో అయిదొందలు పంపక తప్పదు. అర్జంటు.'

మీ అల్లుడు."

* * *

గుడివాడ

"అల్లుడికి,

ఉత్తరం వస్తుందంటే భయపడి పోతున్నాను. దాని దుంపతెగ! ప్రతిసారీ డబ్బు పంపించమనేనా! చేరిన ప్రథమంలోనే ఇంతఖర్చు చేస్తుంటే రెండేళ్ళూ ఎలా భరించగలననుకుంటావోయి! చూస్తేపోతే, నీకు కట్నమే ఇచ్చుకున్నట్టయితే మెరుగ్గా వుండేదేమో! ప్రాణం హాయిగాకూడ వుండేది కట్నం లేకుండా పిల్లని చేసుకుంటున్నావుగదా అనుకున్నాను. కట్నంకన్న మించి వుంచేశావు నా దగ్గర. ఇహ నీకు నేను దమ్మిడీ పంపలేను. నా శక్తి కరిగిపోయింది. నీవు అడిగిన కట్నం నీకు వచ్చేసింది కనుక, నీ చదువు విషయం ఇహ నాకు బాధ్యతలేదు. మరేమీ అనుకోకుసుమా! అమ్మాయి, పిల్లలూ కులాసా. వస్తాను. రామయ్యపంతులు."★

వనితాలోకం

భాగ్యనగర ప్రణయగాథ (హైదరాబాద్ చరిత్ర)

ఇల్లిందల సరస్వతీదేవి

ఆది చీకటి నిశి. ఒక యువకుడు గోల్కొండ దుర్గమునుండి మూసీనది కభిముఖముగా, గుఱ్ఱపుస్వారీచేస్తూ నది ఒడ్డుకు చేరాడు. తుంపరలతో ప్రారంభమయిన వానజల్లు, కాసేపటిలో కుంభవృష్టిగా మారినది. మూసీనది నిండుప్రవాహములో జలప్రళయము వచ్చినట్లు భీకరాకారము దాల్చినది. యువకుడు సాహసముతో తన గుఱ్ఱాన్ని ఆప్రవాహములోకి దూకించి అవతలిగట్టుకు చేరాడు. పాలిబండదగ్గర చెంచలంపల్లిలో అతడు తన ప్రేయసిని కలుసుకోవాలి. అతడి హయము ఉత్తమజాతిది. వాయువేగ మనోవేగాలతో అతడిని త్రుటికాలములో ప్రేయసి దగ్గరికి చేర్చేది. ప్రతినిత్యమూ రాత్రి వేళ చెంచలంపల్లి గ్రామములో గడపి, ఉదయానికి తిరిగి కోటకు చేరుకొనేవాడా యువకుడు.

ఆ కాలములో మూసీనదిని గుఱ్ఱముల మీద ఏనుగులమీద దాటుతూ ఉండేవారు. నౌకరులద్వారా కుమారుడి సాహసము తెలిసికొన్న ఆ యువకుడి తండ్రి, మరునాడే ఒక వంతెన కట్టవలసినదని ఆజ్ఞ ఇచ్చాడు. అదే హైదరాబాదు నగరము లోని పురానాపుల్.

ఆ యువకుడు గోలకొండ కుతుబ్‌షాహీలలో అయిదవ వాడయిన మహమ్మదుకులీకుతుబ్‌షా. చెంచలపల్లి గ్రామములో ఉన్న అతడి ప్రియకాంత జగదేక సుందరి. హైందవ కుటుంబములో పుట్టినది. అతడు రాజ్యానికి వచ్చిన తరువాత, ఆమె ప్రేమ చిహ్నముగా ఒక పట్టణము నిర్మించి, ఆమె పేరు దానికి పెట్టాడు. అదే భాగ్యనగరముగా వ్యవహరింపబడుతూ వచ్చినది. ఈ నూతన నగర నిర్మాణము 1591 లో ప్రారంభమయినది.

మహమ్మదు కులీకుతుబ్‌షా 1580 లో గోలకొండ సింహాసనము నధిష్ఠించాడు. అతను రాజయిన తరువాత, పురాతన దుర్గమైన గోలకొండలో నివసించటము అతడికి యిష్టము లేకపోయినది. అతడు యువరాజుగా ఉన్నప్పుడు మూసీనది దక్షిణప్రాంతములో వేటాడుతూ ఉండేవాడు. ఆ ప్రదేశము నూతననగర నిర్మాణానికి అనువుగా ఉండగలదేమోనని ఆయన విచారణ చేసేసందర్భములో, జరిగినదని పరంపరాగతముగా చెప్పుకొనే అద్భుతగాథ ఒకటి ఉన్నది. ప్రస్తుతము చార్‌మినార్ నిర్మింపబడిన ప్రాంతారణ్యములో ఒక గొల్లవాడు మేకలను కాస్తూఉండేవాడు. ఒకనాడు వాడికి దివ్యసుందరవిగ్రహముగల ఒక స్త్రీమూర్తి ఎదురై, పాలనర్థించి, తన ఉనికిని పాదుషాకు తెలుపవలసినదని కోరినదట.

★ భాగ్యనగర ప్రణయగాథ ★

గొల్లవాని మాటననుసరించి ఆ ప్రదేశానికి వచ్చిన పాదుషాకు ఆ దివ్యసుందరీ దర్శనము కాలేదు. కాని, అది లక్ష్మీనివాసముగా భావించి ఆ ప్రాంతములోనే నగర నిర్మాణము చేయ నిశ్చయించాడు. ఆ ప్రదేశము నగరానికి మధ్యగా ఉండేటట్లు ప్రత్యేకించి అక్కడ చార్‌మినార్ అను సుప్రసిద్ధమైన అద్భుతకట్టడాన్ని నిర్మించాడు.

1589 లో గోలకొండపట్టణములో మహామారీ వ్యాపించి లెక్కలేనంతమందిని నాశనము చేసింది. కొందరు సాధువులు పీర్ల పంజాలు, తాబూతులు పట్టుకొని, భజనలు చేస్తూ ఊరేగినతరువాత ఆపీడ వదలిపోయినదట. తత్ జ్ఞాపకచిహ్నముగా, కృతజ్ఞతా సూచకముగా, తాబూతుల ఆకారాన్ననుసరించి, చార్‌మినారును నిర్మించవలసినదని పాదుషా ఆజ్ఞాపించాడు. హిందూ మహమ్మదీయ మత సమాన ద్యోతకముగా, చార్‌మినారు పైభాగము గుడి మసీదు రూపచిహ్నలతో నేటికీ చెదరని శిల్పకళలతో విరాజిల్లుతూ ఉన్నది. చార్‌మినారు వేదికకు తూర్పుభాగమున ఒక మూలలో, హిందువుల ఆచారమునసుసరించి, పసుపు కుంకుమ పూలతో పూజలు జరగటము ఈనాటికీ ఆచారముగా ఉన్నది. ఆకాలపు నాణెములలో (ఇప్పటి ఉస్మానియా సిక్కా రూపాయికంటె ఎక్కువ విలువ గలది) రెండులక్షల అరవైవేలు వ్యయమయినది. పిడుగుపాటువల్ల శిథిలమయిన భాగాలు సర్ సాలార్జంగు కాలములో బాగుచేయించినందువల్ల ఒక లక్ష రూపాయలు వ్యయమయినవి. చార్‌మినారు కట్టడ నిర్మాణము ఒక సంవత్సరములో పూర్తిఅయినది.

చార్‌మినారుకు ఉత్తరముగా ప్రధానమైన నాలుగు దిక్కుల యందు నాలుగు పెద్దకమానులు నిర్మింపబడి, నాలుగు రాజమార్గములు వేయబడినవి. నాలుగు కమానుల మధ్యగా, నాలుగు రాజమార్గములు కలియు శృంగాటకమున 'గుల్జార్ హౌజు' అను పేరున కోనేరు నిర్మింపబడినది. చార్‌మినారుకు తూర్పుగా రాజప్రాసాదాలు నిర్మింపబడ్డాయి. వాటికి చౌమహల్లా భవనాలని పేరు. మహమ్మదు కులీకుతుబ్‌షా అనేక భవనాలు, మసీదులు పాఠశాలలు స్నానఘట్టాలు నిర్మించాడు. వీటిలో చందనమహల్, సజన్‌మహల్, లాఖన్‌మహల్, నదీమహల్, హీనామహల్ మొదలగునవి నగరశోభను ఇనుమడింప చేసేవిగా ఉన్నాయి. 1591 లో ప్రారంభమయిన నగరనిర్మాణము ఆరు సంవత్సరాలకు పూర్తి అయినది.

సుందరతరమైన ఈ నూతననగరానికి పాదుషా తన కత్యంత ప్రియురాలయిన భాగ్యమతి పేరు పెట్టాడు. నగరనిర్మాణము పూర్తిఅయిన సంవత్సరము 1006 హిజ్రీ. ఈ సంవత్సరాన్ని సూచించటానికి అక్షర సాంఖ్యము ననుసరించి 'ఫర్ ఖుందిబున్యాద్' అని పెట్టాడు. ఈ పేరునే నిజాములు తమ నాణెములమీద వేయ నారంభించారు. ఈ నగరానికి పెట్టిన 'భాగ్యనగరము' అన్న పేరు కొంతకాలానికి హైదరాబాదుగా మారింది. దీనికి రెండు విధాలుగా కథలు వ్యాప్తమయినాయి భాగ్యమతికి 'హైదర్ మహల్' అను బిరుదునిచ్చి, పాదుషా తన అంతఃపురములో చేర్చుకొన్నాడు కనుక, ఆమె బిరుదము ననుసరించి 'హైదరాబాదు' అను పేరు పెట్టబడి ఉండవచ్చునన్నది మొదటిది. షియామతస్థులందరు ఒక హిందూ వేశ్యాంగన పేరు పట్టణానికి పెట్టటాన్ని అధిక్షేపించారు కనుక ఆమె మరణానంతరము భాగ్యనగరమును హైదరాబాదుగా వ్యవహరించటానికి పాదుషా నిశ్చయించాడన్నది రెండవ ప్రవాదము. ఈ పట్టణము పాదుషా కుమారుడు హైదర్ పేరున పిలువబడుతున్నదనే వాదము మరియొకటి. కాని చారిత్రకముగా ఇది వాస్తవమైనదికాదు. అతడికి కుమార్తెయేగాని కుమారులు లేరు. అతడి తరువాత సింహాసన మధిష్ఠించినవాడు అల్లుడు. ఇతడు పాదుషాకు తమ్మునికుమారుడు. ఈ ప్రవాదాలన్నిటిలో మొదటిదే సమంజసముగా కనబడుతుంది.

మహమ్మదు కులీ కుతుబ్‌షా తరువాత వచ్చిన పాదుషాలు అనేక భవనాలను మసీదులను నిర్మించారు. మసీదులలో మణిదీపము వలె ఉన్న మక్కామసీదును సుల్తాన్ కులీ కుతుబ్‌షా ప్రారంభించగా, అబ్దుల్లా కుతుబ్‌షా కొనసాగించి పూర్తిచేశాడు. అబుల్ హసన్ తానీషా కాలములోను, ఔరంగజేబు కాలములోను కొంత పని జరిగినది. మక్కా మసీదు సుమారు 10 వేలమంది ప్రార్థనచేయుటానికి సమావేశము కాదగినంత వైశాల్యముకలది. ఇది 1023 హిజ్రీలో నిర్మింపబడ్డది. ఈ నిర్మాణానికి 2000 మంది రాళ్లు కొట్టేవాళ్లు, 2000 మంది తాపీ పని వాళ్లు, 4000 మంది కూలీలు నియమింపబడ్డారు. దీని పొడవు 210 అడుగులు. వెడల్పు 129 అడుగులు. ఎత్తు 147 అడుగులు. తానీషా ఈ కట్టడముమీద 8 లక్షలు ఖర్చుపెట్టి, 'మక్కా మసీదు' నామకరణము చేశాడు.

అబుల్ హసన్ తానీషా నిర్మించిన గోషా మహలు జలయంత్రాలతో కళాకాంతులతో కన్నుల పండువుగా ఉండేదట. రాణివాసస్త్రీలకొరకు మందిరాలనుకట్టించి, రమ్యోద్యానాలను పెంపుచేశాడు. ఇక్కడనే గోలకొండతో సంబంధముగల పెద్ద సొరంగమొకటి ఉన్నదని వదంతి. గోలకొండ దుర్గముమీద 'బాలా హిస్సారు' మందిరమునమూలగా ఒక చిన్న ద్వారము ఉన్నది. అది గోషామహలుకు పోయే సొరంగ ద్వారమని వాడుక.

నగరపు ఉత్తర దక్షిణభాగాలను కలపటానికి మూసీ నదిమీదుగా నాలుగు వంతెనలు నిర్మింపబడ్డాయి; అవి పురానాపుల్, చంపా ముస్లింజంగు వంతెన, అఫ్జుల్ వంతెన, చాదరఘాటు వంతెన అని పిలువబడుతున్నాయి. వీటిలో పురానాపుల్ భాగ్యనగర నిర్మాణానికి 14 సంవత్సరాలకు పూర్వము మహమ్మదు కులీ కుతుబ్‌షా తండ్రిచే నిర్మింపబడ్డది. దీని మొదటి పేరు 'నడవ.'

భాగ్యనగర స్థాపకుడయిన కులీకుతుబ్‌షా ఆజ్ఞల ననుసరించి, సరదారులు, నవాబులు, భాగ్యవంతులు మూసీనదికి దక్షిణముగా నగరములో పెద్దపెద్ద భవనాలుకట్టి, నగరాన్ని పెంపుచేశారు. నగరము మూసీనదికి దక్షిణముగా వృద్ధిపొందుతున్నప్పటికీ కుతుబ్‌షాహీ సుల్తానులకు గోలకొండదుర్గమే రక్షణ దుర్గముగా ఉండేది.

గోలకొండ ఖిల్లాలో రామదాసు బందీగా ఉన్నాడన్నది ఆబాలగోపాల మెరిగిన చరిత్రాత్మకమైన విషయము. పూర్వము దీనికి మానుగల్లు అను పేరుఉండేది. అప్పుడది ఒక కుగ్రామము. ఆ ప్రాంతము కాకతీయ సామ్రాజ్యములో చేరిఉండేది. కాకతీయ రాజులలో ఒకరు మానుగల్లులో ఒక మట్టికోటను నిర్మించారు. అది మానుగల్లు కోట అని పిలువబడేది. దక్షిణ భూభాగాన్ని బహమనీ నవాబులు పరిపాలిస్తున్న కాలములో, సుల్తాన్ కులీకుతుబుల్ ముల్క్ కుతుబ్‌షా తెలంగాణా ప్రాంతానికి సుబేదారుగా నియమింపబడ్డాడు. బహమనీ నవాబయిన మహమ్మదుషా 1518 లో మరణించాడు. అతడితో బహమనీ రాజ్యము అంతరించిపోయినది. వెంటనే తెలంగాణాకు సుబేదారుడయిన కులీకుతుబ్‌షా స్వతంత్రుడయినాడు. తన స్వాతంత్ర్యాన్ని నిలుపుకోవటానికి తగిన కట్టుదిట్టాలు చేసుకోనారంభించాడు. రాజ్యరక్షణకు కోట అవసరము; కనుక తగిన స్థలముకొరకు విచారించుతూ ఉండగా గొజ్జెలనుకొనే గొల్లవాడు మానుగల్లు కోటను సూచించాడు. అన్నివిధములా తగిఉన్న ఆ ప్రదేశాన్ని రాజు మెచ్చుకొని అక్కడ రాతితో కోటగట్టాడు.

అమెరికా వచ్చి వైద్య శాస్త్రంపై ఉపన్యాసాలు ఇవ్వవలసిందన్న ఆహ్వానం పురస్కరించుకొని, సుప్రసిద్ధ హాంగేరియ శాస్త్రవైద్యుడు జెనో పోల్యా 1940 లో న్యూయార్కు వెళ్లారు. ఓడ దిగగానే విలేఖరులు చుట్టుముట్టి, 'యూరప్‌లో పరిస్థితుల'పై ఆయన అభిప్రాయం చెప్పమన్నారట.

"అబ్బే. రాజకీయాల గురించి నాకు బొత్తిగా ఏం తెలీదు" అన్నాడు డా॥ పోల్యా "పోనీ మీ రివ్వబోయే ఉపన్యాసాల గురించి నాలుగు ముక్కలు చెప్పండి" అన్నారు విలేఖరులు.

"ఆ విషయం గురించి మీకు అసలు ఏమీ తెలియదుగా" అన్నారు డా॥ పోల్యా.

ఆ ప్రాంతములో పూర్వము గోపులదాసు అనే సాధువు తపస్సుచేసుకొంటూ ఉండేవాడట. అతడికి ఒక గొల్లవాడు పాలు వగైరా సమర్పించుతూ ఉండేవాడు. ఆ గొల్లవాడికి తనమీద భక్తిభావము బాగా కుదిరినదని తెలిసికొన్న తరువాత, ఆ సాధువు ఒకనాడు పెద్దకొయ్యలో నూనె పోసి కాగపెట్టి, ఆగొల్లవాడిని దానిచుట్టూ ప్రదక్షిణము చేయుమని ఆదేశించాడు. గొల్లవాడామాటలను విశ్వసించి ప్రదక్షిణము చేస్తూ ఉండగా ఆ సాధువు అతని కాళ్ళూ చేతులు పట్టుకొని ఆ నూనెలో పడవేయటానికి ప్రయత్నించాడు. గొల్లవాడది గ్రహించి ఆ సాధువునే ఉపాయముతో దానిలో పడవేశాడు. నూనెలోపడ్డ సాధువు మరి కొంతసేపటికి బంగారు విగ్రహమయి నిలిచాడట. గొల్లవాడది చూసి భయపడి, ఆ విగ్రహాన్ని ఆ సమీపమున ఉన్న బావిలో పడవేశాడు. ఆ బావి గోలకొండ ఖిల్లాలో యిప్పటికీ 'గోపులదాసు బావి' అని పిలువబడుతున్నది. చాలా కాలము క్రిందట జరిగిన బంగారు విగ్రహగాథను దివ్యదృష్టిచేత తెలిసికొని కొండయ్య అనే గొల్లవాడు అబ్దుల్లా కుతుబ్ షాకు తెలుపగా, ఆయన ఆ విగ్రహాన్ని బయటికి తీయించి, దానివల్ల వచ్చిన ధనముతో కోటను రాలతో కట్టించాడని ఒక కథ ప్రచారములో ఉన్నది.

ఆ కొండయ్య 1651 లో, ఖరనామ సంవత్సర భాద్ర పదశుద్ధ పంచమీ శుక్రవారమునాడు మంత్ర తంత్రాలతో పులగముపోసి కోటకు పునాది వేయిస్తూ కొన్ని షరతులు పెట్టాడట; 'ఈ కోటకు గొల్లకొండ అనే పేరే ఉండాలి. పేరు మార్చరాదు. కుతుబ్‌షాహీలు కొండయ్య వంశస్థులవద్ద ప్రతి సాలుకూ ఆశీర్వచనాలు తీసుకొంటూ ఉండాలి. ఏ పాదుషా అయినా ఈ నియమాలు తప్పినట్లయితే గద్దె పరాధీనమయిపోతుంది. కొండయ్య వంశీయులు కంట తడిపెట్టితే లక్ష్మి కన్నీటితో రాజ్యము వాసి వెళ్ళిపోతుంది!

ఈ నిబంధనలకు వ్యతిరేకముగా నడుచుకొన్నందుకు 1687 లో కుతుబ్‌షా వంశము నశించి, గోలకొండ దుర్గము మొగలుల స్వాధీన మయిపోయింది. ఔరంగజేబు 17 వ శతాబ్దపు చివరి భాగములో గోలకొండ కడపటి సుల్తానైన తానీషామీద ఆగ్రహము వహించి, హైదరాబాదును ఆక్రమించి, దారుజ్జహాద్ (Darojjahad) అని పేరు పెట్టాడు. (కాఫరులకు వ్యతిరేకముగా యుద్ధము చేయు స్థలమని అర్థము.) దానికి కారణము అతడి దృష్టిలో గోలకొండ మంత్రులయిన అక్కన్న మాదన్నలు కాఫరులు. వారిని చేరదీసిన షియా మతస్థుడయిన తానీషాకూడా కాఫరే.

పైన పేర్కొనబడిన 'ఫర్‌ఖుందబున్యాద్' అన్న పేరుకూడా ఔరంగజేబు వాడుకలోనికి తెచ్చినట్లు ప్రవాదమున్నది.

ఈ విధముగా, చెంచలం, భాగ్యనగరు, ఫర్‌ఖుంద బున్యాద్, హైదరాబాదు, దారుజ్జహాద్ అన్న పేర్లలో ఈ నగరానికి హైదరాబాదు అన్న పేరే ప్రసిద్ధిచెంది, ఈ నాటికీ నిలిచిపోయింది. అప్పటి హైదరాబాదు అన్నిదిక్కులా విపరీతముగా పెరిగి నేటికి మహానగరమైనది. ముఖ్యముగా నదికి ఉత్తరభాగమున ఎక్కువగా వ్యాపించింది. ఇప్పుడు హైదరాబాదు 96 చదరపుమైళ్ళ వైశాల్యము కలిగిఉన్నది. ఇప్పటి జనాభా సుమారు 14 లక్షలని అంచనా వేయబడ్డది.

'ఆంధ్ర తెలంగాణా రాష్ట్రాలు రెండూ ఒకదానితో ఒకటి ఐక్యమై పెద్దరాష్ట్రముగా ఒకటవ అక్టోబరు నాటికి ఏర్పడబోతున్నవి. భారతదేశపు ప్రధాన నగరాలలో ఆరవదయిన హైదరాబాదు పెద్దరాష్ట్రానికి రాజధానిగా విలసిల్లబోతున్నది. ఇది ముక్కోటిఆంధ్రుల చిరకాలవాంఛ.

[ఈ వ్యాసము వ్రాయటానికి Historical and Descriptive Sketch of His Highness The Nizam's Dominions అను గ్రంథము, పండిత ఆదిరాజు వీరభద్రరావుగారి 'హైదరాబాదు నగర చరిత్ర' అను 29-6-1954 నాటి రేడియో ప్రసంగము తోడ్పడినవి.] ★

ముద్దు పేర్లు

సుబ్రహ్మణ్యాన్ని సుబ్బులు అని పిలిచినట్లే పాశ్చాత్యులుకూడా పేర్లు పొట్టిచేసి రాబర్ట్‌ని బాబ్ అనీ, తామస్‌ని 'టాం' అని పిలుస్తారు. అమెరికా అధ్యక్షుడు శ్రీ ఐసెన్‌హోవర్ తల్లికి ఈ పద్ధతి అంటే మహా చిరాకుట. ఐసెన్‌హోవర్ అన్నలిద్దరిలో ఒకరిపేరు ఆర్థర్, రెండవ అతని పేరు, ఎడ్వర్డ్ వాళ్లని 'ఆర్ట్' అనీ, 'ఎడ్' అనీ అంతా పిలిచేవారు. మూడో కొడుకు (ఐసెనహోవర్) కు ఇలా జరుగకుండా చెయ్యాలని గట్టిగా ఆలోచించి, డ్వైట్ అని పేరు పెట్టిందావిడ.

ఇవాళ డ్వైట్ ఐసెన్‌హోవర్‌ని అందరూ 'ఐక్' అంటారు.

బాలసాహిత:

సీసాలో తమాషా

పూర్వం వెంకన్న అనే కట్టెలు కొట్టేవా డొకడు ఉండేవాడు. వాడు చాల బీదవాడు. అందుచేత అతడు ప్రతిరోజూ ప్రొద్దుటినుండి చీకటి పడేవరకూ ఎంతో కష్టపడి పనిచేసేవాడు. ఆ విధంగా శ్రమపడగా కొన్నాళ్ళకి అతడు కొంత ధనాన్ని కూడబెట్టగలిగాడు.

ఒకరోజున అతడు తన కొడుకుతో ఇట్లా అన్నాడు: "ఎన్నాళ్ళనుంచో చెమటోడ్చి కష్టించిన ఫలితంగా ఈమాత్రం ధనం సంపాదించగల్గాను. నువ్వు నాకు ఒక్కగాను ఒక్క బిడ్డవు. ఈ డబ్బు నీ చదువుకి ఖర్చు పెట్టాలని నా ఉద్దేశ్యం. ఈ ద్రవ్యంతో నీవు పెద్ద చదువులు చదివి గొప్పవాడివై ముసలితనంలో నాకు ఆసరాగా ఉండి నన్ను ఉద్ధరిస్తావని నా ఆశ. ఇందుకు నువ్వు ఏమంటావు?"

"సరే, అట్లాగే చదువుతాను" అని తన అంగీకారాన్ని తెలియజేసేడు, వెంకన్న కొడుకు నాగరాజు.

తండ్రి కోర్కె ప్రకారం నాగరాజు ఒక పేరొందిన స్కూల్లో ప్రవేశించాడు. తండ్రి తనకోసం పడే కష్టాన్ని కళ్ళార చూచిన నాగరాజు, శ్రద్ధగా చదువ నారంభించాడు. అతడు ఎంతో పొదుపుగా డబ్బు ఖర్చుపెడుతున్నాడు. అయినా కొన్నాళ్ళకి తన తండ్రి సంపాదించిన కాస్త డబ్బూ అయిపోయింది. స్కూల్లో జీతం కట్టడానికీ, పుస్తకాలు కొనుక్కునేందుకు చేతిలో చిల్లిగవ్వ లేదు. అందుచేత నాగరాజు యింటికి వచ్చేశాడు.

"ఏం నాయనా, అనుకోకుండా యిలా వచ్చావు? యిప్పుడేం శలవులు లేవుగా? అలా వున్నావేం?" అంటూ ప్రశ్నలవర్షం కురిపించాడు నాగరాజు తండ్రి, వెంకన్న.

నాగరాజు తండ్రికి తను వచ్చినందుకు కారణం చెప్పాడు.

చాపలి సాంబశివరావు

"అయ్యో, నా దగ్గర ఏమీ లేదే! ఏం చేయను?... ఈ కరువు రోజుల్లో నా సంపాదన తిండికే చాలటం లేదు; ఇంకా కొంత మిగిల్చి నీ చదువుకు ఏం పంపగలను?....." అన్నాడు వెంకన్న విచారంగా.

"పోనీలే నాన్నా! విచారించకు-నా చదువు ఇంతటితో ఆగిపోవటం భగవంతునికి యిష్టమైతే, మన మేం చేస్తాం? ఇదీ మన మంచికే వచ్చిందేమో! నువ్వు మనస్సులో బాధపడకు" అన్నాడు నాగరాజు తండ్రితో.

తర్వాత వెంకన్న అడవిలో కట్టెలు కొట్టి, నాలుగు డబ్బులు సంపాదించటానికి బయలుదేరాడు.

"నేను కూడా నీతో వస్తా నాన్నా. నీకు సహాయం చేస్తాను" అన్నాడు నాగరాజు.

"నువ్వు వద్దులే నాయనా - కండలు కరిగేట్టుగా నువ్విక్కడ పని చేయలేవు; నీకు అలవాటులేదు. అదీగాక నాదగ్గిర ఒక్క గొడ్డలి మాత్రమే ఉంది. ఇంకోటి కొందామంటే డబ్బు లేదు" అన్నాడు వెంకన్న.

"నేను పని చేయగలను నాన్నా. గొడ్డలి లేకపోతే ప్రక్కయింటివారి దగ్గర ఎరువు తీసుకురా" అన్నాడు నాగరాజు.

అందుమీదట వెంకన్న ప్రక్కింటివారి దగ్గర్నుంచి ఒక గొడ్డలి తెచ్చాడు, కొడుకుకోసం.

*　　*　　*

మర్నాడు తెల్లవారుజామునే నిద్రలేచి, తండ్రీ కొడుకు లిద్దరూ కలిసి అడవికి వెళ్ళారు.

అడవిలో నాగరాజు కట్టెలు కొట్టడంలో తండ్రికి చాలా సాయపడ్డాడు. అతడు చాలా నేర్పుగాను చురుకుగాను పనిచేశాడు.

మధ్యాహ్న మయ్యేసరికి వెంకన్న "ఇక పని చాలించరా అబ్బాయి! భోంజేసి, కాస్సేపు విశ్రమించినతర్వాత, మళ్ళీ గొడ్డలి ఎత్తుకుందాం" అన్నాడు. తండ్రీ కొడుకు లిద్దరూ మూటకట్టుకొచ్చిన అన్నం తిన్నారు.

"నాన్నా, నువ్విక్కడే పడుకో. నేను కాస్త అట్లా పోయి, పిట్టల గూళ్లు ఏమైనా దొరుకుతాయేమో

చూసివస్తాను. నే నింకా అలసిపోలే దులే!" అన్నాడు నాగరాజు తండ్రితో.

"రెండు మెతుకులు తిన్నావో లేదో అప్పుడే ఎక్కడికి పోతావురా? కూర్చో. పిచ్చికగూళ్ళకోసం, కాకిగూళ్ళకోసం తిరిగి తిరిగి అలసిపోయి వస్తే, నువ్వసలు గొడ్డలి పట్టుకోగలవా? చెప్పు - నా మాట విని కాస్సేపు మెదలకుండా కూర్చో" అని గదమాయించాడు వెంకన్న కొడుకుని.

కాని నాగరాజు తండ్రి మాట లక్ష్యపెట్టలేదు. ఊం వేసుకుంటో, ఏమన్నా పిట్టలగూళ్లు దొరుకుతాయేమోనని, చెట్లఆకుల గుబురుల్లో తొంగిచూస్తో, ముందుకు సాగిపోయాడు. ఇటూ అటూ అతడు చాలసేపు తిరిగాడు. కాని ఎక్కడా ఒక్క గూడు అయినా కనపడలేదు.

పట్టుదలతో అతడు యింకా పిట్టలగూళ్ళకోసం వెదుకుతూ, ఒక మర్రిచెట్టువద్దకి వచ్చాడు. "ఈ చెట్టుమీద చాలా గూళ్ళు ఉండవచ్చు" అనుకుంటూ నాగరాజు తల పైకెత్తి చెట్టుకేసి ఆట్టే చూడసాగాడు. ఇంతలో అతనికొక వింత స్వరం విన్పించినట్లయింది. నాగరాజు చెవి ఒగ్గి సరిగా విన్నాడు. నూతిలో గొంతుకమాదిరిగా ఏదో అరుపు—"నన్ను విడిపించు! నన్ను విడిపించు!" అని.

నాగరాజు ఆశ్చర్యపడుతూ, నాలుగువైపులా చూశాడు, ఎవరా అరిచేదని. కాని ఎవ్వరూ కన్పడలేదు. శబ్దం భూమిమీదనుంచి వస్తున్నట్టు గ్రహించాడతడు. అందుచేత, "నువ్వెక్కడున్నావ్?" అని ప్రశ్నించాడు.

"ఇదిగో. ఇక్కడ-ఈ మర్రిచెట్టు తొర్రలో యిరుక్కుని వున్నాను. నన్ను విడిపించు! నన్ను విడిపించు!" అని సమాధానమిచ్చింది ఆ గొంతుక.

చీకటిగా వున్న మర్రి చెట్టు తొర్రలో పరీక్షగా చూడసాగాడు నాగరాజు. చివరికి అతనికొక గాజు సీసా కన్పించింది.

సీసాని వెలుతురులోకి తీసుకువచ్చి నాగరాజు పరిశీలనగా చూశాడు. కప్పలాగా ఏదో సీసాలో క్రిందికీ పైకీ ఎగిరిపడుతోంది—"నన్ను విడిపించు! నన్ను విడిపించు!" అని అరుస్తో.

ఏదైనా కీడు సంభవిస్తుందేమోనని ఆలోచించకుండా, నాగరాజు సీసామూత తెరిచాడు.

వెంటనే సీసాలోని పదార్థం బయటికి ఉరికి, పెరిగి పెరిగి పెద్దదై, కన్నుమూసి తెరిచేసరికల్లా, నాగరాజు ఎదుట భయంకరాకారంతో, ఒక పెద్ద రాక్షసుడికిమల్లె ప్రత్యక్షమైంది. అది తప్పకుండా దయ్యమై ఉంటుందని ఊహించాడు నాగరాజు.

ఇంతలో ఆ భయంకరాకారం గర్జించింది, "ఈ సీసాలోనుంచి నన్ను తప్పించినందుకుగాను, నేను నీకిచ్చే ప్రతిఫలం ఏమిటో నీకు తెలుసా?" అని.

"తెలియదు," ధైర్యంగా భయపడకుండా జవాబిచ్చాడు నాగరాజు; "నా కెట్లా తెలుస్తుంది?"

"సరే, నేనే చెపుతాను; నేను నిన్ను చంపెయ్యాలి" అన్నది దయ్యం కఠినంగా.

"ఆ మాట నువ్వు నాకు మొట్టమొదటే చెప్పాల్సింది" అన్నాడు నాగరాజు.

"ఇన్నాళ్లనుంచి నన్ను ఈ సీసాలో ఎవరన్నా దయ తలిచి మూసివుంచారనుకుంటున్నావా? లేదు; అది నాకు శిక్ష. నేనొక దేవదూతను. నన్ను విడిపించినవాడి గొంతుక నేను నులిమెయ్యాల్సిందే!" అంది దయ్యం.

"శాంతించు! శాంతించు!

"నువ్వు నన్ను చంపుతానంటున్నావ్, బాగానే ఉంది కాని, నాకొక చిన్న సందేహం కలిగింది— ఇంత పెద్ద ఆకారంగల్గిన నీవు అంత చిన్న సీసాలో ఎట్లా యిమిడివున్నావో నాకు బోధపడడంలేదు; అసలు నువ్వు నిజంగా దయ్యానివేనా? అని నా అనుమానం. కాబట్టి నువ్వు ఆ సీసాలోకి పోవటం కళ్లారా చూస్తే, నేను నీ మాటలు నమ్ముతాను. అప్పుడు నువ్వు నీ యిష్టప్రకారం నన్ను ఏమైనా చెయ్యి" అని సమయస్ఫూర్తిగా అన్నాడు నాగరాజు.

"అదెంత పని! చాలా తేలిక!" అని గర్వంగా అంటూ ఆ దయ్యం చాలా సన్నగా మారిపోయి మళ్లీ సీసాలోకి దూరిపోయింది. దయ్యం పూర్తిగా సీసాలోకి దూరిందో లేదో, వెంటనే నాగరాజు సీసాకి బిరడా పెట్టేసి, దాన్ని తిరిగీ మర్రిచెట్టు తొర్రలోకి విసిరేశాడు.

నాగరాజు మళ్లీ తండ్రివద్దకు పోదామనుకుంటూండగా, దయ్యం మళ్ళా దీనంగా అరవసాగింది— "నన్ను విడిపించు! నన్ను విడిపించు!" అని.

"ఉహుఁ! నేను విడిపించను! పాపం గదా అని విడిపిస్తే, నన్ను

★ సీసాలో తమాషా ★

చంపటానికి ప్రయత్నిస్తావా? నిన్ను ఇంకోసారి నేను విడిపించను నువ్వు ఆ సీసాలోనే చావు!" అన్నాడు నాగరాజు కసిగా.

"నన్ను గనక నువ్వు విడిపిస్తే, నీ జీవితమంతా సుఖంగా గడిచిపోయేట్టు చేస్తాను" అన్నది దయ్యం.

"నేను నిన్ను నమ్మను. ఇంతకు ముందు చేసినట్లే, నువ్వు నన్ను మోసపుచ్చుతావు" అన్నాడు నాగరాజు.

"కాళ్లదగ్గరకొచ్చిన సిరిని తన్నుకుంటున్నావు. నేను నీకేమీ అపకారం చేయను; ఎంతో మేలు చేకూరుస్తాను" అంది దయ్యం.

"సరే, ధైర్యం చేసి చూస్తాను. బహుశా ఈ దఫా దయ్యం తన మాట నిలబెట్టుకోవచ్చు. నాకేమీ అపకారం చేయకపోవచ్చు" అనుకున్నాడు నాగరాజు తనలో.

అలా అనుకుని, అతడు మళ్లీ సీసా మూత తీశాడు. అదివరకటి వలెనే దయ్యం బయటికి ఉరికింది. తన ఆకారం పెంచి పెంచి ఒక పెద్ద రాక్షసుడికిమల్లె నిల్చుంది.

"ఇదిగో, ఇప్పుడు నీ బహుమతి అందుకో!" అంటూ దయ్యం నాగరాజుకి ఏదో వనమూలికవంటి వస్తువు అందించింది.

"ఏదైనా కురుపుకి ఈ మూలిక కొన అంటించావంటే, ఆ కురుపు తక్షణమే నయమౌతుంది; దీని రెండో కొనతో నీవు ఉక్కును గాని, ఇనుమును గాని రుద్దావంటే, అవి వెండిగా మారిపోతాయి" అని చెప్పింది.

"సరే, ఈ మూలిక మహిమ ఏమిటో చూస్తాను!" అంటూ నాగరాజు ఒకచెట్టువద్దకి పోయి, గొడ్డలితో దానిబెరడు కొద్దిగా ఊడగొట్టాడు; బెరడు ఊడిన భాగాన్ని మూలికతో తాకాడు; వెంటనే చెట్టుకి తగిలినగాయం మానిపోయింది.

"భేష్! బాగుంది. మనం యిక విడిపోవచ్చు" అన్నాడు నాగరాజు.

తనను విడిపించినందుకుగాను, దయ్యం నాగరాజుకు తన కృతజ్ఞత తెల్పుకొంది. తనకి మంచి బహుమతియిచ్చినందుకుగాను, నాగరాజు దయ్యానికి తన కృతజ్ఞత తెల్పాడు.

తర్వాత అతడు తిన్నగా తండ్రి వద్దకి వెళ్ళాడు.

"ఇందాకట్నుంచీ ఎక్కడ తిరుగుతున్నావ్?" అని అడిగాడు తండ్రి. నాగరాజు మాట్లాడలేదు.

"నీ పనిసంగతే మరచిపోయావే! ఇలాంటి పనులు నువ్వు చేయలేవని నేను ముందే చెప్పాను" అన్నాడు తండ్రి కోపంగా.

"ఇంతవరకు చేయవలసిన పని అంతా నిమిషంలో చేసేస్తానాన్నా! నువ్వు ఏమీ కంగారు పడకు" అని సమాధానమిచ్చాడు, నాగరాజు.

"ఆ చేస్తావ్——చేయకేం!" అన్నాడు తండ్రి హేళనగా.

"ఇదిగో చూడు నాన్నా, ఆ చెట్టుని ఒక్క దెబ్బలో పడగొడతాను" అంటూ నాగరాజు గొడ్డలిని మూలికతో రుద్దాడు; గొడ్డలితో బలంగా చెట్టుమీద కొట్టాడు.

కాని, గొడ్డలి 'వెండి'గా మారిపో వటం చేత, దాని మొన కాస్తా మొక్కపోయింది.

"అరెరె, చూశావా నాన్నా, నువ్వు నాకు ఎటువంటి గొడ్డలి యిచ్చావో; దాని కనలు పదును లేనేలేదు" అన్నాడు నాగరాజు.

తండ్రి భయపడ్డాడు. "హారి, ఎంత పని చేశావురా? ఆ గొడ్డలి మనది కూడా కాదు; ప్రక్కింట్లో ఎరువు తెచ్చాను. దాన్ని కాస్తా నువ్వు చెడగొట్టావు కాబట్టి, యిప్పుడు నేను వాళ్లకి డబ్బు ముదరా యివ్వాలి. ఇప్పుడేం చేయాలో నాకు తోచటం లేదు" అన్నాడు.

"కోప్పడకు నాన్నా. ఆ గొడ్డలి ఖరీదు నేను వాళ్లకి త్వరలో యిచ్చేస్తాను" అన్నాడు నాగరాజు.

"నేను యిస్తే తప్ప, నీదగ్గిర దమ్మిడీ ఉండదే; అటువంటిది నువ్వు వాళ్లకి ముదరా ఎట్లా ఇవ్వగలవురా?" అని తండ్రి, తన ధోరణిలో పడి, కట్టెలు కొట్టసాగాడు.

"నాన్నా, నేనిక పని చేయలేను యింటికి పోదాం రా" అన్నాడు నాగరాజు, నెమ్మదిగా.

"ఏమన్నావ్? ఇంటికి వెళ్లామంటావా? యింటికి వెళ్లి నాలుగు మెతుకులు తినాలంటే, కట్టెలు కొట్టాలా, అక్కర్లేదా?......నేను రాను నువ్వు వెళితే వెళ్లు" అన్నాడు తండ్రి కోపంగా.

నాగరాజుకు, అడవికి రావటం అదే మొదటిసారి కావటంచేత, యింటికి త్రోవ తెలియదు. చివరికి నాగరాజు పట్టిడిమీద, కోపం తగ్గిపోయాక, వెంకన్న యింటికి బయలుదేరాడు.

* * *

ఇంటికి చేరుకున్నాక, వెంకన్న కొడుకుతో, మొక్కపోయిన గొడ్డలిని అమ్మకు రమ్మని, ప్రక్కింటి వారికి ముదరా చెల్లించటానికిగాను అతడు మరికొంత సొమ్ము ఎక్కడన్నా సంపాదించవలసి వుంటుందనీ చెప్పాడు.

అందుమీదట నాగరాజు బస్తీకి వెళ్లాడు. అక్కడ బంగారపు పని చేసే కంసాలికి, తన మొక్కపోయిన గొడ్డలిని చూపెట్టాడు. ఆ కంసాలి గొడ్డలిని పరీక్షించి, వెండి అవునో కాదో తేల్చుకున్నాడు. తర్వాత తూనికలో పెట్టి తూచి, "దీని ఖరీదు మూడు వేలు ఉంటుంది. అంత డబ్బు నావద్ద లేదు" అన్నాడు.

"సరే, మీవద్ద ఎంత ఉంటే అంతే ఇవ్వండి; మిగతాది తర్వాత యిద్దురుగాని" అన్నాడు నాగరాజు.

కంసాలి నాగరాజుకి ఎనిమిది వందల రూపాయలు యిచ్చాడు. మిగతా డబ్బు త్వరలో సర్దుబాటు చేస్తానన్నాడు.

నాగరాజు సంతోషంగా ఇంటికి వచ్చాడు.

"నాన్నా, ప్రక్కింటి వారిని, వాళ్ల గొడ్డలి ఖరీదు ఎంతో కనుక్కొనిరా; వాళ్ళకి ముదరా చెల్లించివేద్దాం" అన్నాడు.

"నాకు తెలుసు - దాని ధర సుమారు నాలుగు రూపాయలుంటుంది" అన్నాడు తండ్రి.

"ఓస్, యింతేనా! అయితే వాళ్లకి ఈ పది రూపాయలు ఇచ్చేసెయ్. ఎందుకనంటే, ఇటు చూడు-నావద్ద కావలసినంత డబ్బు ఉంది" అంటూ నాగరాజు తండ్రికి అయిదు వందల రూపాయలు యిచ్చాడు.

"దీంతో హాయిగా జీవిద్దాం, నాన్నా! నీకింక డబ్బుకొరత లేదు కదూ?" అన్నాడు సంతోషంగా.

"ఆఁ! ఎంత అదృష్టం!...అయితే యింత డబ్బు ఎక్కడ సంపాదించావ్?" అన్నాడు తండ్రి ఆశ్చర్యంగా.

అప్పుడు నాగరాజు,జరిగిన సంగతంతా పూస గుచ్చినట్టు తండ్రికి చెప్పాడు. తన అదృష్టాన్ని నమ్ముకుని, తను ఏవిధంగా సాహసం చేసిందీ, దయ్యం తనకి ఎలా బహుమతి యిచ్చిందీ, అంతా వివరంగా చెప్పాడు. ఇక నాగరాజుతండ్రి ఆనందానికి మేరలేదు.

తర్వాత నాగరాజు, తన మూలికప్రభావంవల్ల, ఎంతో వెండిని తయారుచేసి, బోలెడంత ధనం సంపాదించాడు.

కాని ఆడబ్బుతో అతడు, కులాసాగా కాలం గడుపుతూ కూర్చో లేదు. అతడు మళ్ళీ చదువులో ప్రవేశించి, కాలేజిలో మంచి డిగ్రీలు ఎన్నో పొందాడు. డాక్టరుపరీక్ష కూడా ప్యాసయ్యాడు.

తర్వాత కొన్నాళ్లకి, అతడు డాక్టరుగా ప్రాక్టీసు, మొదలు పెట్టాడు. ఎటువంటి వ్రణాలనైనా, ఎంత నయంకాని కురుపులనైనా, యిట్టే మాన్పించగల 'మూలిక' తనవద్ద ఉండటం చేత, అతడు గొప్ప శస్త్రచికిత్సకుడుగా పేరు పొందాడు.

—("గ్రిమ్స్ ఫేరీ టేల్స్"నుండి.)

★

మంత్రి కొట్టించిన టోకరా

చాలాకాలం క్రిందట ఒకవూళ్ళో ఒకరాజు ఉండేవాడు. అతనికి ఒకమంత్రి వుండేవాడు. వాళ్లిద్దరూ చాలా స్నేహముగా వుండేవారు. రాజుకి ఒక కొడుకు మంత్రికి ఒక కొడుకూ వుండేవారు. వీరిద్దరూ యించుమించు ఒకే వయస్సువారు. ఒకేగురువుదగ్గర విద్యాభ్యాసం చేసేవారు. రాజుకొడుకు చాలా తెలివైనవాడు. అయితే మంత్రి కొడుకు అంతకంటె తెలివైనవాడు. రాజుకొడుక్కి సుగుణాలు చాలా వున్నవి. కాని ఒక్క దుర్గుణం మాత్రం వుంది. అదేమిటంటే ఈర్ష్య: ముఖ్యంగా తనకంటె యితరు లెవరయినా ఎక్కువ తెలివితేటలుగలవారంటే అసలు సహించ లేడు.

కొన్ని సంవత్సరాలకి ముసలి రాజూ, ముసలి మంత్రీ చచ్చిపోయారు. రాకుమారుడు రాజూ, మంత్రికుమారుడు మంత్రీ అయ్యారు. కొంతకాలంవరకూ బాగానే గడిచింది. కాని రాను రాను క్రొత్త మంత్రి తెలివితేటల ఖ్యాతి రాజ్యమంతా ప్రాకేటప్పటికి రాజు ఉండపట్టలేకపోయాడు. అతనిని ఎలాగయినా దేశములోంచి వెడలగొట్టెయ్యాలని నిశ్చయించుకున్నాడు. ఒకరాత్రి నిద్ర మానుకుని బాగా ఆలోచించి ఒక పన్నాగము పన్నేడు.

మరునాడు మంత్రిని పిలిపించి యిలా అన్నాడు. "మన తండ్రులిద్దరూ ఎంతో అన్యోన్యంగా వుండేవారు. పైగా మన మిద్దరము బాల్య స్నేహితులము. ఇదీ కాక ప్రజలందరూ నీవే నాకన్న ఎక్కువ తెలివైనవాడవంటున్నారు. ఇలాంటప్పుడు ఈ రాజ్యంఅంతా నేనొక్కడనే ఏలడం ఏమీ బాగా లేదు. అందుచేత నీకు సగం భాగం యీయ దలచుకున్నాను. కాని ఏ

సి. బి. జగన్నాధరావు

పరీక్షా లేకుండా నీకు అర్ధరాజ్యము ఇచ్చేస్తే ప్రజలేమయినా అనుకుంటారని మాత్రం భయంగా వుంది. కనుక ఒక చిన్న పరీక్ష పెడదాము. అదేమిటంటే సరిగా ఒక్కలాంటివి రెండు కాగితపు ముక్కలు తీసుకొని వాటిలో ఒకదానిమీద 'మంత్రికి సగము రాజ్యము యీయాలి' అని వ్రాస్తాను. రెండవ దానిమీద 'మంత్రి దేశము వదలి వెళ్లిపోవాలి' అని వ్రాస్తాను. ఈ రెండు చీటీలు సమముగా మడతపెట్టి, గిలకరించి నా దోసిలిలో పట్టుకుంటాను. అందులో నీకు నచ్చినది నీవు ఏరుకో. అప్పుడు ఆ చీటీలో ఎలాగుందో ఆప్రకారము చేద్దాము. అంటే దానిమీద 'మంత్రికి సగము రాజ్యము యీయాలి' అని వుంటె నేను వెంటనే నీకు నా రాజ్యములో సగము ఇచ్చివేస్తాను. అలాకాక దానిమీద 'మంత్రి దేశము వదలి వెళ్ళిపోవాలి' అని వుంటే నీవు వెంటనే యీదేశము వదలి వెళ్ళిపోవాలి."

రాజు యిలాగున అంటోంటే అతనేదో కుట్ర పన్నుతున్నాడని మంత్రి గ్రహించాడు. కాని అతనిని టోకరా కొట్టించలేమా అన్న ధైర్యంతో ఆ పరీక్షకు తక్షణము వప్పుకొన్నాడు. ఈ సంగతి దేశమంతా చాటింపించారు. నాలుగు మూలలనించీ ప్రజలనేకమంది చూడడానికి వచ్చేరు. నిర్ణయించిన రోజున రాజు నిండుకొలువులో సమానముగా మడతపెట్టిన రెండు కాగితం చీటీలు గిలకరించి తన దోసిలిలో పట్టుకున్నాడు. నదురూ బెదురూ లేకుండా మంత్రి చేతికి వచ్చినది ఏరుకుని వెంటనే దానిని తన గుప్పిడిలో పెట్టుకున్నాడు. సభంతా ఇసుకవేస్తే రాలకుండా ప్రజలతో నిండివున్నా చాలా నిశ్శబ్దంగా వుంది.

తను చాలా తెలివైనవాడననుకున్న రాజు ఎలాగయినా మంత్రిని దేశంలోంచి పంపెయ్యాలన్న నిర్ణయముతో, లోపాయికారీగా నిజముగా ఏమిచేశాడంటే రెండుచీట్ల మీదాకూడా 'మంత్రి దేశము వదలి

భిక్షుక శాసనం

పూర్వం స్వర్ణముఖి అనే రాజ్యాన్ని చంద్రపాలుడు అనే రాజు పరిపాలిస్తూ వుండేవాడు. అతని రాజ్యంలో అనేకమంది భిక్షుకులుండేవారు. తనరాజ్యంలో భిక్షుకులనలే లేకుండా చేయాలనే వుద్దేశ్యం కలిగింది చంద్రపాలునికి. ఖజానా నుండి ఏటా కొంతధనాన్ని భిక్షుకులకు పంచి పెట్టిస్తుండేవాడు. అందుచేతనయినా రాజ్యంలో బిచ్చమెత్తుకుతిరిగేవారు తగ్గి ప్రతిఒక్కడు ఏదో పని సంపాదించుకొని తమ పొట్టలు పోసుకుంటూ రాజు చేసిన మేలుకు సంతసిస్తారనుకొన్నాడు పిచ్చి చంద్రపాలుడు. "బూడిదలో పోసిన పన్నీరు" సామెతగా రాజ్యంలోవున్న ప్రజలందరు రాజు పంచిపెడుతున్న ద్రవ్యాన్ని ఆర్జించడం మొదలెట్టారు.

ఒకదినమున తన మంత్రియయిన చక్రధరుని పిలిచి "చక్రధరా! సంవత్సరమునుండి నేను భిక్షుకులను మనరాజ్యంలో లేకుండా చేయు నిమిత్తమై ఖజానానుండి ద్రవ్యాన్ని ఖర్చుచేసే ఏర్పాటు చేశాను. ఈ సంవత్సరపు జనాభాలో ఎంతమంది భిక్షుకులకు పనిపాటలుదొరికాయో చూడాలని వుంది — అందుచేత రేపు మన రాజ్యంలో చాటింపు వేయించి వారంరోజులలో లెక్కలు తెల్పాలి" అంటూ శాసించాడు.

ఆజ్ఞ శిరసా వహించి చక్రధరుడు చాటింపు వేయించాడు. తదుపరి రాజ్యంలోని లెక్కలు వ్రాయడానికిగాను పరివారంతో బయలుదేరాడు. ఇదివరలో వ్యవసాయం చేసుకుంటూ జీవితం గడుపుతున్న రైతులు, మరి ఇతర కూలి ప్రజలు ఎంతోమంది రాజు పంచుతున్న ద్రవ్యాన్ని ఆర్జిస్తున్నట్లుగా చూపెట్టబడ్డారు. ఈ విధంగా చక్రధరుడు తన పరివారాన్ని వెంట నిడుకొని రాజధాని చేరుకున్నాడు.

చక్రధరుని రాకకు పూర్వం చంద్రపాలుడు తన మనస్సులో "ఈ పాటికి నారాజ్యంలో భిక్షుకులు తగ్గిపోయి ప్రతి ఒక్కరికి పని దొరికి నేను చేసిన మేలుకు ఎంతో పొగుడుతారు," అనుకుంటూ ఎంతో సంతోషించసాగాడు. మంత్రిగారు రాజభవనానికి చేరుకుని లెక్కలన్నింటిని చూపగా చంద్రపాలుడు ఆశ్చర్యంతో "చక్రధరా! నేనొకటి తలచిన దైవమొకటి తలచునుగదా! నారాజ్యంలో ఏ భిక్షుకుడైనా తిరగకుండా చేయాలనే వుద్దేశ్యంతో ఖజానా నుండి ఎంతో ఖర్చుపెట్టాను. మన రాజ్య ప్రజలు ఈ విధంగా దొరుకుతున్న ధనానికి ఆశపడి తమ వ్యవసాయ పనులు కూడ మానుకొని ఖజానా లూటీ చేశారు. ఈరోజునుండి భిక్షుకులు నాకంట పడితే వారికి మరణ దండనే శిక్షగా విధిస్తున్నా—వారిని చూడకూడదం"టూ కఠినంగా శాసించాడు— ★

"నక్షత్రం"

వెళ్ళిపోవాలి' అని వ్రాసేడు. కనుక మంత్రి ఏచీటీతీసుకున్నా అతను దేశమువదలి వెళ్లుట తప్పదని రాజు ఉద్దేశ్యము. రాజు యిలా వ్రాసేడన్న సంగతి ఎవరికీ తెలియదు. కాని అతన్నికంటె తెలివితేటలు ఎక్కువున్న మంత్రి అతనిని టోకరా కొట్టించాడు.

రెండు కాగితాలమీదా కూడా తాను దేశం వదలి వెళ్ళిపోవాలని రాజు వ్రాసివుంటాడని మంత్రి ఊహించాడు. కనుక తనదగ్గరనున్న చీటీ గట్టిగా చేతితోపట్టుకుని ఇలా అన్నాడు. "రాజా! ఒక కాగితం ముక్కమీద నాకు సగమురాజ్యము ఇస్తానని, రెండవదానిమీద నేను దేశంవదలి వెళ్ళిపోవాలని తమరు వ్రాసేరు. నేను తీసుకున్న కాగితంలో ఎలావుంటే అలా చేస్తామన్నారు. ఇదిగో నా చేతిలోని కాగితంముక్కకు నిప్పంటించి కాల్చివేస్తున్నాను. ఇప్పుడు తమ చేతిలోని కాగితం విప్పండి. అందులో నేను దేశం వదలి వెళ్లాలని వుంటే, నా దగ్గరవున్న కాగితం మీద నాకు అర్థరాజ్యము యిస్తామని వుండివుండాలి. ఆ ప్రకారం చెయ్యమని నా మనవి." మంత్రి యిలా అని కాగితంముక్క కాలిచి వేసేసరికి గత్యంతరము లేక రాజు తన చేతిలో కాగితం చీటి విప్పి, సభ్యులకు చూపించి, మంత్రికి అర్థ రాజ్యము యిచ్చాడు. ★



(గతసంచిక తరవాయి)

తరవాత యుద్ధనౌక న్యూజెర్సీ తీరంఆనుకునే ప్రయాణంసాగించింది. తీరంమీది కోటలలోనించి మా యుద్ధనౌకకు గౌరవసూచకంగా గబగబా ఫిరంగులు మోగాయి. అమెరికా పతాకం మూడుసారులు ఎగరవేస్తూ మా యుద్ధనౌక ఆ గౌరవాభినందనాలు స్వీకరించింది. ఆ సమయంలో ఆ పతాకంమీది 39 నక్షత్రాలు తళతళ మెరిశాయి.

ఆ తరవాత మళ్లీ వేలాది పౌరులు హర్షధ్వానులు చేస్తూ నౌకకు తమ అభినందనాలు తెలియజేశారు. అలాగే ఎంతో హుందాగా సాగిపోతూ అబ్రహామ్ లింకన్ క్రమక్రమంగా అట్లాంటిక్ సముద్రంలో ప్రవేశించింది.

కెప్టెన్ ఫరాగూ చాలా గొప్ప నౌకాధికారి. నిజానికి మా యుద్ధనౌక, అతను భిన్నవ్యక్తులనడానికి వీలులేదు. ఇద్దరు ఒకటే. మా నౌకకతను ఆత్మవంటివాడు.

ఇంక ఆ బ్రహ్మాండమయిన తిమింగిలం మాట. దాని ఉనికి విషయంలో మా కెప్టెన్ కేమీ అనుమానం లేదు. అది తప్పకుండా సముద్రంలో ఉండితీరాలని అతని గట్టి నమ్మకం. దాన్ని హతమార్చి వెయ్యాలనీ సముద్ర ప్రయాణాల

* ~~~~~~~~~~~~~~~~ *

అనువాదం:

"వినాయక"

జరిగిన కథ:—

అది 1866 వ సంవత్సరం ప్రారంభం. సాగర గర్భంలో బ్రహ్మాండమైన జలజంతువేదో కనిపించిందనే వార్త ప్రపంచప్రజలను విభ్రాంతులను చేసింది. సముద్రంలో ప్రయాణంచేసే నౌకలకది ఇట్టే కనిపించి ఇట్టే మాయమయ్యేది. ఒకరోజు ఒకచోట కనిపించి, మరొక రోజు కొన్ని వేల మైళ్ళ దూరంలో ప్రత్యక్షమయ్యేది. కొన్ని నౌకలకు దానివలన చిన్న చిన్న ప్రమాదాలు సంభవించాయి. కొందరది ఏదో గొప్ప జలచరమై ఉండాలనీ, కొందరు అది మునిగిపోయిన కొండ గుట్ట కావచ్చునసీ, కొందరది పెద్ద జలాంతర్గామి అయిఉంటుందనీ రకరకాలుగా వాదించసాగారు. ఏమైనా దానివలన నాగరిక ప్రపంచానికి, ముఖ్యంగా నౌకాప్రయాణాలకి ప్రమాదం సంభవించవచ్చునని అందరూ అభిప్రాయపడ్డారు. దాని అంతు కనుక్కొని హతమార్చాలని ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. అమెరికా ప్రభుత్వం అబ్రహాం లింకన్ అనే యుద్ధనౌకను ఆ జలజంతువును వేటాడడానికి నియమించారు. అమెరికా ప్రభుత్వ నౌకాశాఖా కార్యదర్శి హాబ్సన్ ఫ్రెంచి ప్రకృతిశాస్త్రపరిశోధకుడు ప్రొఫెసర్ అరోనాను ఈ విజ్ఞానయాత్రలో పాల్గొనవలిసిందని ప్రార్థిస్తాడు. అతడు వెంటనే దాని కంగీకరించి తన పరిచారకుడు కాన్సిల్‌తో సహా ఓడ ఎక్కుతాడు. అబ్రహామ్‌లింకన్ క్రమక్రమంగా పసిఫిక్ మహాసముద్రంలో ప్రవేశిస్తుంది.

బాలగేయం:

తువ్వాయి హాయి

"తంగిరాల"

పెరటిలో పాకలో - పెద్ద ఆవుంది
ఆ తెల్ల ఆవుకొక బుల్లితువ్వాయి.
చెంగు చెంగున దూకు చిన్నితువ్వాయి
ఘల్లు ఘల్లున మ్రోగు గజ్జలన్నియును
మాపాప, తువ్వాయి ఆడుకుంటారు
పాపాయి తువ్వాయి పాడుకుంటారు!

కటిక చీకటి క్రమ్మె ఒకనాటి రాత్రి
మిణుగురైనను లేదు మింట నెచ్చటను.
పాపాయి బువ్వతిని పండుకున్నాది.
తువ్వాయి ఆకలికి తూలిపోయింది,
"అంబ అంబా" అంటు అరవసాగింది—
పాపాయి కనుచుండె బంగారు కలలు—

ఆకలికి తువ్వాయి కేక లేసింది
పెంకిగా తువ్వాయి రంకె వేసింది.
అదిరింది కట్రాడు కదలిపోయింది
సన్నరంగుల త్రాడు సడలిపోయింది.
చల్లగా పాలకై తల్లిఁ జేరింది
పెల్లుగా పాలిచ్చె తువ్వాయి తల్లి

పాలన్ని త్రాగింది బుల్లి తువ్వాయి
"త్రేవు" మని త్రేన్చింది బుల్లితువ్వాయి!!
బలవలా తూర్పంత తెల్లవారింది
తువ్వాయి దరిజేరె బుల్లిపాపాయి.
ఆరోజు తువ్వాయి రంకేయలేదు
మెడలోని మువ్వల్లు మాటాడలేదు

మెల్లిగా పడుకుంది బుల్లితువ్వాయి
చల్లగా చూచింది బుల్లితువ్వాయి!
గట్టిపడె తువ్వాయి చిట్టి కడుపంత
బూరిలా ఉబికింది బుల్లి బొజ్జంత!

కేవిధమైన ఆటంకాలు లేకుండా చెయ్యాలనీ అతడొక దృఢనిశ్చయానికి వచ్చివేశాడు. అతని దృఢనిశ్చయాన్ని బట్టిచూస్తే రెండే రెండువిషయాలు స్పష్టపడిపోయాయి: కెప్టెన్ ఫరాగూ ఆ తిమింగిలాన్నైనా చంపాలి! లేకపోతే ఆ తిమింగిలం కెప్టెన్ ఫరాగూనైనా చంపాలి! అంతే!—ఇంక వేరేమధ్యే మార్గమేమీ లేదు!

ఇక ఆ ఓడ ఉద్యోగులు కూడా కెప్టెన్ ఎంత అంటే అంతే అని కూర్చున్నారు. నిద్రాహారాలు లేకుండా రాత్రింబగళ్లదేపనిగా తిమింగిలంకోసం ఎదురుచూశారు. వాళ్లంతా దాన్ని గురించి అదేధోరణిలో మాట్లాడుతూ వాదోపవాదాలు సాగించడం చూస్తే—నాకదంతా చాలా విచిత్రంగా కనిపించింది. కొంతమంది ఓడ కొయ్య మధ్యభాగందాకా ఎక్కి అక్కడ కట్టుకర్రలపై కూర్చుని కనురెప్ప వెయ్యకుండా తిమింగిలం కనబడుతుందేమోనని ఎదురుతెన్నులు చూశారు. సామాన్యంగా అక్కడ కూర్చోవడమంటే ఎవరికైనా మహా చెడ్డచిరాకు. టాపుమీద కూర్చోలేనినావికులు కొంతమంది ఓడతాళ్లు మొదలైనవి కట్టేచోట గుమిగూడారు. అయితే ఎంతగా కళ్లు కాయలు కాచేటట్లు వెతికినా యుద్ధనౌక ఆ తిమింగిలంఉన్న సాగరగర్భం సమీపానికికూడా పోలేకపోయింది.

ఇంక మిగిలిన ఓడ సరంగులందరు తిమింగిలాన్ని వల వేసిపట్టుకుని బరబరా ఓడమీదికి లాగివేసి తరవాత దాన్ని ముక్కముక్కలుగా నరికివెయ్యాలని ఉవ్విళ్లూరారు. మొట్టమొదటగా ఆ జంతువును పసిగట్టి వెంటనే తెలియజేసిన వారికి 2 వేల డాలర్లు బహుమతీ ఇస్తానని ఓక కెప్టెన్ ప్రత్యేకంగా ఒక ప్రకటన చేశాడు. కెప్టెన్ ఫరాగూ జలజంతువులను పట్టుకోడానికి కావలిసిన పరికరాలన్ని అందరికీ బాగా అందుబాటులో పెట్టించాడు. పెద్ద చేపలను పట్టుకోవడంకోసం ప్రత్యేకంగా కట్టిన ఓడలలోకూడా ఇన్ని పరికరాలుండడం కష్టం. వాటిలో కొన్ని 10 మైళ్లదూరంవరకు బల్లాలు ఈటెలు మొదలైన మారణాయుధాలు విసిరివెయ్యగలవు. ఇంతేకాక బల్లెం సరిగా గురిచూసి విసిరివేయడంలో అసమాన ప్రజ్ఞ గలిగిన ఒక వ్యక్తి కూడా మా ఓడలో ఉన్నాడు.

★ సాగరగర్భంలో సాహసయాత్ర ★

ఇతని పేరు నెడ్ లాండ్. ఈ విద్యలో ఆరితేరినవారందరిలోను మరిఇంతటి వాడు లేడు.

ఇతడు కెనడా దేశీయుడు. ఈ విద్యలో ఇతడు సంపాదించిన చాకచక్యం నిరుపమానం. ఎలాంటి పెద్ద చేప అయినా ఇతని దెబ్బతో హాత మారిపోవలసిందే! ఇతని వయస్సు దాదాపు నలభై సంవత్సరాలు. మంచి పొడగరి. సుమారు ఆరడుగులుంటాడు. కోపం వస్తే ఇతనికి మరి పట్టపగ్గాలుండవు. ఉక్కుగుండు లాంటి మనిషి. అతని క్రీగంటి చూపులు వాడి శూలాలే! ఆ చూపులు చూసేసరికి ఎలాంటివారికైనా ఇతనంటే భయభక్తు లేర్పడతాయి. ఇతన్ని వెంటపెట్టుకురావడం చాలా తెలివైన పని. కెప్టెన్ ఈ విషయంలో చూపిన చాకచక్యం అపూర్వం. ఓడలో ఉన్న నావికులంతా ఒక ఎత్తు. నెడ్ లాండ్ ఒక్కడు ఒక ఎత్తు. డేగ చూపులోను, జబ్బసత్తువలోను ఇతనితో సాటిరాగలవారెవరు లేరు. నిజాని కితడొక అత్యద్భుతమయిన దూరదర్శినీయంత్రంలాంటి వాడు. ఆ దూరదర్శినీ యంత్రానికి సరిగా గురిచూచి కాల్చే శక్తి కూడా ఉంటే నెడ్ లాండ్‌ను సరిగా దానితో సరిపోల్చవచ్చును. నెడ్ లాండ్ జన్మజన్మాలకు మరపురాని వ్యక్తి.

ఇంతకీ ఆ తిమింగిలం విషయంలో అతని అభిప్రాయమేమో కనుక్కోవాలని నాకు కొంత తహతహ బయలుదేరింది. కాని అతని కా జలజంతువంటే ఏమీ నమ్మకం లేదు. మొత్తంమీద ఓడ జనాభా అంతటిలోను ఈ విషయం లో ఏ మాత్రం నమ్మకంలేని వ్యక్తి ఇతడొక్కడే!

తరవాత అలాగలాగ మూడు వారాలు గడిచిపోయాయి. మా యుద్ధనౌక కేప్ బ్లాంక్‌కు అభిముఖంగా ప్రయాణం చేస్తూంది. అది అర్జెంటీనా తీరానికింకా 30 మైళ్ళ దూరంలో ఉంది. ఇంకొక వారంరోజులు ప్రయాణంచేస్తే మా నౌక పసిఫిక్ మహాసముద్రంలో ప్రవేశిస్తుంది.

నెడ్ లాండు, నేను ఓడకు వెనక భాగంలో ఒకచోట కూర్చుని అదే పనిగా లోకాభిరామాయణం మాట్లాడుకుంటున్నాము. మధ్య మధ్యన అగాధమైన ఆ సాగరగర్భ గాంభీర్యం తలుచుకొంటూంటే మాకెంతో ఆశ్చర్యం వేసింది. తరవాత మా ప్రసంగం ఆ అద్భుత జల జంతువుమీదికి తిరిగింది. క్రమేపి అది మాకు పట్టుబడే అవకాశాలను గురించి చర్చించాము. క్రమక్రమంగా నెడ్ లాండ్ నేను చెప్పేదంతా శ్రద్ధగా ఆలకిస్తూ కూర్చున్నాడు. అంతేగాని తన అభిప్రాయమేదీ తెలియ జెయ్యలేదు. అతడు తన అభిప్రాయమేదో స్పష్టంగా చెప్పితీరాలని నే నెన్నో విధాల బలవంతపెట్టాను.

"నెడ్ లాండ్! అయితే అలాంటి తిమింగిలమేదీ సముద్రంలో ఉండనే ఉండదంటావా? నీకంత అపనమ్మకం కలగడానికి కారణమేమిటి?"

నెడ్ లాండ్ రెండుమూడు నిమిషాలదేపనిగా నావైపు చూశాడు. తరవాత మెల్లిమెల్లిగా చేతివేళ్ళతో నుదుటిమీద తాటించాడు. సామాన్యంగా కొంత లోతుగా మాట్లాడవలసివచ్చినపు డతడలాగా చేస్తూంటాడు. ఒకనిమిషం బాగా ఆలోచించి నాతో ఇలా గన్నాడు:

"నా అపనమ్మకాని కేవో కొన్ని కారణాలున్నాయి."

"పెద్ద పెద్ద సముద్రజంతువులను గురిచూచి వేటాడడమే నీ వృత్తి. నీ వెన్నెన్నో పెద్దపెద్ద జంతువులను చూచి ఉంటావు! అందుచేత అత్యద్భుతమైన పెద్ద తిమింగిల మేదో ఉన్నదని ఊహించడం నీ వంటి వాడికి చాలా తేలిక. కాని నీవే అది ఉండడానికి వీల్లేదని వాదించడం చూస్తే నాకు చాలా ఆశ్చర్యంగా ఉంది!"

"అక్కడే మీరు పొరబడుతున్నారు. సామాన్యజనం అలాంటి అత్యద్భుత జంతువులు సముద్ర గర్భంలో ఉండి తీరాలని అనుకుంటారు. కాని అలాంటి కట్టుకథలు శాస్త్రవేత్త లెవరు నమ్మరు. నేనూ అలాంటివాణ్ణే. నా అనుభవంలో పెద్ద పెద్ద తిమింగిలాల నెన్నింటినో చూచాను. కొన్నింటిని నా బల్లెం పోట్లతో చంపి వేశాను కూడాను. వాటికి చాలా పెద్ద పెద్ద కోరలే ఉన్నాయి. అవి ఎంత పెద్ద కోరలైనా వాటికి ఓడ అడుగుభాగంలో తాపటం చేసిన ఇనపరేకులు కూడా చీల్చివేసే శక్తిఉన్నదంటే మాత్రం నేను నమ్మలేను!"

"కాని కొన్ని తిమింగిలగిలాలు ఓడల అడుగురేకులు చీల్చి వేశాయనడానికి ప్రబలమైన నిదర్శనాలున్నాయి."

"అవి కొయ్యఓడలతో తయా ప

చేసిన ఓడలై ఉంటాయి. నేను స్వయంగా నాకళ్ళతో చూస్తేతప్ప అలాంటి వేవీ నమ్మలేను!"

"నెడ్‌లాండ్! దయచేసి నేను చెప్పేదంతా జాగ్రత్తగా విందూ!"

"అయ్యా! మీరు లక్షచెప్పండి! అదేదో బ్రహ్మాండమయిన జలజంతువంటే మాత్రం నేను నమ్మలేను! మీకుమాత్రం అదంటే బాగా గట్టినమ్మకం కుదిరినట్లుందే"

"అవును! నిజమే! యథార్థవిషయాలు కొన్ని పరిశీలించినతరవాతే నేనీ నిశ్చయానికి వచ్చాను. ఆ జంతువు చాలా పెద్దదై ఉండాలనీ దానికి ఓడ అడుగుభాగంలో ఉన్న ఇనపరేకులుకూడా చీల్చివేసే శక్తిగల కోరలుండాలనీ నిశ్చయించాను!"

నెడ్‌లాండ్ అదిఎంతమాత్రము నమ్మలేని వ్యక్తిలాగ బింకంగా తల పంకించాడు.

నేను మళ్ళీ అందుకొన్నాను. సాగరగర్భంలో అలాంటి అత్యద్భుతమైన జంతువంటూ ఉండడమే తటస్థిస్తే దానికి ఇంతకుముందెన్నడూ కనివిని ఎరగనంతటి శక్తి సామర్థ్యా లుండి తీరాలని అన్నాను.

"దాని కంతటి శక్తి సామర్థ్యాలెందుకుండాలి?"

"అదే చెబుతున్నాను! జాగ్రత్తగా విను! సాగరగర్భం అట్టడుగున జీవించాలంటే ఆ జంతువుకు అత్యద్భుతమైన శక్తి సామర్థ్యాలుండితీరాలి. నీవు నీటిలో 32 అడుగుల లోతున ఉన్నావంటే నీ మీద 97 వేల 5 వందల పౌనులనీటి ఒత్తిడి ఉన్నదన్న మాట. ఇంకొక పదిఇంతలు నీటి లోపలికి వెళ్ళావంటే నీమీద ఒత్తిడి ఇంకా పదింతలదాకా పెరుగుతుంది. అలాగలాగ సాగరగర్భంలోలోపలికి పోయినకొద్దీ నీ మీది నీటి ఒత్తిడి కూడా పెరిగిపోతూంటుంది."

"అబ్బా! అలాగా!"

"మరేమిటనుకున్నావు! ఆ పరిస్థితులలో సాగరగర్భం అట్టడుగున జీవించే జలజంతువులకు ఆ అపారమైన నీటి ఒత్తిడి భరించడానికి అనువుగా మాంచి బలమైన అస్థిపంజరము, ఉక్కు ముక్కల్లాంటి ఎముకలు ఉండాలి!"

"అంటే వాటికి 8 అంగుళాల మందం ఉన్న ఇనప కవచాల వంటి చర్మాలుండాలన్న మాట!"

"అన్న మాటేమిటి? ఉండి తీరతాయి! అలాంటి జంతువులు అతివేగంగా ఓడ అడుగు భాగానికి ఢీకొన్నాయంటే ఎంత గట్టి దెబ్బతగులుతుందో ఊహించుకో!"

అయినా నెడ్‌లాండ్ అలాంటి జంతువు లున్నాయని నమ్మలేకపోయాడు.

"పోనీ నేనుచెప్పింది నీకు బాగా సబబుగా కనిపించిందా? లేదా?"

"నిజమే! మీరు చెప్పినట్టుగా అలాంటి జంతువులు సముద్రం అట్టడుగున ఉంటే వాటికి అంతటి శక్తి ఉండడం సబబే!"

" అలాంటి జంతువు లుండకపోతే స్కోటియా కలాంటి అఘాతం ఎలాగ తగిలింది?"

"అయితే-అయితే-మరి-" అని నెడ్‌లాండ్ నీళ్లు నమిలాడు.

"తటపటాయిస్తా వెందుకు?"

"ఏమో నాకంతటి పెద్ద జంతువు లున్నాయని నమ్మకం కలగడం లేదు!"

ఈ సమాధానంవల్ల నెడ్‌లాండ్ పట్టి మొండిఘటం అన్నమాట స్పష్టపడింది! అంతే! అందుచేత నేనావేళ అతన్ని అంతగా బలవంత పెట్టలేదు! స్కోటియాకు తగిలిన ఆఘాతంవిషయంలో ఎవరికీ పీసమంతైనా అనుమానంకలగలేదు! ఆ ఓడ అడుగున పడిన పెద్ద కన్నం అందరు కళ్లారా చూచారు. అది ఊరికే దానంతట అది పడిఉండదుగదా! పోనీ సముద్రం అట్టడుగున ఉన్న గుట్టలకేమైనా తగిలిందేమో అంటే అలాంటిదేమీ జరగనేలేదు. అందుచేత బ్రహ్మాండమయిన జలచరమేదో తప్పకుండా స్కోటియా అడుగున కన్నంచేసి ఉండాలి.

అది తిమింగిలగిలాల జాతికే చెందినదై ఉండాలనడంలో కూడా అనుమాన మేమీ లేదు! అయితే ఇది క్రమక్రమంగా కొంచెం సావకాశంగా తేల్చుకోవలిసిన విషయం. ఆ జలచరాన్ని జాగ్రత్తగా పరిశీలించాలంటే ముక్కలుముక్కలుగా కొయ్యాలి. అందుకోసం ముందుగా దాన్ని పట్టుకోవాలి. దాన్ని పట్టుకోవాలంటే బల్లెంతో పొడవాలి. దానికి నెడ్‌లాండ్ సాయపడాలి. నెడ్‌లాండ్ బల్లెంతో పొడవాలంటే ఓడ సరంగులు దాని ఉనికి పసిగట్టాలి. ఉనికి పసిగట్టాలంటే అది సముద్రంలో ఎక్కడో తారసపడాలి. అది అనుకున్నట్టుగా జరిగేది కాదుగదా! మరి అది ఇక ఎప్పుడు తారసపడుతుందో ఆ దైవానికే ఎరుక!

4. యథేచ్ఛా ప్రయాణం

ఆతరవాత కొన్నాళ్ళ దాకా మాయుద్ధనౌక యాత్రతో అంతగా

★ సాగరగర్భంలో సాహసయాత్ర ★

చెప్పుకోదగ్గ విశేషాలేవీ కనిపించలేదు. పిమ్మట కొంతకాలానికి ఒక చిన్న సంఘటన జరిగింది. దానితో ఓడలో ఉన్నవారందరికీ బల్లెం విసరడంలో నెడ్‌లాండ్ శక్తిసామర్థ్యాలెలాంటివో తెలిసిపోయాయి.

అది జూన్ 30వ తేదీ. ఆనాడు ఓడ ఫాక్‌లాండ్ ద్వీపాల సమీపంలో నడుస్తూంది. ఆప్రాంతంలో మాకు పెద్దపెద్దచేపలను వేటాడే జాలరులు కొంతమంది కనిపించారు. వాళ్లు తమ కెప్పుడు తిమింగిలమే తగలలేదని చెప్పారు.

వారంతా మన్రో అనే నౌకలో ప్రయాణం చేస్తున్నారు. ఆ నౌక కెప్టెన్ తనకు సమీపంలో ఒక పెద్ద జలచరం కనబడిందనీ, దాన్ని పట్టుకోవడానికి నెడ్‌లాండ్ సాహాయ్యం కావాలనీ కోరాడు. కెప్టెన్ ఫరాగూకు నెడ్‌లాండ్ శక్తిసామర్థ్యాలెలాంటివో చూడాలని కోరిక కలిగింది. అందుచేత వెంటనే దానికంగీకరించాడు. ఆపైన నెడ్‌లాండ్‌కు కొంత అదృష్టం కూడా కలిసివచ్చింది. అతని బల్లెందెబ్బ తగిలేసరికి రెండు పెద్దజలచరాలు గిలగిల్లాడుతూ పైకి తేలిపోయాయి. వాటిలో మొదటిదానికి దెబ్బ సరిగా గుండెల్లోకే దూసుకుపోయింది. వెంటనే అది చనిపోయింది. ఇక రెండవచేప బల్లెపు దెబ్బ తాకిడికి బాగా అలిసిపోయి వెంటనే ఓడ సరంగులకు పట్టుబడిపోయింది.

నిజంగా అత్యద్భుతమైన తిమింగిలగిలమే ఉంటే అది నెడ్‌లాండ్ దెబ్బకు తట్టుకోలేక పరుగుచ్చుకోవలిసిందే!

తరవాత కొంతకాలానికి మా ఓడ పసిఫిక్ మహాసముద్రం మధ్యలోకి వెళ్ళిపోయింది.

అప్పటినించీ నావికులందరికీ అతి జాగ్రత్తగా ఉండవలిసిందని ఫర్మానాలు జారీఅయిపోయాయి. అందరి కళ్ళు దూరదర్శినీ యంత్రాలతో సహా సముద్రతరంగాలమీదే తిరుగుతున్నాయి. నావికులందరు ఆ రెండు వేలడాలర్ల బహుమతీ తామొక్కరే జేబులో వేసుకోవాలనే తహతహతో నిద్రాహారాలు లేకుండా రాత్రింబగళ్ళు దేపనిగా ఆ జలజంతువుకోసం వెతుకుతున్నారు. కొంతమందికి చీకటిలో చూపు బాగా ఆనుతుంది. అలాంటివాళ్ళు కూడా ఆ జంతువుకోసం కనురెప్పపాటు లేకుండా సముద్రతరంగాలు పరిశీలించారు.

నాకు మొదటినించీ డబ్బంటే లెఖ్ఖ లేదు. అయినా నేను ఓడటాపు మీదనించి ఆ జంతువుకోసం జాగ్రత్తగా పరిశీలిస్తూనే ఉన్నాను. ఏదైనా ఒక పెద్దచేప కెరటాలపైన కనిపించేసరికి మేమంతా "అదిగో! అదే ఆ జంతువు అయిఉంటుంది!" అని దానికేసి కళ్ళప్పగించి చూచేవాళ్ళము! క్షణంలో సరంగులంతా టాపుమీదికి వచ్చివేసేవారు. నేను కళ్ళు చీకట్లు కమ్మేదాకా అలాగే దానికోసం చూస్తూఉండేవాణ్ణి.

నెడ్‌లాండ్ మాత్రం ఇదేమీ పట్టించుకొనేవాడే కాదు. అతని దూరదృష్టి చాలా గొప్పది. కాని ఏం లాభం! తన కాలం అంతా చాలా వరకు నిద్రలోనో చదువులోనో గడిపివేసేవాడు! ఒకసారి ఆ ప్రస్తావన ఎత్తితే ఎంతో వెటకారంగా ఇలాగన్నాడు:

"ప్రొఫెసర్ అరోనా! ఆజంతువు ఎక్కడో ఉందంటే మాత్రం నాకేమీ నమ్మకంలేదు! ఒకవేళ అలాంటిదేదో ఒకటి ఉన్నదే అనుకుందాము. అయితేమాత్రం మనకది కనబడుతుందనే నమ్మకమేమిటి? ఊరికే తోచినట్టుగా యథేచ్ఛగా ప్రయాణంసాగించినంతమాత్రాన్ని ఉపయోగమేమిటి? ఉత్తర పసిఫిక్ మహాసముద్రంలో ఆజంతువు కనిపించిందని అంటున్నారు. అది జరిగి అప్పుడే రెండు నెలలయిపోయింది. అది ఎప్పుడూ ఒక్కచోటే అంటిపెట్టుకుని ఉండదుకదా! పైగా అది అత్యద్భుత వేగంతోపోయే జంతువు! అందుచేత ఈ పాటికది ఈ ప్రదేశం విడిచి చాలాదూరమే వెళ్లిపోయి ఉంటుంది!"

నాకు దీనికేమనాలో బోధపడలేదు! మేమంతా ఒకదిక్కు తెన్ను లేకుండా ఆమహాసముద్రంలో పడిపోతున్నామన్నమాట! కాక అంతకన్న చెయ్యగలిగింది మాత్రం ఏమిఉంది! మాకాజంతువు తప్పకుండా దొరికితీరుతుందన్న గట్టి నమ్మకమేమీ లేదు! కాని ఓడలో ఉన్నవాళ్ళలో చాలామంది ఆజంతువు తమకుకనబడితీరుతుందనే

గట్టిభరవసాతో ఉన్నారు. కొంత మంది దానిమీద పెద్దపెద్ద పందాలు కూడా కాశారు!

నిజంగా ఆ జంతువు కనబడక పోయినా కొంతమంది అది కనబడిందని కంగారుపడడం మొదలు పెట్టారు. అప్పటినించీ ఓడమీద ఉన్నవాళ్ళ కెవరికీ నిద్రాహారాలు లేవు. అలాగ అదేపనిగా సముద్ర తరంగాలు పరిశీలిస్తున్న నావికు డొకడు "అదిగో! కనబడింది!" అని కేక వేశాడు. దానితో ఓడలోని జనం అంతా అక్కడ గుమిగూడారు. చివరికి అక్కడ ఏమీ కనబడ లేదనీ అదంతా వట్టి భ్రమే అనీ తేలిపోయింది! దాంతో అందరూ చప్పబడిపోయారు. మా యాత్ర అలాగలాగ మూడు నెలలదాకా అదేవిధంగా సాగిపోయింది. ఆ మూడు నెలలు ఒక్కొక్కరోజొక యుగంలా గడిచింది. మా నౌక మొత్తంమీద ఉత్తర పసిఫిక్ మహా సముద్రం అంతా గాలించివేసింది. ఎక్కడైనా ఒక చిన్న తిమి గాని తిమింగిలం గాని కనబడేసరికి వెంటనే మా ఓడ దాన్ని వెంటాడించివేసేది! ఒక్కొక్కప్పుడు దారి తప్పించి ఇంకొకమార్గంలో వెళ్ళిపోయేది. దాదాపుగా చైనా జపాను తీరాలన్నీ పూర్తిగా గాలించి వెయ్యడం జరిగిపోయింది. కాని ఎంత శ్రమపడినా ఏమీ లాభం లేకపోయింది. చిట్టచివరికి మా కళ్ల కెదురుగా అపారమైన ఆ మహా సాగరజలంతప్ప మరేమీ కనిపించ లేదు! ఆ అత్యద్భుత జలచరం గాని, లేక తేలే కొండగుట్ట గాని— చివరికి కొంచెం పెద్దజలజంతువు గాని—ఏదీ కనిపించ లేదు!

దాంతో నావికులందరిలోను నిరుత్సాహం ప్రారంభమైంది. చాలామంది ఇక ఆజంతువు కనబడదనే నిశ్చయానికి వచ్చివేశారు. కొంతమంది లోలోపల తమ అవివేకానికెంతో చిన్నబుచ్చుకున్నారు. ఆపరిస్థితి తలుచుకోగానే మరికొంత మందికి ఒళ్లుమండిపోయింది. చాలా మంది సుఖంగా ఇంటిపట్టున పడి ఉండకుండా ఈ ఓడమీదికి ఎందుకు వచ్చామూ అని దిగులుపడ్డారు.

ఆదిగులు క్రమక్రమంగా చిన్న చిన్న సరంగులు మొదలుకొని పెద్ద పెద్ద నావికుల దాకా—అందరికీ అంటు వ్యాధిలా పట్టుకుంది. కొన్నాళ్ళకది బాగా ముదిరి పోయింది. కెప్టెన్ ఫరాగూ ఒక్కడు ఏమైనాసరే అని మొండిపట్టుపట్టి కూర్చోడంమూలాన మా ప్రయాణం అలాగ కొనసాగిందిగాని లేకపోతే మాఓడ తిరుగుముఖం పట్టి ఉండవలసిందే!

చాలామంది ఇంక దారితెన్నూ లేని ఆ నిరంతరయాత్ర ముగించి తీరాలని పట్టుపట్టారు. అమెరికా నావికులెవరు ఇంతకుముందెప్పుడు ఇంత ధైర్యోత్సాహంతో పనిచేసి ఉండలేదు! అందుచేత ఆ జంతు వింతవరకు కనబడలేదంటే అందులో వారితప్పేమీ లేదు. కనక ఇక వెళ్లిపోవడం తప్ప గత్యంతర మేమీ కనబడలేదు.

అందుచేత వెంటనే నావికదళాధిపతి కీవిషయంలో ఒకవిజ్ఞప్తి వెళ్లిపోయింది. కాని అతడీ విజ్ఞప్తికేమీ చలించలేదు! నావికులు కుండబద్దలు కొట్టినట్టు తమ అసంతృప్తి అంతా అతని ఎదుట వెళ్ళబోసుకున్నారు. అయినా ప్రయోజనమేమీ కలగ లేదు. దానిమూలాన నావికుల నిత్యకృత్య వ్యవహారాలలో కొంత అలసత్వంకూడా ఏర్పడింది. అంత మాత్రంచేత నావికులంతా తిరుగుబాటు చేశారని నా అభిప్రాయం కాదు. అలాగ కొన్నాళ్లు జరిగిన తరవాత నావికదళాధిపతికిక లొంగిపోక తప్పలేదు. ఒక్క మూడు రోజులు ఓపికపట్టవలిసిందని నావికు లందరికీ చెప్పాడు. ఆ మూడు రోజులలోను ఆ జంతువు కనిపించక పోతే యుద్ధనౌక తప్పకుండా వెనక్కి తిప్పివేస్తానని మాట ఇచ్చాడు.

అటుపిమ్మట మరి రెండురోజులు గడిచిపోయాయి. ఓడ ప్రయాణం చేసినంతమేర ఎరకోసం పెద్దపెద్ద మాంసంముక్కలు వెదజల్లించారు. సొరచేపలా మాంసం ముక్కల కోసం పైపైకి ఎగబడ్డాయి. నాలుగు వైపులకు చిన్న చిన్న నావలు పంపించారు. కాని ఎంతసేపటికీ ఏమీ జరగలేదు. అలాగ నవంబరు నాలుగో తేదీకూడా గడిచిపోయింది.

అక్కడికి జపానుతీరం ఇంచు మించుగా రెండు వందల మైళ్ళ దూరంలో ఉంది.

అప్పటికి ఎనిమిదిగంటలయింది. నేను ఓడ కుడిభాగంమీద నిలబడి

★ సాగరగర్భంలో సాహసయాత్ర ★

అతిజాగ్రత్తగా సముద్రతరంగాలు పరిశీలిస్తున్నాను. కాస్సెల్ సావక్కనే నిలబడ్డాడు. ఓడ అధికారులు చీకటిలో ఉపయోగించే కళ్లద్దాలు తగిలించుకొని అతిజాగ్రత్తగా దేనికోసమో ఎదురుచూస్తున్నట్లు నిలబడ్డారు. కాస్సెల్ ముఖంలో ఎప్పుడూ లేని కొత్త కుతూహలం మొలకెత్తింది.

"కాస్సెల్! నువ్వు 2 వేల డాలర్లు జేబులో వేసుకోవాలంటే ఇంతకంటె డారిమంచి తరుణం దొరకదు! జాగ్రత్తగా చూడు!" అన్నాను నే నతనితో.

"నౌకాధికారి 10 వేల డాలర్లు బహుమతి ఇస్తానన్నా - అతనికి వచ్చే నష్టం ఏమీ లేదు!"

"నీవన్నది అక్షరాలా నిజం! ఇదంతా ఒక దారీ తెన్నూ లేని వ్యవహారంలా తయారయింది. దీనివల్ల మన కాలమే కాక ఓరిమి కూడా మంటగలిసిపోయింది. నిజంగా అప్పుడే సరాసరిగా ఫ్రాన్సు వెళ్లిపోయి ఉండవలసింది."

"అవును! హాయి మంటూ మీ తోటలో కూర్చుని ప్రకృతిశాస్త్ర పరిశోధన సాగిస్తూఉందుము! పారిస్ పారిస్ అంతా మనతోటచుట్టూరా తిరుగుతూండేది."

"నిజమే! అంతే కాదు! ఇకనించీ మనమంతా బాగా నవ్వులపాలై పోతాము."

"నిజమే! మీరు చేసినపని చూసి అంతా అదేపనిగా విరగబడి నవ్వుతారు!"

"ఎందుకని"

"ఎందు కేమిటి? మీ లాంటి ప్రొఫెసర్లు సుఖంగా ఇంటిదగ్గర కూర్చుని పరిశోధనలు సాగించాలిగాని — ఇలాంటి తలా తోకా లేని వ్యవహారాల్లో దిగి నవ్వులపాలై పోకూడదు!—" అని కాస్సెల్ ఇంకా ఏదో చెప్పబోయాడు! ఇంతలోనే నెడ్‌లాండ్ అందరికీ వినబడేటట్టుగా గట్టిగా కేకపెట్టాడు.

"అదిగో అలా చూడండి! మనం ఇన్నాళ్లనించీ ఎదురుచూస్తున్నదదిగో అదిగో!"

—ఇంకా ఉంది.

న్యూఢిల్లీ లేఖ

(5-వ పేజీ తరువాయి)

భారతదేశం సహాయం చేస్తేగాని కాశ్మీర్ నిలబడలేదని మహారాజా భావించాడు. ఆరోజునే వి. పి. మీనన్ సలహామీద, మహారాజా భార్యాపుత్ర సమేతంగా శ్రీనగర్ విడిచిపెట్టాడు. చేరిక పత్రంమీద మహారాజా సంతకం చెయ్యడం, దాన్ని వి. పి. మీనన్ భారతరక్షణశాఖకు సమర్పించడం జరిగింది.

కాశ్మీర్‌తో జరిగిన 'యథాతథ ఒడంబడిక'ను గూర్చి వ్రాస్తూ "పటేల్ సలహా ప్రకారం సంస్థానాల శాఖవారు కాశ్మీర్‌ను బలాత్కారం చేస్తున్నట్లు కనిపించకుండా ఉండడానికి చాలా పాటుపడ్డారు. కాశ్మీర్ ఒకవేళ పాకిస్తాన్‌లో చేరినా భారతదేశం ఏమీ అనుకోదనికూడా స్పష్టంచేశారు" అని కాంబెల్ జాన్సన్ అన్నారు.

ఇక కాశ్మీర్ చేరిక క్రమబద్ధమా, అక్రమమా అనే ప్రశ్నకు తావులేదు. మహారాజా సంతకంచెయ్యడం, మౌంట్‌బాటెన్ దాన్ని అంగీకరించడంతో కాశ్మీర్ భారతదేశంలో అంతర్భాగం అయిపోయింది. దేశ విభజన ఒడంబడికల ప్రకారం కాశ్మీర్ చేరికపత్రం క్రమబద్ధమే అవుతుంది. ముస్లింలీగ్ అటువంటి చేరికను ఒప్పుకుంటుందని జిన్నా జూన్ 17, జులై 31 తేదీలలో చేసిన ప్రకటనలే దాఖలా ఉన్నాయి.

కాని మౌంట్‌బాటెన్ ప్రభువు కాశ్మీర్ చేరికకు అనుమతిస్తూ చేసిన ప్రకటనే అన్నిటికంటె వివాదాస్పదమైనది. "కాశ్మీర్‌లో శాంతిభద్రతలు ఏర్పడి, దాడిమూకలను పూర్తిగా తరిమివేసిన తరవాత జనవాక్య సేకరణద్వారా కాశ్మీర్ చేరిక విషయం నిర్ధారణ చెయ్యాలి," అని ఆయన అన్నారు.

ఈ షరతువల్ల కాశ్మీర్ చేరిక జనవాక్య సేకరణ జరిగేవరకే చెల్లుతుందికాని తరవాత చెల్లదని పాకిస్తాన్ వాదిస్తోంది. అయితే ఏ సంస్థానం చేరిక అయినా తగాదాలో పడినప్పుడు ప్రజావాక్యంద్వారానే దాన్ని పరిష్కరించాలనే భారతవైఖరిని మౌంట్‌బాటెన్ మహారాజాకు విస్పష్టంచేశారు. అంతమాత్రాన కాశ్మీర్ చేరికపై భారత ప్రభుత్వంచేసిన ఆమోదముద్ర అక్రమం కానేరదు. అంతేకాక దాడిమూకల్ని తరిమివేసి, శాంతిభద్రతలను నెలకొల్పిన తరవాతగాని జనవాక్యసేకరణ జరపడానికి వీల్లేదని మౌంట్‌బాటెన్ స్పష్టంగా చెప్పనే చెప్పారు.


ఈ స్పష్టీకరణ ప్రాముఖ్యం ఐక్యరాజ్య సమితి ఆ దరిమిలా జరిపిన సంప్రదింపులలో బాగా వ్యక్తమయింది. కాశ్మీర్ చేరిక అక్రమమయిందనీ, అందుచేత కాశ్మీర్‌కు సైన్యాలు పంపేహక్కు భారతదేశానికి లేదనీ పాకిస్తాన్ భద్రతామండలికి నచ్చచెప్పడానికి ప్రయత్నించింది. భారతదేశం మాత్రం కాశ్మీర్ చేరిక సరియైనదేనని, పాకిస్తాన్‌కు ఇందులో ప్రమేయం లేదని, పట్టినపట్టు విడవలేదు. గిరిజాతిమూకలకు పాకిస్తాన్ సహాయం చేయడం, 1948 మే లో కాశ్మీర్‌లోకి పాకిస్తానీసైన్యాలను దింపడం భారత, కాశ్మీర్ దేశాలపై దురాక్రమణకింద నే జమకట్టాలనీకూడా భారతప్రభుత్వం వాదించింది. అంతేగాక మౌంట్‌బాటెన్ ప్రభువు పెట్టిన నిబంధన నెరవేరితేనేగాని, జనవాక్య సేకరణ ప్రసక్తి గాదనికూడా ఉద్ఘాటిస్తూ వచ్చింది. ఆ నిబంధన ఇంతవరకూ నెరవేరనేలేదు. ★

Printed and Published for Nageswara Rao Estates (Private) Ltd., by S. Radha Krishna at The Andhra Patrika Press, 6 & 7, Thambu Chetty Street, Madras-1. Editor S. Sambhu Prasad.



చిలుకల జంట

—ఫొటో: డి. రామలింగేశ్వరరావు.


'ఓహో! లైఫ్‌బాయ్ సబ్బుతో
ఇప్పుడు స్నానం చేయుట అవసరం'
అది సంతృప్తి కరమైన
శుభ్రతాభావమును కలిగించును!
LIFEBUOY SOAP
LIFEBUOY
SOAP